
'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 296

మంగళవారం 17-1-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కోహ్లి జోర్‌దార్..

శ్రీలంకపై 317 పరుగులతో నెగ్గి సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా - 14లో



విశ్వసుందరి గాబ్రియెల్

2022 సంవత్సరానికి విశ్వసుందరిగా గాబ్రియెల్ (అమెరికా) ఎన్నిక.. - 6లో



యువ 'సాయం'...

'సాయిల్ ఈజ్ అవర్ సోల్' పేరిట వ్యవసాయ క్షేత్రాన్ని సృష్టించి నేటి తరాన్ని వ్యవసాయం వైపు మళ్లిస్తున్న యువకులపై కథనం..

- వివరాలు 5లో▶



అమెరికాలో మళ్లీ కాల్పులు..

అమెరికాలో మళ్లీ తుపాకీ గర్జించింది. సెంట్రల్ కాలిఫోర్నియాలోని గోషెన్‌లో జరిగిన కాల్పుల ఘటనలో ఆరుగురు మరణించారు.

- వివరాలు 6లో▶



క్షిపణి దాడిలో 40 మంది మృతి

ఉక్రెయిన్ నగరం డ్నీప్రోలోని ఓ అపార్టుమెంట్‌పై రష్యా చేసిన క్షిపణి దాడిలో 40 మంది మృతి చెందారు. 75 మంది గాయపడ్డారు.

- వివరాలు 6లో▶



ఆర్‌వీఎంలను అంగీకరించం

రిమోట్ ఓటింగ్ మెషీన్ (ఆర్‌వీఎం)లను అందుబాటులోకి తేవాలన్న ఎన్నికల సంఘం ప్రతిపాదనను ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి.

- వివరాలు 6లో▶



టీచర్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- పదోన్నతులకు కూడా ఓకే
- సంక్రాంతి వేళ ఉపాధ్యాయులకు ప్రభుత్వం తీపి కబురు

పదోన్నతులు, బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మంగళ, బుధ వారాల్లో ఇందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదలవుతుందని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆశిస్తున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మంత్రులు హరీశ్‌రావు, సబిత ఇంద్రారెడ్డి ఆదివారం ఆయా సంఘాల నేతలతో సమాలోచనలు జరిపారు. అనంతరం బదిలీలు, పదోన్నతులకు సీఎం కేసీఆర్ అంగీకారం తెలిపారని, త్వరలోనే షెడ్యూల్ విడుదల చేస్తామని సబిత తెలిపారు. సంక్రాంతి కానుకగా ఈ శుభవార్త చెబుతున్నట్టు ఆమె పేర్కొన్నారు.

10 లో

పాలమూరు బరిలో షా!

తెలంగాణ నుంచి లోక్‌సభకు పోటీ చేసే అవకాశం

బీజేపీ కోర్ గ్రూప్ సంకేతాలు

- రాష్ట్రంలో అధికారం.. దక్షిణాదిలో అత్యధిక లోక్‌సభ స్థానాలపై కన్ను
- తెలంగాణలో 10–12 ఎంపీ సీట్లలో గెలుపే లక్ష్యం
- పార్టీ అగ్రనేత పోటీతో రాష్ట్ర నేతల్లో సీరియస్‌నెస్ పెరుగుతుందని భావిస్తున్న అధినాయకత్వం
- అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలపై ఫోకస్ మరింత పెరిగేలా వ్యూహం
- కేంద్రంలో హ్యాట్రిక్ లక్ష్య సాధనకు దోహదపడుతుందనే ఆలోచన
- ఇటీవల హైదరాబాద్ వేదికగా ఆరెస్సెస్, బీజేపీ ముఖ్యనేతల భేటీలోనూ చర్చ!
- 28న రాష్ట్రానికి అమిత్‌షా.. 29న లోక్‌సభ స్థానాలపై పూర్తిస్థాయి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విషయంలో బీజేపీ పట్టుదలతో ఉందా? రాష్ట్రంలో ఎలాగైనా అధికారంలోకి రావాలని భావిస్తోందా? దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ పట్టును పెంచుకోవడంతో పాటు 2024 లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాల కైవసం చేసుకునేందుకు వ్యూహం రచించిందా? ఇందులో భాగంగా బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలంగాణ నుంచి పార్లమెంటు బరిలో దిగనున్నారా? అంటే బీజేపీ కోర్‌గ్రూపు నుంచి అవుననే సంకేతాలే వస్తున్నాయి. కేంద్రంలో 'హ్యాట్రిక్ సర్కార్' ఏర్పాటుతో రికార్డు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ.. ఈసారి దక్షిణాది నుంచి కూడా ఎక్కువ స్థానాలు దక్కించుకోవాలని భావిస్తోంది. ఆ ప్రయత్నాల్లో భాగంగానే పార్టీలో, ప్రభుత్వంలో నంబర్ టూ గా ఉన్న అమిత్‌షాను రాష్ట్రం నుంచి పోటీకి దింపాలని నిర్ణయించినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. ఇప్పటికే పలుమార్లు నిర్వహించిన సర్వేలు, అధ్యయనాలను బట్టి, మహబూబ్‌నగర్ పార్టీకి కంచు కోటగా మారిందని అంచనా వేస్తున్న జాతీయ నాయకత్వం.. అమిత్‌షాను ఇక్కడి నుంచి బరిలోకి దింపే అవకాశం ఉందని అంటున్నారు. ఈ నెల 8న నగర శివార్లలోని ఒక ఇంజనీరింగ్ కాలేజీలో ఆరెస్సెస్, సంఘ్‌పరివార్ నేతలతో బీజేపీ జాతీయ, రాష్ట్రపార్టీల ముఖ్యుల భేటీ సందర్భంగా ఈ అంశంపై చర్చించినట్టు తెలుస్తోంది. గుజరాత్‌తో పాటు తెలంగాణ నుంచి కూడా అమిత్‌షా పోటీచేసి గెలిస్తే ఇక్కడి నుంచే ఎంపీగా (గెలిచాక ఇక్కడి సీటుకు రాజీనామా చేయకుండా) కొనసాగే

మిగతా 2వ పేజీలో ▶

65 అసెంబ్లీ స్థానాలపై గురి!

వచ్చే ఎన్నికల్లో బీజేపీ లక్ష్యమిదే..

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని, కాంగ్రెస్ రోజురోజుకూ డీలా పడిపోతున్నందున ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని జాతీయ కార్యవర్గ భేటీలో అగ్ర నాయకత్వం రాష్ట్ర పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.

- వివరాలు 2లో▶

హైదరాబాద్‌లో సీ4ఐఆర్ సెంటర్



వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సమావేశం తొలిరోజే తెలంగాణకు కీలక విజయం

- దావోస్ వార్షిక సమావేశంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌తో తెలంగాణ ఒప్పందం
- స్విట్జర్లాండ్‌లో మంత్రి కేటీఆర్‌కు ఘనస్వాగతం

సాక్షి, హైదరాబాద్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో సోమవారం ప్రారంభమైన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశం తొలిరోజే తెలంగాణ ప్రభుత్వం కీలక విజయం సాధించింది. జాతీయ, అంతర్జాతీయ సంస్థల కార్యకలాపాలకు కేంద్రంగా మారిన హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ అడుగు పెడుతోంది. సీ4ఐఆర్ (సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్)కు చెందిన సెంటర్‌ను హైదరాబాద్‌లో మిగతా 5వ పేజీలో ▶

ఆధునిక రైల్వేకు రూపకల్పన

రూ. 250 కోట్ల నుంచి రూ. 3 వేల కోట్లకు పెరిగిన తెలంగాణ రైల్వే బడ్జెట్: మోదీ

- ఎనిమిదేళ్లలో తెలంగాణలో అద్భుతంగా రైల్వే పురోగతి
- గతంలో రైలును చూడని మెదక్‌లాంటి ప్రాంతాలకు కనెక్టివిటీ
- సికింద్రాబాద్–విశాఖ వందేభారత్ రైలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభం

11 లో



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జెండా ఊపి వందే భారత్ రైలును ప్రారంభిస్తున్న మోదీ

• ఆక్స్‌ఫాం నివేదిక



1 శాతం మంది గుప్పిట్లో..

40% దేశ సంపద!

భారీగా పెరుగుతున్న పేద–ధనిక అంతరం

మొత్తం దేశ సంపదలో 40 శాతానికి పైగా కేవలం 1 శాతం సంపన్నుల చేతుల్లోనే పోగుపడిందట! మరోవైపు, ఏకంగా సగం మంది జనాభా దగ్గరున్నదంతా కలిపినా మొత్తం సంపదలో మూడోవంతు కూడా లేదు! ఆక్స్‌ఫాం ఇంటర్నేషనల్ అనే హక్కుల సంఘం వార్షిక అసమానతల నివేదికలో పేర్కొన్న చేదు నిజాలివి. - 6లో



కొలీజియంలో ప్రభుత్వ నామినీలు

సీజేఐకి కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు లేఖ

'కొలీజియం' కాక

- వివరాలు 6లో▶

నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం

- 72 మంది దుర్మరణం!
- 69 మృతదేహాల వెలికితీత
- మృతుల్లో ఐదుగురు భారతీయులు

- వివరాలు 6లో▶



8వ నిజాం ముకరంజా కన్నుమూత

- 14న టర్కీలో తుదిశ్వాస
- నేడు హైదరాబాద్‌కు భౌతికకాయం
- 18న చౌమహల్లా ప్యాలెస్‌లో సందర్శనకు అవకాశం
- అదే రోజు మక్కా మసీదు ఆవరణలోని అసఫ్‌జాహీ సమాధులవద్ద అంత్యక్రియలు

- వివరాలు 11లో▶

క్లుప్తంగా...

మంత్రి గంగులను పరామర్శించిన సీఎం



కరీంనగర్: బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను సీఎం కేసీఆర్ పరామర్శించారు. కమలాకర్ తండ్రి మల్లయ్య ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి సోమవారం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా కరీంనగర్ చేరుకున్నారు. మల్లయ్య పెద్దకర్మ కార్యక్రమానికి హాజరై.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం మంత్రి గంగుల కమలాకర్‌ను, ఆయన కుటుంబీకులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు డి.దామోదర్‌రావు, జోగినిపల్లి సంతోష్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, వి.సతీశ్‌బాబు, సంజయ్‌కుమార్, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, కోరుకంటి చందర్, కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు, వివిధ కార్పొరేషన్ల పాల్గొన్నారు.

కేసీఆర్ పుట్టిన రోజున సచివాలయం ప్రారంభమా?



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ తన పుట్టినరోజును భారీఎత్తున జరుపుకుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదని, ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని సచివాలయం ప్రారంభించడం ఏంటని ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి ప్రశ్నించారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త భవనాల నిర్మాణం పూర్తయిన తర్వాత తీసుకోవాల్సిన అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే కార్యకలాపాలు ప్రారంభించాలన్న నిబంధన ప్రైవేటుతో పాటు ప్రభుత్వానికి కూడా వర్తిస్తుందని చెప్పారు. సచివాలయ నిర్మాణం ఇంకా పూర్తి కావాల్సి ఉందని, పూర్తయిన తర్వాత పర్యావరణం, ఫైర్, జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకోవాల్సి ఉందన్నారు. అవన్నీ తీసుకుని ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ రాకుండానే కేవలం జ్యోతిష్యం మీద ఆధారపడి ప్రారంభిస్తున్నారని విమర్శించారు.

టీఆర్ఎస్ పనే అయిపోయింది

అందుకే బీఆర్ఎస్ పేరుతో వెళ్తున్నారు: మహేశ్‌కుమార్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పని అయిపోయిందని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. అయిపోయింది కాంగ్రెస్ పని కాదని, టీఆర్ఎస్ పనే అయిపోయిందని, అందుకే పార్టీలో తెలంగాణ పదాన్ని తీసేసి బీఆర్ఎస్ పేరుతో వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సోనియా, రాహుల్‌గాంధీలకు పదవులపై ఆశ లేదని, వారు తెలంగాణ ఇవ్వకుంటే కాంగ్రెస్ పని అయిపోయిందని అంటున్న వారికి పదవులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఆటుపోట్లు చూసిందని, తమ పార్టీ సముద్రం లాంటిదని అన్నారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ఈనెల 20, 21, 22 తేదీల్లో తెలంగాణకు వస్తున్నారని హాథ్ సే హాథ్ జోడో యాత్రలతో పాటు పార్టీ బలోపేతంపై రాష్ట్ర నాయకులతో ఆయన చర్చిస్తారని చెప్పారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిందని మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు.

డిజిటల్ పేమెంట్స్‌లో పాశ్చాత్య దేశాలను దాటాం

కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ చైర్మన్ అదిల్ జైనుల్‌భాయ్

సాక్షి, హైదరాబాద్: టెక్నాలజీ కోసం భారత్ ఒకప్పుడు అమెరికా తదితర పాశ్చాత్య దేశాల వైపు చూసేదని ఇప్పుడు ఆ పరిస్థితి మారిందని కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ చైర్మన్ అదిల్ జైనుల్‌భాయ్ చెప్పారు. మౌలిక, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో మరీ ముఖ్యంగా ఆర్థిక లావాదేవీల్లో ఆ దేశాలను దాటి ముందుకెళ్లిపోయామన్నారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ) నిర్వహించిన పీజీడీఎం కోర్స్ రెండో బ్యాచ్ ముగింపు సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అదిల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆధార్, యూపీఐ వంటి డిజిటల్ టెక్నాలజీలు విజయవంతం కావడం, ప్రజల అవసరాలు తీర్చే పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి కారణమైందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌సీఐ చైర్మన్ కె.పద్మనాభయ్య, వైస్ చైర్మన్ రిచర్డ్ బీ సల్దానా, డైరెక్టర్ జనరల్ డాక్టర్ నిర్మల్య బాగ్చి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఛత్తీస్‌గఢ్ కరెంట్ బంద్

2022-23లో పూర్తిగా సరఫరా నిలుపుదల
విద్యుత్ ధర భారీగా పెరగడమే కారణం

ధర, బకాయిలపై ఇరు రాష్ట్రాల మధ్య ముదిరిన వివాదం

గత జూన్ నాటికి రూ. 3,576 కోట్ల బకాయిలన్న ఛత్తీస్‌గఢ్	బకాయిలు రూ. 2,100 కోట్లే అంటున్న తెలంగాణ



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రానికి ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సరఫరా పూర్తిగా బంద్ అయింది. ప్రస్తుత (2022–23) ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఒక్క యూనిట్ కూడా ఛత్తీస్‌గఢ్ సరఫరా చేయలేదు. ధరతోపాటు బకాయిలను ఛత్తీస్‌గఢ్ భారీగా పెంచేయగా, తెలంగాణ డిస్కంలు అంగీకరించకపోవడంతో వివాదం మరింత ముదిరింది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు చేస్తున్న విజ్ఞప్తులను ఛత్తీస్‌గఢ్ స్టేట్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (సీఎస్‌పీడీసీఎల్) నిరాకరిస్తోంది. మొత్తం బకాయిలు చెల్లిస్తేనే సరఫరా పునరుద్ధరిస్తామని స్పష్టంచేసింది. తెలంగాణ డిస్కంలు, సీఎస్‌పీడీసీఎల్ మధ్య జరిగిన దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) ప్రకారం రాష్ట్రానికి 1000 మెగావాట్ల విద్యుత్ సరఫరా కావాల్సి ఉంది. 2020–21లో 39.67శాతం, 2021–22లో కేవలం 1,631 మిలియన్ యూనిట్ల (19శాతం) విద్యుత్ మాత్రమే ఛత్తీస్‌గఢ్ సరఫరా చేసింది. 2022–23లో పూర్తిగా నిలిపేసింది. తాజాగా ఈ విషయాన్ని తెలంగాణ డిస్కంలు.. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ)కి నివేదించాయి. ఛత్తీస్‌గఢ్‌తో వివాదాలు సద్దుమణిగితే 2022–23 రెండో అర్ధ వార్షికంలో 2,713 ఎంయూల (31%) విద్యుత్ సరఫరా జరగొచ్చని అంచనా వేస్తున్నామన్నాయి.

ఎంఓయూ ఆధారంగా ఒప్పందం!

ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి 12 ఏళ్లపాటు విద్యుత్ కొనుగోలు చేసేందుకు తెలంగాణ డిస్కంలు, సీఎస్‌పీడీసీఎల్ మధ్య 2015 సెప్టెంబర్ 22న ఒప్పందం (పీపీఏ) జరిగింది. టెండర్లకు బదులుగా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సీఎంల సమక్షంలో 2014 నవంబర్ 3న జరిగిన పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) ఆధారంగా ఈ పీపీఏ జరిగింది.

నాడు చౌకగా వస్తుందని.. నేడేమో నష్టమని..

ఛత్తీస్‌గఢ్ విద్యుత్ రాష్ట్రానికి గుదిబండగా మారనుందని అప్పట్లో భారీ ఎత్తున విమర్శలు వచ్చాయి. ఏటా రూ.వెయ్యి కోట్ల చొప్పున 12 ఏళ్ల ఒప్పంద కాలంలో రూ.12వేల కోట్ల అదనపు భారం పడనుందని అప్పట్లో విద్యుత్ రంగ నిపుణులు రఘు ఈఆర్సీకి వివరించారు. అయితే, ఛత్తీస్‌గఢ్ నుంచి చౌకగానే విద్యుత్ లభించనుందని, పీపీఏను ఆమోదించాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం ఈఆర్సీని కోరింది. తాజాగా ఈఆర్సీకి ఇచ్చిన వివరణలో మాత్రం రాష్ట్రానికి భారీగా నష్టం జరుగుతోందని తెలంగాణ డిస్కంలు అంగీకరించడం గమనార్హం. ఛత్తీస్‌గఢ్ విద్యుత్‌తో జరగనున్న నష్టంపై నాటి రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి అరవింద్‌కుమార్ టీఎస్ఈఆర్సీకి 2016 డిసెంబర్‌లో లేఖ సైతం రాశారు. దీంతో ఆగ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయనపై బదిలీవేటు వేసి ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా పంపింది. ఛత్తీస్‌గఢ్ పీపీఏను కొన్ని మార్పులతో అనుమతిస్తూ టీఎస్ఈఆర్సీ 2017 మార్చి 31న మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది.

భారీగా పెంచేసిన ఛత్తీస్‌గఢ్



2022 జూన్ 3 నాటికి బకాయిపడిన రూ.3,576.89 కోట్లను చెల్లిస్తేనే ఒప్పందం మేరకు 1000 మెగావాట్ల విద్యుత్ సరఫరా కొనసాగిస్తామని 2022 సెప్టెంబర్ 23న ఛత్తీస్‌గఢ్ ఇన్వాయిస్ పంపింది. అయితే, రూ.2,100 కోట్ల బకాయిలు మాత్రమే చెల్లించాల్సి ఉందని అప్పట్లో తెలంగాణ డిస్కంలు బదులిచ్చాయి. తెలంగాణ ఈఆర్సీ మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం యూనిట్ విద్యుత్‌కు రూ.3.90 మాత్రమే చెల్లిస్తామన్నాయి. అయితే, ఛత్తీస్‌గఢ్ ఈఆర్సీ ఖరారు చేసిన మార్వా విద్యుత్ కేంద్రం పెట్టుబడి వ్యయం ఆధారంగా ధర చెల్లించాలని ఆ రాష్ట్రం కోరుతోంది. దీనిపై రెండు రాష్ట్రాల మధ్య పలుమార్లు జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ ఈఆర్సీ ఉత్తర్వులతోపాటు పీపీఏ తుది అనుమతులను సవాల్ చేస్తూ.. తెలంగాణ డిస్కంలు 2018లో అప్పీలేట్ ట్రిబ్యునల్ ఫర్ ఎలక్ట్రిసిటీ (అప్టెల్)లో కేసు వేశాయి.

డిస్కంలకు భారీగా నష్టం



వివాదాల్లో ఉన్న బకాయిలను అప్టెల్ తీర్పునకు లోబడి చెల్లిస్తామని, వివాదాల్లేని బకాయిలను.. లేట్ పేమెంట్ సర్‌చార్జీ రూల్స్–2022 ప్రకారం చెల్లిస్తామని డిస్కంలు ఛత్తీస్‌గఢ్‌కు తెలిపాయి. అయినా ఛత్తీస్‌గఢ్ అంగీకరించడం లేదు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తెలంగాణ డిస్కంలు విద్యుత్ కొరతను ఎదుర్కొంటున్నాయి. దీంతో బహిరంగ మార్కెట్ నుంచి అధిక ధరకు కొనుగోలు చేసి భారీగా నష్టపోతున్నామని డిస్కంలు ఈఆర్సీకిచ్చిన వివరణలో పేర్కొన్నాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి రాష్ట్రానికి విద్యుత్‌ను తెచ్చేందుకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (పీజీసీఎల్)కు చెందిన వార్ధా–డిచ్‌పల్లి–మహేశ్వరం ట్రాన్స్‌మిషన్ లైన్‌లో 1000 మెగావాట్ల కారిడార్‌ను 12 ఏళ్ల కోసం తెలంగాణ డిస్కంలు బుక్ చేసుకున్నాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంట్ రాకపోయినా పీజీసీఎల్‌కు ట్రాన్స్‌మిషన్ చార్జీల (ఏటా రూ.400 కోట్లకు పైగా)ను చెల్లించి నష్టపోతున్నామని ఈఆర్సీకి తెలిపాయి.

65 అసెంబ్లీ స్థానాలు..!

- వచ్చే తెలంగాణ ఎన్నికల్లో బీజేపీ లక్ష్యమిదే..
- అధికారమే లక్ష్యంగా దూసుకెళ్లండి
- జాతీయ కార్యవర్గ భేటీలో రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం
- హాజరైన బండి సంజయ్, డీకే అరుణ, లక్ష్మణ్, ఈటల



సాక్షి, న్యూఢిల్లీ: ఈ సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఎన్నికలు జరిగే తొమ్మిది రాష్ట్రాల ఎన్నికలపై బీజేపీ గురిపెట్టింది. ప్రధానంగా తెలంగాణలో అధికార పీఠం ఎక్కేందుకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకుంది. ఈ ఏడాది చివర్లో జరిగే తెలంగాణ ఎన్నికల్లో కనీసం 65 అసెంబ్లీ స్థానాలు దక్కించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. సోమవారం నుంచి ఆరంభమైన జాతీయ కార్యవర్గ భేటీల్లో ఈ మేరకు రాష్ట్ర ఇంచార్జులు, నేతలకు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలో అధికారంతోపాటు వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో 12 పార్లమెంట్ స్థానాలు దక్కించుకునే వ్యూహాలపైనా కేంద్ర నాయకత్వం మార్గదర్శనం చేసింది.

మెరుగ్గా ఉంది.. అందిపుచ్చుకోండి

బీజేపీ రెండు రోజుల జాతీయ కార్యవర్గ సమావేశాలు సోమవారం ఢిల్లీలో మొదలయ్యాయి. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోపాటు కేంద్రమంత్రులు, 12 బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాష్ట్రాల అధ్యక్షులతోపాటు మొత్తం 350 మంది ప్రతినిధులు హాజరయ్యారు. తెలంగాణ తరపున రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, పార్టీ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి, విజయశాంతి, ఇంద్రసేనా రెడ్డి, ఈటల రాజేందర్, పొంగులేటి సుధాకర్ రెడ్డి హాజరుకాగా, ఏపీ తరఫున రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, మాజీ కేంద్ర మంత్రి పురందేశ్వరి, మాధవ్ హాజరయ్యారు. సమావేశంలో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగే తెలంగాణ, కర్ణాటక, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ వంటి తొమ్మిది రాష్ట్రాలతోపాటు వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల వ్యూహంపైనా చర్చించారు. ప్రధానంగా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని, కాంగ్రెస్ రోజురోజుకీ డీలా పడిపోతున్నందున ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని అగ్ర నాయకత్వం దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. పార్టీ బలహీనంగా ఉన్న నియోజకవర్గాల్లో రాష్ట్ర నేతల పర్యటనలు పెంచాలని, కేంద్ర నాయకుల పర్యటనలు సైతం బలహీన నియోజకవర్గాల్లో ఎక్కువగా ఉండేలా చూడాలని సూచనలు చేసినట్లు చెబుతున్నారు. వీటితోపాటు ఫిబ్రవరిలో పార్టీ నిర్వహించే 10వేలకు పైగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లను విజయవంతం చేసేలా ఇంచార్జులు బాధ్యతలు తీసుకోవాలని చెప్పినట్లు సమాచారం. ఇక లోక్‌సభ ప్రవాస్ ప్రచారం కింద ఈ నెల 28న అమిత్‌షా తెలంగాణలో పర్యటించే అంశం చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. అమిత్ షా పర్యటన తర్వాత ప్రతి నెలలో కనీసం 10 మంది జాతీయస్థాయి నేతలు రాష్ట్రంలో పర్యటించి, పార్టీని బలోపేతం చేసేలా కార్యాచరణ ఉంటుందని అంటున్నారు. ఇటీవలి బండి సంజయ్ ప్రజా సంగ్రామ పాదయాత్రలు విజయవంతమైనందున ఇతర రాష్ట్రాల్లోనూ ఇలాంటి పాదయాత్రల నిర్వహణపై ఇతర రాష్ట్రాల నేతలకు సూచనలు చేసినట్లు తెలిసింది.

కొత్త పీఆర్‌సీ ఏర్పాటు చేయాలి

- 3 నెలల గడువుతో నివేదిక తెప్పించాలి
- సీఎం కేసీఆర్‌కు బండి సంజయ్ బహిరంగలేఖ



సాక్షి, హైదరాబాద్: వెంటనే కొత్త వేతన సవరణ సంఘాన్ని (పీఆర్‌సీ) ఏర్పాటు చేసి మూడునెలల్లోగా నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఈ జూలై 1 నుంచి పీఆర్‌సీ ద్వారా పెంచిన జీతాలు చెల్లించాలని సోమవారం సీఎంకు రాసిన బహిరంగలేఖలో సూచించారు. తెలంగాణ ఏర్పాటుకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు 42 రోజులపాటు సకల జనుల సమ్మె చేస్తే ఆనాటి ప్రభుత్వం దిగివచ్చిందని, పార్లమెంట్‌లో బీజేపీ మద్దతుతో తెలంగాణ బిల్లు ఆమోదం పొంది స్వరాష్ట్రం ఏర్పాటైందన్నారు. స్వరాష్ట్రంలో ఉద్యోగుల, ఉపాధ్యాయుల హక్కులను కాపాడాల్సిన సీఎం వారిని అడుగడుగునా మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు తీసుకోవడం ఉద్యోగుల హక్కుగా ఉన్నా సక్రమంగా చెల్లించకుండా వారి హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. 317 జీవో అమలు పేరుతో ఉద్యోగుల కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసి మానసిక క్షోభకు గురి చేస్తున్నారని, ఉద్యోగులకు చెల్లించాల్సిన నాలుగు డీఏలను కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ధ్వజమెత్తారు. పీఆర్‌సీ అమలు విషయంలోనూ మోసం చేస్తున్నారని, సీఆర్ బిస్వాల్ అధ్యక్షతన ఏర్పాటైన తొలి పీఆర్‌సీ నివేదికను 2018 జూలై 1 నుంచి అమలు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ జూన్ 30తో మొదటి పీఆర్‌సీ గడువు ముగియడంతో పాటు జూలై 1 నుంచి కొత్త పీఆర్‌సీ అమల్లోకి రావాల్సి ఉన్నా సీఎం కనీసం కొత్త కమిషన్‌ను నియమించకపోవడం ఉద్యోగులను, ఉపాధ్యాయులను దగా చేయడమే అవుతుందన్నారు. పే రివిజన్ కమిషన్ నివేదిక లేకుండా పీఆర్‌సీని ఎట్లా అమలు చేస్తారు? సీఎం వైఖరిని చూస్తుంటే ఏదో విధంగా జాప్యం చేసి దీనిని ఎగ్గొట్టాలనే ధోరణి కన్పిస్తోందని ఆయన విమర్శించారు.

తెలంగాణ సంపదను ఆంధ్రులకు కట్టబెడుతున్న బీఆర్ఎస్

- ప్రాజెక్టుల రీడిజైన్ పేరిట రూ.82 వేల కోట్లు అప్పగించారు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్



కాగజ్‌నగర్ రూరల్: తెలంగాణ సంపదను కాంట్రాక్టుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రులకు కట్టబెడుతోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బహుజన రాజ్యాధికార యాత్ర రెండో విడతలో భాగంగా కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో సోమవారం సాయంత్రం బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టు పనులన్నీ ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారికే బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టబెడుతోందని ఆరోపించారు. 2008లో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు కింద సేకరించిన భూములకు సంబంధించి పరిహారం కూడా ఇవ్వలేదన్నారు. ఈ ప్రాజెక్టును నిలిపివేసి రీడిజైన్ పేరుతో మేడిగడ్డకు తరలించి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.82 వేల కోట్ల కాంట్రాక్టును ఆంధ్రవారికి అప్పజెప్పారని ఆరోపించారు. రాష్ట్ర మంత్రుల అండదండలతోనే సిర్పూర్ నియోజకవర్గంలో అక్రమాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. కాగజ్‌నగర్ పట్టణంలోని డంపింగ్ యార్డును ఆక్రమించుకుని వెంచర్లు వేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా అధ్యక్షుడు మోర్లె గణపతి, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ పాల్గొన్నారు.

పాలమూరు బరిలో షా!

మొదటి పేజీ తరువాయి

అవకాశాలు మెండుగానే ఉన్నాయని రాష్ట్ర నాయకులు అంచనా వేస్తున్నారు.

చిరకాల స్వప్నం సాకారానికి..

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలనే చిరకాల స్వప్నాన్ని నిజం చేసుకోవడంతో పాటు, అదే ఒరవడిని, విజయపరంపరను కొనసాగిస్తూ రాష్ట్రం నుంచి 10 నుంచి 12 ఎంపీ సీట్లు గెలవడానికి ఈ వ్యూహం ఉపయోగపడుతుందని బీజేపీ జాతీయ నాయకత్వం భావిస్తోంది. ఇక్కడి నుంచి అమిత్‌షా లోక్‌సభకు పోటీ చేయడం వల్ల రాష్ట్రపార్టీ నేతల్లో సీరియస్‌నెస్ పెరుగుతుందని, వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలపై ఫోకస్ మరింత పెంచేందుకు, నిర్దేశిత రాజకీయ లక్ష్యాల సాధనకు ఇది దోహదపడుతుందనేది పార్టీ వ్యూహమని రాష్ట్ర నేతలు చెబుతున్నారు. అమిత్‌షా ఇక్కడి నుంచి పోటీచేసే పక్షంలో పలుమార్లు రాష్ట్రానికి వస్తారని, దాని ప్రభావం పార్టీపై, రాష్ట్ర రాజకీయాలపై, ప్రజలపై తప్పకుండా పడుతుందని, పరిస్థితులు పార్టీకి మరింత సానుకూలంగా మారతాయని అంటున్నారు. ఇందులో భాగంగానే అమిత్‌షా ఈ నెల 28న రాష్ట్రానికి వస్తున్నట్టు పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. 29న కూడా ఇక్కడే బసచేసి పార్టీ ముఖ్య నేతలతో రాష్ట్రంలోని లోక్‌సభ సీట్లపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తారని చెబుతున్నారు. రాష్ట్రంలోని నాలుగేసి లోక్‌సభ సీట్లను ఒక క్లస్టర్‌గా విభజించి, కనీసం రెండు క్లస్టర్ల నేతలతో అమిత్‌షా భేటీ నిర్వహించే అవకాశాలున్నట్టు తెలిసింది.



తెలంగాణపైనే ఫుల్ ఫోకస్

దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక తర్వాత పార్టీ విస్తరణకు తెలంగాణలోనే అత్యధిక అవకాశాలున్నట్టుగా బీజేపీ అధినాయకత్వం గట్టిగా నమ్ముతోంది. గత ఏడాది, ఏడాదిన్నరగా క్షేత్రస్థాయి నుంచి వివిధ రూపాల్లో పార్టీ, స్వతంత్ర సంస్థలు, బృందాలతో నిర్వహించిన సర్వేలు, అధ్యయనాలు.. పార్టీకి సానుకూలత పెరిగినట్టుగా స్పష్టం చేసినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించి, వ్యూహం ప్రకారం ముందుకెళ్లాలని బీజేపీ భావిస్తున్నట్టు చెబుతున్నారు. అమిత్‌షా, జేపీనడ్డాలు ఇప్పటికే రాష్ట్ర పార్టీని పూర్తిగా తమ కంట్రోల్‌లోకి తీసుకున్నారని అంటున్నారు. రాష్ట్రంలో పార్టీ ఎన్నికల సన్నాహాలు పూర్తిగా బీజేపీ అధినాయకత్వం పర్యవేక్షణలోనే సాగుతున్న విషయం తెలిసిందే. పార్టీకి సంబంధించిన ప్రతి కదలిక, కార్యక్రమాల వంటివన్నీ కూడా మోదీ, అమిత్‌షా, నడ్డా కనుసన్నల్లోనే నడుస్తున్నట్టు ముఖ్యనేతలు చెబుతున్నారు. తెలంగాణలో కాషాయజెండా ఎగురవేయడంతో పాటు, జాతీయ స్థాయిలో ప్రయోజనం కలిగించేలా పది నుంచి పన్నెండు దాకా ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా నాయకత్వం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో బీఆర్ఎస్‌ను ధీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా వివిధ రాజకీయ, ఇతర ప్రాధాన్యత అంశాలపై దృష్టి పెట్టినట్లు సమాచారం.

దేశ రాజకీయాలను మలుపు తిప్పే సభ

- రేపటి ఖమ్మం సభకు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు
- తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా అతిథులకు సన్మానం
- మంత్రి హరీశ్‌రావు వెల్లడి



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఈనెల 18న ఖమ్మంలో జరిగే సభ చరిత్రాత్మకమైనదని, రాజకీయాలను మలుపు తిప్పనుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. తెలంగాణ ఉద్యమ తొలినాళ్లలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన సింహగర్జన సభ తెలంగాణ ఏర్పాటుకు దోహదపడగా, ఇప్పుడు ఖమ్మం వేదికగా జరుగుతున్న సభ కూడా దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తుందన్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో ఖమ్మం జిల్లా కీలకపాత్ర పోషించగా.. ఇప్పుడు జాతీయ రాజకీయాలకు వేదిక కాబోతోందని తెలిపారు. ఖమ్మంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం హరీశ్‌రావు బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

భారీగా జన సమీకరణ

బహిరంగ సభ కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుంచి జన సమీకరణపై దృష్టి సారించగా. మిగతా నియోజకవర్గాల నుంచి ముఖ్యనేతలు, కేడర్, ప్రజాప్రతినిధులు వస్తారని హరీశ్‌రావు చెప్పారు. అంతేకాక మహబూబాబాద్ జిల్లాలో డోర్నకల్, మహబూబాబాద్, పాలకుర్తి నియోజకవర్గాల నుంచి, సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి నియోజకవర్గం సహా మొత్తం 13 నియోజకవర్గాల నుంచే సమీకరణ చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా వాహనాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఢిల్లీ, పంజాబ్, కేరళ సీఎంలతోపాటు ఇతర పార్టీల ముఖ్యనేతలకు స్వాగతం, వీడ్కోలు పలికే బాధ్యతలను మంత్రులు, ముఖ్యనేతలకు అప్పగించినట్లు హరీశ్‌రావు వెల్లడించారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా అతిథులకు సన్మానం, జ్ఞాపికల బహూకరణ ఉంటాయన్నారు. నారాయణపేట, పోచంపల్లి శాలువాలతో సన్మానించడంతోపాటు కరీంనగర్‌లో రూపొందిస్తున్న వెండి వీణలను కేసీఆర్ బహూకరిస్తారని తెలిపారు.

యాదాద్రిలో రేపు ఆర్జిత సేవలు రద్దు

యాదగిరిగుట్ట: ఈనెల 18న యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు సీఎం కేసీఆర్‌తోపాటు మరో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రానున్న నేపథ్యంలో ఆ రోజు ఉదయం ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలు, నిత్య కల్యాణం రద్దు చేసినట్లు ఈఓ గీతారెడ్డి వెల్లడించారు. అలాగే ఉదయం 9 నుంచి 10గంటల మధ్య నిర్వహించే బ్రేక్ దర్శనాలను సైతం భద్రతా కారణాల దృష్ట్యా రద్దు చేశామన్నారు. సీఎంల పర్యటన సందర్భంగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది.



ఖమ్మంలోని సభా ప్రాంగణంలో కేరళ, ఢిల్లీ, తెలంగాణ, పంజాబ్ సీఎంలు పినరయి విజయన్, కేజ్రీవాల్, కేసీఆర్, భగవంత్‌సింగ్ మాన్, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ కటౌట్లు

షెడ్యూల్ ఇలా..

- 17న రాత్రికి జాతీయ నేతలంతా హైదరాబాద్‌కు చేరుకుంటారు.
- 18న ఉదయం సీఎం కేసీఆర్‌తో ప్రగతి భవన్‌లో భేటీ అయి దేశ రాజకీయాలపై చర్చిస్తారు.
- ఆ తర్వాత రెండు హెలికాప్టర్లలో ఉదయం 11.30 గంటలకు యాదాద్రికి వెళ్లి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటారు. అనంతరం 12.30 గంటలకు ఖమ్మంకు బయలుదేరుతారు.
- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌కు మంత్రి మహమూద్ అలీ, కేరళ సీఎం పినరయి విజయన్‌కు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, యూపీ మాజీ సీఎంఅఖిలేశ్ యాదవ్‌కు మంత్రి తలసాని శ్రీనివాస్, సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజాకు దాసోజు శ్రావణ్ స్వాగతం పలుకుతారు.
- సభకు సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు, సీపీఐ సీనియర్ నేత పువ్వాడ నాగేశ్వరరావుకు ఆహ్వానం పంపారు.
- మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బహిరంగ సభ జరుగుతుంది.




అతిథులకు వెండి వీణ

విద్యానగర్ (కరీంనగర్): ఖమ్మంలో జరగనున్న బీఆర్ఎస్ సభకు విచ్చేయనున్న వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫిలిగ్రీ కళా నైపుణ్యంతో తయారు చేసిన వెండి వీణలను బహూకరించనున్నారు. బీఆర్ఎస్ అధిష్టానం పది రోజుల క్రితం ఐదు వీణలను కోసం సిఫ్కా సంస్థకు ఆర్డర్ ఇచ్చింది. ఒక్కో వీణను కిలోన్నర వెండితో తయారు చేశారు. వీటిని సోమవారం హైదరాబాద్‌కు తరలించారు. ఒక్కో వీణ ఖరీదు లక్ష యాభై వేల వరకు ఉంటుందని ఆ సంస్థ బాధ్యుడు వేణుగోపాల్ తెలిపారు.

మాస్టర్ ప్లాన్‌ను నిరసిస్తూ సర్పంచ్ రాజీనామా

జగిత్యాల రూరల్: జగిత్యాల బల్దియా విడుదల చేసిన ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌ను నిరసిస్తూ జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ మేరుగు రమ్య (కాంగ్రెస్) తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. మొత్తం 8 వార్డు సభ్యులు సైతం తమ పదవులకు రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. కాగా, హస్నాబాద్, అంబారిపేటకు చెందిన రైతులు రహదారిపై ధర్నా చేశారు.

ఇదం జగత్



మీరు మొహమాటపడుతున్నారు! ప్రధాని ఎలా కావాలో చెప్పింది మీరే కదా సార్.. యామ్ ఐ కరెక్ట్!!



LOVED IN 70 COUNTRIES
BAJAJ
THE WORLD'S FAVOURITE INDIAN
కొత్త PLATINA 110 ABS
ABS ఆన్ అయితే స్కిడ్ అవ్వడం గాన్*
సమర్పిస్తున్నాము ప్రపంచపు అత్యంత సురక్షితమైన 110 cc మోటర్‌సైకిల్#
ABS సురక్షిత్ | సాటిలేని బ్రేకింగ్ | తక్కువ బ్రేకింగ్ దూరం | మెరుగైన నియంత్రణ మరియు స్థిరత్వం
ఎక్స్-షోరూమ్ ధర ₹72 864^/-
ఆకర్షణీయమైన డౌన్ పేమెంట్ ₹9 328^/-
PLATINA
కుదుపులు నిషేధం



ఏ పని చెయ్యడం భయమో, ఆ పని అనవసరం అని మనసు చాలా కారణాలు చూపుతుంది.

– చలం

సాక్షి

మంగళవారం, జనవరి, 17

ప్రాణాంతక పర్యాటకం

దారుణం... అందరినీ కన్నీరు పెట్టించిన అనూహ్య ప్రమాదం. సంక్రాంతి పూట ఆదివారం ఉదయం హఠాత్తుగా జరిగిన నేపాల్ విమాన ప్రమాదఘటన తీవ్రత అలాంటిది. ఆ హిమాలయ దేశంలోని రెండో అతి పెద్ద దేశీయ విమానయాన సంస్థ యతీ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండింజన్ల ఏఆర్టీ–72 విమానం ప్రమాదానికి గురై, అయిదుగురు భారతీయులతో సహా అందులోని 72 మందీ ప్రాణాలు కోల్పోయారు. కాఠ్మండూకు పశ్చిమాన 125 కి.మీ.ల దూరంలో, పోఖరాలో కాసేపట్లో దిగాల్సిన విమానం వాతావరణం బాగున్నా ఇరుకు కొండమార్గంలో కూలిపోవడం దురదృష్టకరం.

నేపాల్‌లో గత మూడు దశాబ్దాల్లో అతి పెద్ద విమాన దుర్ఘటన ఇదేనట. వరుస ప్రమాదాలతో అపకీర్తిని మూటగట్టుకున్న నేపాల్ నిద్ర మేల్కొని నిర్లక్ష్యం వీడాలని ఇది గుర్తుచేస్తోంది. టేకాఫైన 20 నిమిషాల్లో అంతా అయిపోయింది. అప్పటి దాకా నవ్వుతూ, తుళ్ళుతూ సాగిన ప్రయాణం రెప్ప పాటున ఎగసిన అగ్నికీలల్లో ఆర్తనాదాల మధ్య దుఃఖభరితం కావడం దిగ్భ్రాంతికరం. విమానం కిందకు దిగుతున్న వేళ ప్రయాణికులు కొందరు ఫేస్‌బుక్ లైవ్ చేస్తుండడంతో యాదృచ్ఛికంగా ఈ ప్రమాద ఘటన దృశ్యాలు ప్రత్యక్షంగా సోషల్ మీడియాకు చిక్కాయి. విమానంలోని బ్లాక్ బాక్స్ దొరికింది గనక, దాని సమాచార విశ్లేషణతో ప్రమాద కారణాలు త్వరలోనే బయటపడవచ్చు.

మూడు దశాబ్దాల క్రితం 1992లో పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ (పీఐఏ) విమానం కాఠ్మండు విమానాశ్రయానికి వస్తూ, ఘోర ప్రమాదానికి గురై 167 మంది ప్రాణాలను బలి తీసుకుంది. నేపాలీ విమానయాన చరిత్రలో ఆ పీఐఏ ప్రమాదం అతి పెద్దది. ఆ తర్వాత ఈ హిమాలయ ప్రాంతంలో అనేక విమాన ప్రమాదాలు జరిగినా, ప్రాణనష్టం, తీవ్రతల్లో తాజా ఘటన మళ్ళీ ఆ గత చరిత్రను గుర్తు చేసింది. నిజానికి, ఇలాంటి విషాదాలు నేపాల్‌కు కొత్త కావు. ఎనిమిది నెలల క్రితమే నిరుడు మే నెలలో తారా విమానం కూలి, 22 మంది మరణించారు. 2000 నుంచి చూస్తే 22 ఏళ్ళలో నేపాల్‌లో 18 విమాన ప్రమాదాలు జరిగాయి. 350కి పైగా ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

ఈ పర్వత ప్రాంత దేశంలో మారుమూల ప్రాంతాలు, సంక్లిష్టమైన రన్‌వేలు, ఆ పక్కనే ఎత్తైన కొండలు, ఇరుకైన కొండ మలుపుల లాంటివి అనేకం. కొమ్ములు తిరిగిన పైలట్లకూ అక్కడ విమానాలు నడపడం సవాలే. ప్రపంచంలోని అతి ఎత్తైన 14 పర్వత శిఖరాల్లో 7 నేపాల్‌లోనే ఉన్నాయి. పర్వతారోహకులకు సవాలు విసిరే ప్రసిద్ధ ఎవరెస్ట్ సైతం ఈ చిన్న హిమాలయ దేశంలోనే నెలకొంది. ఎత్తైన పర్వతశిఖరాలకు తోడు అనూహ్యమైన వాతావరణ పరిస్థితులు సరేసరి. కొన్నేళ్ళుగా నేపాల్‌లో జరిగినన్ని విమాన ప్రమాదాలు మరెక్కడా జరగలేదంటే ఇవే కారణం.

పర్వత ప్రాంత నేపాలీ పర్యాటకమే ఆకర్షణగా విదేశీ పర్వతారోహకుల తాకిడి కొన్నేళ్ళుగా బాగా పెరిగింది. ఫలితంగా, ఆ దేశంలోని సంక్లిష్ట ప్రాంతాలకు సైతం సరకులనూ, మనుషులనూ తీసుకెళ్ళే విమాన రంగం కొన్నేళ్ళుగా విస్తరించింది. అదే సమయంలో ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ వద్ద లూక్లాలోని టెన్సింగ్– హిల్లరీ ఎయిర్‌పోర్ట్ ప్రపంచంలోకెల్లా ప్రమాదభరితమైన వాటిలో ఒకటైంది. 1960 నుంచి 2019 ఏప్రిల్ వరకు జరిగిన ప్రమాదాలు, ప్రాణనష్టాల లెక్క చూస్తే లూక్లా, జామ్‌సమ్, సిమీకోట్, జుమ్లా, దోల్పాలు నేపాల్‌లో ప్రమాద భూయిష్ఠమైనవని తేల్చారు. పైపెచ్చు, నిర్వహణ లోపాలు, తగినంత శిక్షణ లేకపోవడం, ప్రమాణాలు పాటించకపోవడం, అలసిసొలసిన పైలట్లు – ఇలా అనేకం ఆ దేశ విమానయాన రంగాన్ని పట్టిపీడిస్తున్నాయి. వీటి నుంచి నేపాల్ పాఠాలు నేర్చుకున్నట్టు లేదు. చివరకు యూరోపియన్ యూనియన్ సైతం భద్రతా కారణాల రీత్యా నేపాలీ విమానసర్వీసుల్ని నిషేధించాయంటే అర్థం చేసుకోవచ్చు.

వాతావరణ వైవిధ్యం, సంక్లిష్ట భౌగోళిక ప్రాంతమనేవి నేపాల్‌లో విమానయానానికి సవాళ్ళనీ, చిన్న విమానాలు తరచూ ప్రమాదాల పాలవుతున్నది అందుకేననీ నేపాల్ పౌర విమానయాన ప్రాధికార సంస్థ 2019లోనే తన నివేదికలో పేర్కొంది. అయితే, పరిష్కారానికి చేసిన ప్రయత్నాలే పెద్దగా లేవు. వరుస విమాన ప్రమాదాల పాపం నేపాల్ పాలకులదనేది అందుకే! ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ దర్యాప్తులు చేస్తూనే ఉన్నారు. దర్యాప్తు సంఘాలు నివేదికలు ఇస్తూనే ఉన్నాయి. కానీ, ఆ నివేదికల్లోని సిఫార్సుల అమలు శూన్యం. అందుకే, ప్రమాదాలు, ప్రాణనష్టం ఆగడమే లేదు.

తాజా ఘటనాస్థలమైన పోఖరా విమానాశ్రయ ప్రాంతం ప్రమాదభరితమే. నేపాల్‌ను చంక నెట్టుకోవాలని చైనా చేస్తున్న దోస్తీ భారత్‌కు మరింత ప్రమాదభరితం. చైనాతో ఒప్పందంతో ఏడేళ్ళలో ఈ ఎయిర్‌పోర్ట్ వచ్చింది. బీజింగ్ ఒత్తిడితో, నిపుణుల మాట తోసిపుచ్చి, సర్వసన్నద్ధం కాకుండానే ఈ ఎయిర్‌పోర్ట్‌ను ఇటీవలే ప్రారంభించారు. హిమాలయ శ్రేణుల్లో భారత్‌ను ఇరుకున పెట్టాలన్నది డ్రాగన్ వ్యూహం కాగా, ప్రయాణికుల ప్రాణాల కన్నా పర్యాటకమే ముఖ్యమన్నట్టు నేపాల్ ముందుకు సాగడం దుస్సహం. షార్ట్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ (స్టోల్) విమానాలతో పర్యాటక వాణిజ్య లబ్ధికై విజువల్ ఫ్లైట్ నిబంధనల్ని కూడా ఆ దేశం గాలికొదిలేస్తోంది.

గత పదేళ్ళలో జరిగిన 19 ప్రమాదాల్లో 16 ఘటనలు స్టోల్ విమానాలవే గనక, భారత్ మన పర్యాటకుల్ని అప్రమత్తం చేయాలి. ప్రాణాలకు పూచీపడని పొరుగు దేశంపై ఒత్తిడి తేవాలి. అంతర్జాతీయ పౌరవిమానయాన సంస్థ సైతం తన 193 సభ్య దేశాల్లో ఒకటైన నేపాల్ తన వైమానిక భద్రత పెంచుకొనేలా కట్టుదిట్టం చేయాలి. నివేదికల్ని బుట్టదాఖలు చేస్తున్న నేపాలీ పాలకులు తక్షణమే పూర్తిస్థాయి భద్రతే లక్ష్యంగా కఠినచర్యలు చేపట్టకపోతే మరిన్ని ప్రాణాలకు ప్రమాదం!

స్తబ్ధత నుంచి చైతన్యంలోకి...



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

ప్రాథమిక హక్కుల్ని ఎలా కాపాడుకోవాలో ప్రజలకు బోధించేదీ, తమ దైనందిన జీవితాలను ఎలా తీర్చి దిద్దుకోవాలో చెప్పేదీ రాజ్యాంగమే అని జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. ఆ రాజ్యాంగం పాలితులకు బోధలే కాదు, పాలకులకు హితబోధలూ చేసింది. కానీ వాటిని పెడచెవిన పెట్టడమే నేటి దేశ దుస్థితికి కారణం. మైనారిటీల ఉనికిని తక్కువ చేసేలా పౌర చట్టాన్ని సవరించే ప్రయత్నం ఇందుకు ఒక ఉదాహరణ. వందిమాగధులుగా ప్రవర్తించేవారినే గవర్నర్లుగా నియమించడం మరొక ఉదాహరణ. నిరసనకారులపై అక్రమ కేసులు బనాయించడం మరో ఉదాహరణ. అయితే దీనికి విరుగుడు మళ్లీ రాజ్యాంగంలోనే ఉంది. దాని వెలుగులో ప్రజలు స్తబ్ధత వదిలించుకోవడంలోనే ఉంది.

"మహాత్మాగాంధీ దేశంలో ఒక గ్రూపునకు వ్యతిరేకంగా మరో గ్రూపును రెచ్చగొట్టే పద్ధతిని ఎన్నడూ అనుసరించలేదు. ఆయన హిందువే కావొచ్చు, కానీ దేశ పౌరులయిన ముస్లింలను దేశ స్వాతంత్య్రానికి ముందు కూడా ప్రేమించారు. గాంధీజీ అనుసరించిన విధానం న్యాయబద్ధమైన సంస్కృతికీ, పౌర నీతికీ, సహృదయంతో కూడిన జాతీయ సమైక్యతకూ నిదర్శనం. అలాంటిది ఇతర మైనారిటీల పట్ల నేడు అనుసరిస్తున్న ప్రభుత్వ వివక్షాపూరిత విధానాలకు భారతదేశం తలదించుకోవలసి వస్తోంది."

– నోబెల్ బహుమాన గ్రహీత,
సుప్రసిద్ధ ఆర్థికవేత్త అమర్త్యసేన్ (15 జనవరి 2023)

'చింత చచ్చినా పులుపు' చావలేదు. రాజ్యాలు అంతరించినా, దేశ పాలకుల్లో తెచ్చిపెట్టుకున్న రాచరికపు లక్షణాలు చావడం లేదు. దేశంలోని అసంఖ్యాక మైనారిటీ జాతుల ఉనికిని, వారి ప్రయోజనాలను తక్కువ చేసేలా పౌర చట్టాన్ని కొత్తగా సవరిస్తూ రూపొందించడం ఇందుకు ఒక ఉదాహరణ. పార్లమెంటులో నిర్దుష్టమైన చర్చ జరక్కుండానే ఆమోదించినట్టు పాలకులు ప్రకటించిన మరునాడే, రాష్ట్రపతి ఆమోద ముద్ర కూడా పొందినట్టు వెల్లడించారు. అయినా చట్టం అమలులోకి రాకుండా ఎందుకు ఉండిపోవాల్సి వచ్చింది? దానికి కారణం–కొత్త చట్టం కింద రూల్స్ రూపొందించలేక పోవడం!

కాగా, త్రిపురలోని ఏ వామపక్ష ప్రభుత్వాన్ని, అందులోనూ దేశ వ్యాప్తంగా ప్రశంసలు పొందిన మాణిక్ సర్కార్ ప్రభుత్వాన్ని కుట్రపూరితంగా దేశ పాలకులు కూలదోసి కులుకుతున్నారో– అదే ఢిల్లీ పాలకులకు నిద్ర లేకుండా చేస్తూ త్రిపురలోని అనేక ఆదివాసీ తెగలను సమీకరించి, 'గ్రేటర్ తిప్రాలాండ్' (బృహత్ త్రిపుర) పేరిట 'తిప్రహా దేశీయ అభ్యుదయ ప్రాంతీయ సమాఖ్య'ను ప్రద్యోదత్ విక్రమ్ మాణిక్య దెబ్రమా నెలకొల్పారు. త్రిపుర అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ సమాఖ్య ఏర్పడింది. ఈ బృహత్ త్రిపుర 19 తెగల ప్రజా బాహుళ్యం విస్తరించి ఉన్న ప్రాంతం. ఈ ఆదివాసీ ప్రజా బాహుళ్యానికి ప్రాథమిక హక్కులు ఉన్నప్పటికీ వాటికి రక్షణ లేకపోయినందునే తాజా బృహత్ ఉద్యమానికి వారు సిద్ధమయ్యారు. త్రిపుర రాష్ట్ర సరిహద్దులలోనే 'గ్రేటర్ తిప్రాలాండ్' నెలకొల్పుకోవడానికి పూనుకున్నారు. త్రిపురలో బీజేపీ–ఆరెస్సెస్ పాలనకు ఇప్పుడీ 'గ్రేటర్ తిప్రాలాండ్' 'దేవిడీమన్నా' చెప్పడంతో ఢిల్లీ పాలకుల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది.

మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ(24 నవంబర్ 2022)– చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోందని విమర్శకులు చెబితే సరిపోదనీ, నిజానికి భారతదేశ చరిత్రను తిరగ రాయాల్సిన సమయం వచ్చిందనీ చెప్పారు. ఈ దేశంలో 150 సంవత్సరాలకు మించి ఏ ప్రాంతంలో అయినా కనీసం 30 రాజ్యాలు పరిపాలించిన

రెండో మాట



ఉదాహరణలతో పండితులూ, విద్యార్థులూ పరిశోధించి తెల్పడానికి ముందుకు రావాలని విన్నపాలు చేశారు. 'మన చరిత్ర వక్రీకరణలకు గురైంది. దాన్ని సరి చేయడానికి మనం కష్టపడి పనిచేసి చరిత్రను సరి చేయాలి' అని అమిత్ షా బాహాటంగానే ప్రకటిస్తున్నారు. పాలకులు ఏది పలికినా శాసనమై కూర్చుంటే, ఇంక వేరే జనవాక్యానికి స్థానమేదీ?

అందుకే, అటు పాలకులకూ, ఇటు పాలితులకూ నైతిక విలువలు బోధించేది భారత లౌకిక రాజ్యాంగమేననీ, అదే సర్వులకూ నైతిక విధాన బోధిని అనీ దేశ ప్రధాన న్యాయమూర్తిగా పదవీ స్వీకారం చేసిన మరుక్షణం నుంచే జస్టిస్ డీవై చంద్రచూడ్ చెబుతూనే వస్తున్నారు.

'దేశ ప్రజల్ని స్తబ్ధతలో నుంచి చైతన్యంలోకి మేలుకొల్పి, ప్రాథమిక హక్కుల్ని ఎలా కాపాడుకోవాలో బోధించి, తమ దైనందిన జీవితాలను ఎలా తీర్చిదిద్దుకోవాలో చెప్పే గైడ్' రాజ్యాంగమే అని ఆయన అన్నారు. అందువల్లే ప్రజల దైనందిన అవసరాలతో నిమిత్తం లేకుండా అర్ధంతరంగా పెద్ద నోట్లను రద్దు చేసి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా పాలకులు తీసుకున్న నిర్ణయాన్ని నిశితంగా ఖండించారు. జమ్ము–కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని (370వ అధికరణ) ఎందుకు రద్దు చేయవలసి వచ్చిందో, అవినీతికి దారులు తెరిచే ఎలక్టోరల్ బాండ్స్‌ను ఎందుకు ప్రవేశ పెట్టవలసి వచ్చిందో తెల్పాలని నిగ్గదీశారు. కొలీజియం వ్యవస్థను రద్దు చేయమని కోరే హక్కును ప్రభుత్వానికి ఎవరిచ్చారని సుప్రీంకోర్టు ప్రశ్నించాల్సిన అవసరం వచ్చిందంటే పాలకుల స్థాయిని అనుమానించవలసి వస్తోంది.

ఇక రాష్ట్రాల గవర్నర్ల నియామకంలో వారి ప్రవర్తనను కనిపెట్టి ఉండటంలో దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ పాటించిన న్యాయ సూత్రాలు ఇప్పుడు గాలికి ఎగిరిపోయాయి. పాలక పార్టీలకు వందిమాగధులుగా ప్రవర్తించే అవకాశవాద రాజకీయ శక్తులనే గవర్నర్లుగానూ, ఉపరాష్ట్రపతులుగానూ నియమించే దుఃస్థితికి పాలకులు దిగజారిపోవడాన్ని చూసి దేశం విస్తుపోతోంది. ఈ పరిస్థితుల్లో జస్టిస్ చంద్రచూడ్ దేశ ప్రధాన న్యాయమూర్తిగా రెండేళ్ల పాటు కొనసాగనుండటం 2024లో రాబోతున్న సాధారణ ఎన్నికల నిర్ణయాలపై పాలకుల ప్రభావానికి గండి కొట్టగల పరిణామంగానే భావించాలి.

అంతేకాదు... ఒకనాటి భీమా కోరెగావ్ పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ దళిత ప్రజా బాహుళ్యం జరుపుకొన్న ఉత్సవాలలో పాల్గొన్న వామపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించి వారిని ఏళ్ల తరబడి జైళ్లపాలు చేసి వేధించడం ప్రజలు గమనించారు. ఈ సమస్య కూడా దేశ ప్రధాన న్యాయమూర్తి దృష్టికి రాగానే ఆయన పాలక పద్ధతుల్ని విమర్శిస్తూ వామపక్ష రాజకీయ ఖైదీల్ని విడుదల చేయడమో, కఠిన శిక్షలను సడలించడమో జరుగుతోంది. అంతేగాదు, ఎల్గార్ పరిషత్, మావోయిస్టుల మధ్య సంబంధాల మిషతో పాలకులు బనాయించిన కేసు నుంచి ఆనంద్ తేల్‌తుంబ్డేను చంద్రచూడ్ కోర్టు విడుదల చేసింది. అంతకుముందే తేల్‌తుంబ్డే బెయిల్‌ను సవాలు చేస్తూ ఎన్ఐఏ పెట్టిన దరఖాస్తును సుప్రీం తోసిపుచ్చింది.

నేటి తాజా దేశ పరిస్థితుల్ని సమీక్షించుకోవాలంటే – ఎన్నికల కమిషనర్ల దగ్గర నుంచి రాష్ట్రాల గవర్నర్ల వరకు పాలక పక్ష నాయకుల్ని మినహాయించి మరొకర్ని నియమించే సంప్రదాయానికి స్వస్తి చెప్పారు. బహుశా అందుకే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ 'రాజ్యాంగబద్ధమైన నియామకాల్లో రాజకీయ ఒత్తిళ్లు, రాజకీయ ప్రయోజనాలకు స్థానం ఉండరాదని' స్పష్టం చేశారు. అయితే ఈ నిర్ణయానికి తూట్లు పొడవడానికి ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ప్రయత్నించిన ఫలితంగానే విరుద్ధ పరిణామాలకు చోటు దొరికింది. అలాగే న్యాయమూర్తులే న్యాయమూర్తుల్ని నియమించుకునే సంప్రదాయం మంచిది కాదనీ, కానీ ఇటీవలి కాలంలో ముగ్గురు సుప్రీం ప్రధాన న్యాయమూర్తులుగా వచ్చిన జస్టిస్ ఎన్.వి. రమణ, జస్టిస్ యు.యు. లలిత్, జస్టిస్ డీవై చంద్రచూడ్ వల్ల కోర్టు స్వతంత్ర ప్రతిపత్తికి విలువ వచ్చిందనీ లా కమిషన్ మాజీ అధ్యక్షుడు, ఢిల్లీ, మద్రాసు హైకోర్టుల మాజీ ప్రధాన న్యాయమూర్తి అజిత్ ప్రకాష్ షా అభిప్రాయపడవలసి వచ్చింది.

బహుశా అందుకే కాబోలు ఓ మహాకవి మనలో అసలు జబ్బు ఎక్కడుందో చెబుతూ – ''మనల్ని చూసి మనం నవ్వుకోలేక పోవడమే ఏడుపంతటికీ కారణం/ ఇంకా ఎన్నాళ్ళీ ఏడుపు? ఇవాళ సమస్యల్ని పరిష్కరించలేక/ ఆధ్యాత్మికంలోకి పరుగెత్తుతారు/ పద్యాలచే పంటలు పండించగలవా?/ పప్పు రుబ్బించగలవా?'' అని ప్రశ్నిస్తారు.

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

రద్దీ రహదారులు



ఢిల్లీలో జీ20 సదస్సును ప్లాన్ చేస్తున్నాం. మామూలు రోజుల్లోనే ఢిల్లీ ప్రజలు కుల, మత, వర్గాలకు అతీతంగా ట్రాఫిక్ రద్దీపై చాలా అసహనంతో ఉంటారు. అయినప్పటికీ పి.డబ్ల్యూ.డి. అసమర్థతను నిరసించే స్వరాలు వినిపించవు. వీధుల్లోకి రాకుండా వీధుల్ని సరిచేయించడం ఎలా?

– సుధీర్ చౌదరి, సంపాదకులు

రాణికోట రహస్యాలు



ప్రిన్స్ హ్యారీ ఆత్మకథ 'స్పేర్' విడుదల రోజే 10 లక్షల 40 వేల కాపీలకు పైగా అమ్ముడైంది! ఇక ఆయన భార్య మేఘన్ మార్కెల్ రాయబోయే పుస్తకం కోసం వేచి ఉండండి. అదొక అగ్నిపర్వతమే. రాజకుటుంబంలో హ్యారీ దంపతులను ద్వేషించినవారు, వీరిని విరోధులుగా భావించిన వారు ఏం కాబోతున్నారన్న ఆందోళన నన్ను నిలవనివ్వడం లేదు.

– డాక్టర్ షోలా మోస్, సామాజిక కార్యకర్త

'వాచ్'ని నమ్మొచ్చా?!



హ్యూమన్ రైట్స్ వాచ్ గురించి నిజంగా మెచ్చుకోదగిన విషయం ఏమిటంటే వారు ప్రతి ఒక్కరినీ విమర్శిస్తారు. నేను, ఇతరులు ఏళ్ల తరబడిగా ఆధారపడుతున్న హెచ్.ఆర్.డబ్ల్యు. నివేదికలు ఈ విషయాన్నే చెబుతున్నాయి. అయితే నిర్దిష్ట అంశాలలో వారు వహించే మౌనం వారి విశ్వసనీయతనే దెబ్బతీసేలా ఉంటోంది.

– ముర్తజా హుస్సేన్, విశ్లేషకులు

అంతిమ ప్రార్థన



ఉదయం ప్రార్థనలకు ముందు 22 ఏళ్ల మొహమ్మద్ మెహదీ కరామీని సెక్యూరిటీ గార్డులు సెల్ నుంచి నిద్ర లేపి 'ఉరి'కి సిద్ధంగా ఉండమని చెప్పారు. కొద్దిసేపటికే ఆ యువకుడిని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ ఉరి తీసింది. అతడు చేసిన నేరం? స్వేచ్ఛను కోరుతూ శాంతియుతంగా నిరసన ప్రదర్శన జరుపుతున్నవారికి మద్దతునివ్వడం!

– మాసిహ్ అలినేజాద్, ఇరాన్ యాక్టివిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

'మండల్' అమలు వ్యూహం ఆయనదే!

నివాళి



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

దేశరాజధానిలో 2023 జనవరి 12న తీవ్రమైన గుండెపోటుతో కన్నుమూసిన శరద్ యాదవ్ (75) మృతి దేశ వ్యాప్తంగా ఆయన అనుయాయులను, ఆరాధకులను దిగ్భ్రాంతికి గురిచేసింది. మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన ఈ యువ ఎమర్జెన్సీ వ్యతిరేక విద్యార్థి నేత 1974 జయప్రకాష్ నారాయణ్ ఉద్యమ సమయంలో 27 ఏళ్ల ప్రాయంలోనే పార్లమెంటు స్థానంలో గెలుపొంది జాతీయ నేతగా మారారు. ఓబీసీ భావన, దాని వర్గీకరణ జాతీయ నిఘంటువుగా మారడానికి చాలాకాలానికి ముందే ఆయన శూద్ర, ఓబీసీ, సామాజిక శక్తుల ప్రతినిధిగా, సోషలిస్టు సిద్ధాంతవేత్తగా ఆవిర్భవించారు.

రామ్‌మనోహర్ లోహియా, కర్పూరీ ఠాకూర్ (బిహార్‌కి చెందిన క్షురక సామాజిక బృందానికి చెందిన నేత)ల సోషలిస్టు సిద్ధాంత భూమిక నుంచి ఉత్తర భారతదేశంలో ఆవిర్భవించిన నూతన యువ శూద్ర, ఓబీసీ నేతల బృందంలో శరద్ యాదవ్ ఒక భాగమై ఉండేవారు. ఈ బృందంలోని ఇతర నేతలు తమ సొంత రాష్ట్రాలకే పరిమితమై పోగా, ఈయన మాత్రం జాతీయ ప్రముఖుడిగా మారారు. ఈ యువ బృందానికి చెందిన ములాయం సింగ్ యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్‌లు జాతీయ రాజకీయాల నుంచి వెనుదిరిగి రాష్ట్ర రాజకీయాలకు పరిమితమైపోగా, శరద్ యాదవ్ మాత్రం పార్లమెంటులోనే ఉండిపోయారు. ఏడు సార్లు లోక్‌సభ సభ్యుడిగా, మూడుసార్లు రాజ్యసభ సభ్యుడిగా నెగ్గిన శరద్ యాదవ్ పార్లమెంటులో పేదల అనుకూల సమరాల్లో పోరాడుతూ వచ్చారు. హిందీలో చక్కటి వక్త, తార్కిక చింతనాపరుడైన శరద్ యాదవ్ రాజకీయ వ్యూహకర్తగా ఉండేవారు.

ఈయన రాజకీయ వ్యూహం ఫలితంగానే నాటి ఉప ప్రధాని, జాట్ నేత అయిన దేవీలాల్ నుంచి తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలోనూ... మండల్ నివేదికలోని ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ ఇచ్చే అంశాన్ని వీపీ సింగ్ అమలు చేయవలసి వచ్చింది. జనతా దళ్ ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన పరిణామాల గురించి శరద్ యాదవ్ వివరించి చెప్పారు.

'మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చాల్సిందిగా జనతా దళ్ ప్రభుత్వంపై ఒత్తిడి చేయడానికి మేము సోషలిస్టు నేతలందరినీ సమీకరించడం ప్రారంభించాము. ఇది జరగకుండా శూద్రులకు నిజమైన న్యాయం కలగదని మేము బలంగా నమ్మాము. మండల్ కమిషన్ సిఫార్సులను వీపీ సింగ్ సన్నిహితులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీన్ని అధిగమించడానికి ఆయన ఉపప్రధాని, ప్రముఖ జాట్ నేత దేవీలాల్ చౌదరి అధ్యక్షతన ఒక కమిటీని నియమించారు. చరణ్ సింగ్ జోక్యం కారణం గానే జాట్లను వెనుకబడిన వర్గాల జాబితాలో మండల్ చేర్చలేకపోయారని తనకు తెలుసు. అయినప్పటికీ అనేక మంది స్థానిక జాట్ నేతలు, బృందాలు రిజర్వేషన్ కేటగిరీలో తమను చేర్చాల్సిందిగా తమ తమ రాజకీయ నేతలను ఒత్తిడికి గురి చేశారు.



శరద్ యాదవ్

ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకున్న వీపీ సింగ్ గొప్ప ఎత్తు వేశారు. జాట్లను రిజర్వేషన్ జాబితాలో చేర్చడానికి తాను వ్యతిరేకమే అయినప్పటికీ, ప్రముఖ జాట్ నేత అయిన దేవీలాల్ జాట్లను చేర్చకుండా మండల్ సిఫార్సులను అమలు చేయబోరని వీపీ సింగ్‌కు కచ్చితంగా తెలుసు. జనతాదళ్ జనరల్ సెక్రెటరీ, పరిశ్రమల మంత్రీ అయిన చౌదరి అజిత్ సింగ్ కూడా వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ప్రచారం ప్రారంభించారు, ఓబీసీ జాబితాలో జాట్లను చేర్చాల్సిందేనని నొక్కి చెప్పసాగారు. దీంతో దేవీలాల్ రాజకీయ డైలమాలో చిక్కుకున్నారు. జాట్లను వెనుకబడిన వర్గంగా చేర్చిన ఘనత అజిత్ సింగ్‌కు దక్కకూడదని ఆయన కోరుకున్నారు. మరోవైపు, జాట్లను ఓబీసీ జాబితాలో చేర్చకుంటే తన సొంత జాట్ కమ్యూనిటీ నుంచి ఆగ్రహాన్ని చవిచూసే ప్రమాదాన్ని కూడా దేవీలాల్ కోరుకోలేదు. కాబట్టి, ఇది మండల్ కమిషన్‌పై చర్చకు ముగింపు పలుకుతుందని వీపీ సింగ్ భావించారు.'

''1990 ఆగస్టు 3న, వీపీ సింగ్ నాకు కబురంపి 'సోదరా శరద్! చౌదరి దేవీలాల్‌ని ఇక ఏమాత్రం నేను సహించలేన'ని చెప్పారు. దేవీలాల్‌తో మాట్లాడతాననీ, ఈ అధ్యాయానికి శాశ్వతంగా ముగింపు పలుకుతాననీ నేను వీపీ సింగ్‌కు హామీ ఇచ్చాను. అయితే దేవీలాల్‌ని కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించవద్దని నేను వీపీ సింగ్‌ను అభ్యర్థించాను. కానీ అప్పటికే దేవీలాల్‌కి ఉద్వాసన పలుకుతున్న ఆదేశాన్ని తాను రాష్ట్రపతికి పంపేసినట్లు వీపీ సింగ్ సమాధాన మిచ్చారు. దీంతో నేను సంభాషణను ముగించాల్సి వచ్చింది. మరుసటి రోజు తన కార్యాలయానికి రావలసిందిగా వీపీ సింగ్ కబురంపారు. నేను వెళ్లాను. దేవీలాల్ గురించి చర్చించుకున్నాము. నన్ను విశ్వాసంలోకి తీసుకోవాలని వీపీ సింగ్ భావించారు. అలాగైతేనే నేను దేవీలాల్‌తో జతకట్టబోనని ఆయన భావించారు. దేవీలాల్ పక్షంలో నేను చేరినట్లయితే ప్రధానమంత్రిగా తాను ఎక్కువ కాలం కొనసాగలేనని వీపీ సింగ్ భావిస్తున్నారని దీనర్థం.

ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకున్న నేను మండల్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేస్తున్నట్లు ప్రకటించాలని వీపీ సింగ్‌ను కోరాను. ఆయన 1990 ఆగస్టు 15న దీనిపై ప్రకటన వెలువరించడానికి మొదట అంగీకరించారు. కానీ ఆగస్టు 9వ తేదీనే ఆయన దాన్ని ప్రకటించాల్సి వచ్చింది. అలా ప్రకటించకపోయి ఉంటే నేను ఢిల్లీలో జరగనున్న దేవీలాల్ ర్యాలీలో చేరడం తప్ప మరొక అవకాశం నాకు ఉండేది కాదు. మండల్ సిఫార్సులను అమలు చేస్తే అవి సమానతా సమాజాన్ని విశ్వసించి, దానికోసం కలగన్న అంబేడ్కర్, కర్పూరీ ఠాకూర్, లోహియా, జయప్రకాష్ నారాయణ్ స్వప్నాలు సాకారమవుతాయని నేను భావించాను.

1990 ఆగస్టు 6న వీపీ సింగ్ నివాసంలో సాయంత్రం 6 గంటలకు క్యాబినెట్ సమావేశం జరిగింది. మండల్ కమిషన్ సిఫార్సుల అమలు ఈ సమావేశ ప్రధాన ఎజెండా. సన్నిహితులు హెచ్చరిస్తున్నప్పటికీ, ఆ మరుసటి రోజు అంటే 1990 ఆగస్టు 7న కేంద్ర ప్రభుత్వం 27 శాతం రిజర్వేషన్లను ఓబీసీలకు కల్పిస్తూ మండల్ కమిషన్ చేసిన రికమండేషన్‌ను అమలు చేస్తామని ప్రకటించింది. చివరకు 1990 ఆగస్టు 13న ఓబీసీ రిజర్వేషన్ అమలుకు కేంద్రం నోటిఫికేషన్ జారీచేసింది. ఆగస్టు 10 నుంచే ఆధిపత్య కులాలు రిజర్వేషన్‌కి వ్యతిరేకంగా నిరసనలు ప్రారంభించాయి. నెలరోజుల పాటు విద్యార్థులు, బ్యూరోక్రాట్లు, టీచర్లు దేశవ్యాప్తంగా రిజర్వేషన్ వ్యతిరేక నిరసనల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమయ్యాయి. రహదారులు దిగ్బంధనకు గురయ్యాయి.'' – 'ది శూద్రాస్–విజన్ ఫర్ ఎ న్యూ పాత్' అనే పుస్తకం నుంచి.

అయితే, ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను కల్పించాలన్న మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేసేలా వీపీ సింగ్ ప్రభుత్వాన్ని ప్రేరేపించడంలో; వీధుల్లో మండల్ అనుకూల, వ్యతిరేక పోరాటాలను రగుల్కొల్పడంలో నాటి యువ శరద్ యాదవ్ తగిన పాత్ర పోషించకపోయి ఉంటే, భారతీయ శూద్ర/ఓబీసీలు ఈ రోజు దేశంలో ఈ స్థాయికి చేరుకుని ఉండేవారు కాదు. ఆర్ఎస్ఎస్/బీజేపీ శక్తులను నియంత్రిస్తున్న ద్విజులు మండల్ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నప్పటికీ, ఆనాడు శూద్ర/ఓబీసీలు భారీ స్థాయిలో మండల్ అనుకూల సామాజిక సమీకరణకు పూనుకోకపోయి ఉంటే, నేడు ఓబీసీలు తమకు నాయకత్వం వహించి, నరేంద్రమోదీ భారత ప్రధాని కావడానికి ద్విజులు అమోదించి ఉండేవారు కాదు. చివరగా, ఏ రాజకీయ పార్టీలో ఉన్నప్పటికీ శూద్ర/ఓబీసీ నేతలు నేటి తమ రాజకీయ ప్రతిపత్తికి గాను శరద్ యాదవ్ అనే గొప్ప పోరాటకారుడికి ఎప్పటికీ రుణపడి ఉంటారు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

విదులోపాఖ్యానం

వ్యాస భారతం ఉద్యోగ పర్వంలో విదులోపాఖ్యానం అని ఒకటి ఉన్నది. కృష్ణుడు కౌరవుల వద్ద తన రాయబారం విఫలమయ్యాక తిరిగి వెళ్తూ కుంతిని చూడటానికి వస్తాడు. వచ్చి, 'నీ కొడుకుల్తో ఏమి చెప్పమంటావు అత్తా' అని అడుగుతాడు. 'యుద్ధం చేసి రాజ్యం సంపాదించుకోమని చెప్పు' అని అంటుంది. అలా అనడమే కాక, తన మాటను సమర్థించుకోవటానికి అన్నట్లు ఒక కథను జోడించి చెబుతుంది.

''పూర్వం 'విదుల' అనే పేరు గల ఒక ప్రసిద్ధురాలైన క్షత్రియ కాంత ఉండేది. ఆమె కొడుకు, సంజయుడనే పేరు గలవాడు, యుద్ధంలో సింధు రాజు చేత ఓడింపబడి ఇంటికి పారిపోయి వస్తాడు. తన కొడుకు దీనదశలో పడి ఉండటం చూసి ఆమె అతణ్ణి నిందిస్తూ ఇలా అంటుంది...



'శత్రువులకు నీవు సంతోషం కలిగించవద్దు. బలహీనుడవనుకొని నిన్ను నీవు అవమాన పరచుకోవద్దు. లేచి నిలబడు. ఊక నిప్పులా పొగచూరే బదులు, కాసేపైనా భగ్గుమని వెలగాలి. విద్వాంసుడు తాను కోరిన ఫలం లభించినా, లభించకపోయినా దుఃఖించడు. నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాడు. ఎవని పరాక్రమాన్నీ, ప్రవర్తననూ లోకులు గొప్పగా ప్రశంసింపరో, ఏ మనుష్యుని చేత సంతానం మాత్రమే వృద్ధి చెందింపబడుతుందో, అట్టివాడు పురుషుడు కాడు, స్త్రీ కూడా కాదు. అందరికీ ఆశ్రయమిస్తూ పండ్లతో ఉన్న చెట్టులా బతకాలి మనిషి!'

విదుల ఈ విధంగా కొడుక్కి బోధించి, ఇంకా అతనికి యుద్ధంలో ఉత్సాహం కలిగేట్టు ఇలా అంటుంది– 'నీ పేరు సంజయుడు. ఎవని చేతనూ నీవు జయింపబడవు. యుద్ధంలో విజయం సాధించి నీ పేరు సార్థకం చేసుకో.'

ఇట్లా తల్లి చెప్పిన ఉపదేశ వాక్యాలు విని సంజయుడిలో ఉత్సాహం ఉరకలెత్తింది. జాతి గుర్రంలా విజృంభించి, తల్లి చెప్పినదంతా చేసి పెట్టాడు.'' ఈ విధంగా కుంతి, శ్రీకృష్ణునకు విదులోపాఖ్యానం చెప్పి అతని ద్వారా ధర్మరాజుకు తన సందేశం పంపుతుంది.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: బ.దశమి ప.12.57 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: విశాఖ ప.2.24 వరకు, తదుపరి అనూరాధ, వర్జ్యం: సా.6.15 నుండి 7.48 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.51 నుండి 9.34 వరకు తదుపరి రా.10.53 నుండి 11.45 వరకు, అమృతఘడియలు: ఉ.5.48 నుండి 7.19 వరకు, తిరిగి రా.3.33 నుండి 5.06 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.42



సోమవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభిషేక్ రెడ్డి, జస్టిస్ శ్రీదేవి తమ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు వారికి తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనం అందజేశారు.

'ఉద్యోగానికి రాజీనామా చేయడం లేదు'



సాక్షి, హైదరాబాద్: తాను ఉద్యోగానికి రాజీనామా చేయడం లేదని ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులు నమ్మొద్దన్నారు. ప్రస్తుతం కంటి వెలుగు కార్యక్రమంలో బిజీబిజీగా ఉన్నానని, అనవసరంగా తనపై తప్పుడు ప్రచారం చేయొద్దని కోరారు.

30లోగా ఈసీకి మా వైఖరి చెప్తాం



సాక్షి, హైదరా బాద్: రిమోట్ ఓటింగ్ విధా నాన్ని బీఆర్ఎస్ పార్టీ వ్యతి రేకిస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బి.వినోద్‌కుమార్ తెలిపారు. ఢిల్లీలో రిమోట్ ఓటింగ్‌పై ఎన్నికల కమిషన్ నిర్వహించిన సమావేశానికి గైర్హాజరైన నేపథ్యంలో బీఆర్ఎస్ తరపున వినోద్‌కుమార్ స్పందించారు. రిమోట్ విధానంపై పార్టీ నేతలతో చర్చించి ఈనెల 30 లోగా ఎన్నికల కమిషన్‌కు లిఖిత పూర్వకంగా బీఆర్ఎస్ అభి ప్రాయాన్ని తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. కాగా రిమోట్ విధా నం దేశానికి అవసరం లేదని, అభి వృద్ధి చెందిన దేశాలే ఈ పద్ధతిని పక్కన పెడుతున్నాయని అన్నారు. ఇప్పుడున్న ఈవీఎంలనే హ్యాక్ చేస్తున్నారనే ప్రచారాలు ఉన్నాయ ని, వాటినే ఈసీ ఇప్ప టివరకు నివృత్తి చేయలేదన్నారు. ఈ పరిస్థితుల్లో రిమోట్ ఓటింగ్ యంత్రాలను ఎలా విశ్వసిస్తామని ప్రశ్నించారు.

కొత్తగా ఒకరికి కరోనా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సోమవారం 3,912 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో ఒకరు వైరస్ బారిన పడ్డారని ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరిందని వెల్లడించారు. ఒక్కరోజులో కరోనా నుంచి 15 మంది కోలుకోగా, ఇప్పటివరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరిందని, ప్రస్తుతం 27 మంది ఐసోలేషన్ లేదా చికిత్స పొందుతున్నట్లు వివరించారు.

అన్ని మతాల వారిని సమానంగా చూస్తాం : హోంమంత్రి

- బీఆర్ఎస్ పార్టీలో చేరిన బిహార్‌కు చెందిన ముస్లిం కార్మికులు

సాక్షి, హైదరాబాద్: అన్ని మతాల వారిని సమానంగా చూస్తామని, దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల వారు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. బిహార్ రాష్ట్రానికి చెందిన పలువురు ముస్లిం కార్మికులు హోంమంత్రి సమక్షంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బద్రుద్దీన్ ఆధ్వర్యంలో బిహార్ నుండి వివిధ పార్టీలకు చెందిన యాభై మంది కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సీఎం కేసీఆర్ తన ఎనిమిదేళ్ల పాలనలో తెలంగాణకు దేశంలోనే ప్రముఖ స్థానం కల్పించారని, దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి అహోరాత్రులు కృషి చేస్తున్నారన్నారని హోంమంత్రి తెలిపారు. నిత్యం ప్రజల సేవల్లో పార్టీ నిమగ్నమై ఉంటుందని, తమతమ ప్రాంతాల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నడుం బిగించాలని పార్టీలో చేరిన కార్యకర్తలకు సూచించారు.

విదేశీ వేదికలపై ప్రధానిపై విమర్శలా?: బీజేపీ

సాక్షి, హైదరాబాద్: విదేశీ వేదికల్లో ప్రధాని మోదీపై ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని బీజేపీ అధికార ప్రతినిధి జె.సంగప్ప మండిపడ్డారు. ఇతర దేశాలకు వెళ్లినపుడు దేశం ఔన్నత్యాన్ని, ప్రధాని చేపడుతున్న కార్యక్రమాల గురించి చెప్పాల్సిందిపోయి అవాకులు, చెవాకులు మాట్లాడి దేశం పరువు తీస్తారా అంటూ ఆయన మండిపడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ, మరోసారి మోదీ గురించి విదేశీ వేదికలపై విమర్శిస్తే కేటీఆర్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దావోస్ పర్యటన కేటీఆర్‌కు విహార యాత్రలా మారిందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చైనా, పాకిస్తాన్ దేశాలే బాగున్నట్లు కనిపిస్తోందని మండిపడ్డారు.

వన్‌డే ఫార్మింగ్ | ఫార్మ్ టూరిజం | యువ 'సాయం'

ఐటీ ఉద్యోగులకు అగ్రి లెసన్స్

- విద్యార్థులు, వ్యవసాయ ఔత్సాహికులకూ శిక్షణ
- అగ్రికల్చర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్
- ముగ్గురు యువకుల వినూత్న ప్రయోగం



ఘట్‌కేసర్ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో పని చేస్తున్న ఐటీ ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: నేటి ఆధునిక సాంకేతిక యుగం ఐటీ చదువులు మొదలు అంతరిక్షజ్ఞానం వరకు ఎదిగిపోయింది. కానీ మనిషి బతకడానికి మూలాధారమైన వ్యవసాయాన్ని మాత్రం అన్ని రంగాల కు దీటుగా అభివృద్ధి చేయలేకపోతోంది. ఆహార భద్రత మరింత అవసరమని ప్రపంచ వేదికలు చెబుతున్నా నిర్లక్ష్యానికి గురవుతోంది. ఇలాంటి తరుణంలో నగరానికి చెందిన ముగ్గురు యువకులు నగర శివారు ప్రాంతంలో 'సాయిల్ ఈజ్ అవర్ సోల్' అనే వ్యవసాయ క్షేత్రాన్ని సృష్టించి నేటితరం యువతను వ్యవ'సాయం' వైపునకు మళ్లించేలా వన్‌డే ఫార్మింగ్, ఫార్మ్ టూరిజమంటూ వినూత్న కార్యక్రమాలను చేపట్టారు. ఐటీ ఉద్యో గులతోపాటు నగరంలోని విద్యార్థులను తమ క్షే త్రానికి తీసుకెళ్లి వ్యవసాయంపై అవగాహన కల్పి స్తున్న ఈ యువ కర్షకులను 'సాక్షి' పలకరించింది.

మూడేళ్లు శ్రమించి...

ఘట్‌కేసర్ సమీపంలో 18 ఎకరాల్లో ఈ ప్రకృతి వ్యవసాయ క్షేత్రం పురుడుపోసుకుంది. ఇక్కడ వరితోపాటు తృణధాన్యాలు, పప్పుదినుసులు, కూరగాయలు, ఫలాలు, ఔషధాలు సాగు చేస్తున్నారు. బీటెక్ అగ్రికల్చర్ చదివిన రాకేశ్, ఐటీ రంగంలో అనుభవమున్న మురళీధర్‌రావు, శ్రీనివాస్ అనే యువ కర్షకులు ఈ క్షేత్రంలో నేచురల్ ఫార్మింగ్ చేస్తున్నారు. వ్యవసాయాన్ని విద్యగా మార్చాలనే సంకల్పం, యువతను సాగు వైపునకు తీసుకురావాలనే సంకల్పంతో కలిసికట్టుగా మూడేళ్లు శ్రమించి ఈ క్షేత్రాన్ని తయారు చేశారు. వన్ డే ఫార్మింగ్‌లో భాగంగా వరినాట్లు వేయడం, నీటి పారుదల, కలుపుతీయడం, కూరగాయలు తుంచడం, చీడపీడల నివారణ తదితరాలను వివరిస్తూ రోజంతా రైతు పడే కష్టాన్ని వివరిస్తారు. ఈ ఫామ్ టూరిజం కోసం పలు ఐటీ కంపెనీల నుంచి పలువురు వీకెండ్ సెలవుల్లో ఇక్కడ వాలిపోతున్నారు.

చోటా కిసాన్...



తినే ఆహారం ఎక్కడి నుంచి వస్తుందో కూడా తెలియని నగర విద్యార్థులకు పంటలు ఎలా పండుతాయనే విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రాజెక్టులో భాగంగా పాఠశాలలు తమ విద్యార్థులకు ఇక్కడకు తెస్తున్నాయి. మట్టి తాకితే అపరిశుభ్రం అనే భావనను తొలగించి మట్టిలో యాక్టినో మైసిటిస్ వంటి బ్యాక్టీరియాలుంటాయని చెబుతూ అవి చేసే సాయాన్ని వివరిస్తున్నారు. బురద మట్టిలో కబడ్డీ, ఫుట్‌బాల్ వంటి మడ్ గేమ్స్ ఏర్పాటు చేసి మళ్లీ మట్టికి మనుషులను దగ్గర చేస్తున్నారు. వ్యవసాయ డిప్లొమా, అగ్రికల్చర్ బీటెక్ విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ కూడా ఉండాలని ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టులు నిర్వహిస్తున్నారు.

గత వైభవానికి పునఃనిర్మాణం



వ్యవసాయంలో గత వైభవాన్ని, పురాతన పద్ధతులను ఈ తరానికి చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ నేలను లీజుకు తీసుకున్నాం. ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ విధానంతో పూర్వం ఉండే రచ్చబండ, మంచె, తాటిపాకలు ఏర్పాటు చేసి సహజమైన జీవనాన్ని రూపొందిస్తున్నాం. సత్తుపల్లి మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీ, సంగారెడ్డి రత్నపురి కాలేజీ సహా వివిధ ప్రాంతాల నుంచి అగ్రికల్చర్ డిప్లొమా, పాఠశాలల విద్యార్థులు వస్తున్నారు.
– రాకేశ్, క్షేత్ర వ్యవస్థాపకుడు

ఫార్మ్ టూరిజం

ఐటీలో ఉద్యోగం చేశాను, వ్యాపారం చేస్తున్నాను. కానీ మన మూలాలైన వ్యవసాయం అంటే అమితమైన ఇష్టం. ఇందులో అవగాహన కోసం ఈ క్షేత్రాన్ని సందర్శించాను. ఎన్నో మెళకువలు తెలుసుకున్నాను. ఒకే వ్యవసాయ క్షేత్రంలో విభిన్న పంటలకు సంబంధించిన విషయాలను తెలుసుకోవచ్చు. ఈ ఫార్మ్ టూరిజాన్ని పిల్లలకు చేరువ చేయాలని విరివిగా వస్తున్నాను.
–రామకృష్ణ, బీహెచ్‌ఈఎల్

సంతృప్తినిచ్చే సమీకృత వ్యవసాయం



రసాయనాలు వాడకుండా కూర గాయలు, వరి, పసుపు, అల్లం, కంది, కుసుమ, పశుగ్రాసం సాగు చేస్తున్నాం. వీటితోపాటు మామిడి, జామ, సపోట, పనస, ఉసిరి, సీతాఫలాలం, అలాగే టేకు, మహాగని, సాండిల్-రోజ్ వుడ్ వంటి కలప మొక్కలనూ పెంచుతున్నాం. సమీకృత వ్యవసాయంలో భాగంగా ఆవులు, కోళ్లు, కుందేళ్లు, చేపలు పెంచుతూ.. వీటి ద్వారా వచ్చే ఎరువులను సేంద్రియ ఎరువులుగా వినియోగిస్తున్నాం. పది, ఇరవై ఏళ్లకు కూడా లాభాలను అందించేలా దీర్ఘకాలిక వృక్షాలనూ పెంచుతున్నాం. వ్యవసాయంలో అద్భుతమైన జీవితం ఉందని నిరూపిస్తున్నాం.
–మురళీధర్‌రావు, క్షేత్ర వ్యవస్థాపకుడు

కేసీఆర్ జన్మదినం రోజున సచివాలయం ప్రారంభం

- ఫిబ్రవరి 17న ముహూర్తం ఖరారు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న డాక్ట ర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయ భవన ప్రారంభోత్సవం ముహూర్తం ఎట్టకేలకు ఖరారైంది. సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఫిబ్రవరి 17న ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రారంభ తేదీని ఖరారు చేయ డంతో మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి సీఎం జన్మదినం నాటికి భవనాన్ని సిద్ధం చేయడంపై అధికారులు దృష్టి సారించారు. రూ.617 కోట్ల వ్య యంతో నిర్మిస్తున్న ఈ సచివాలయ పనులకు 2019 జూన్‌లో సీఎం భూమి పూజ చేసిన విషయం తెలిసిందే.

పనులను పరిశీలించిన మంత్రి: ఉమ్మడి రాష్ట్రంలో పలు భవనాలతో కూడిన సచివాలయ సముదాయం సేవలందించగా, అవి విడివిడిగా ఉండటం అంత అనుకూలంగా లేదన్న కారణంతో వాటిని కూల్చేసి 10.52 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో జీ ప్లస్ 6 అంతస్తులుగా ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని తరహాలో అత్యంత విశాలంగా, పూర్తి ఆధునిక వసతులతో చేపట్టారు. గతేడాది దసరాకు ప్రారంభించాలనుకున్నా పనులు పూర్తి కాలేదు. తాజాగా సంక్రాంతికి అనుకున్నా సిద్ధం కాలేదు. ఇప్పుడు ఫిబ్రవరి 17ను ముహూర్తంగా ఖరారు చేయడం విశేషం. అప్పటివరకు పనులు పూర్తి కావడం కొంత ఇబ్బందిగానే ఉన్నా పది రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అధికారులను సోమవారం ఆదేశించారు.


ఇండో–పర్షియన్ నమూనాలో...

గతంలో భాగ్యనగరంలో ఇండో–పర్షియన్ నమూనాలో గుమ్మటాలతో హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి సహా ఎన్నో భవనాలు నిజాం కాలంలో రూపుదిద్దుకున్నాయి. మళ్లీ ఇప్పుడు అదే నమూనాలో కొత్త సచివాలయ భవనం సిద్ధమవుతోంది. ఈ నిర్మాణంలో కాకతీయ శైలి కూడా ఉందని నిర్మాణ సంస్థ చెబుతోంది. ఈ భవనంలో 34 గుమ్మటాలను తీర్చిదిద్దారు. ఇందులో రెండు గుమ్మటాలు 82 అడుగుల ఎత్తుండటం విశేషం. మధ్యలో కోర్ట్‌యార్డు.. దానికి ముందు వెనక రెండు బ్లాకులపై ఉండే ఈ భారీ గుమ్మటాలపై నాలుగు సింహాలుండే అశోక చిహ్నం ఏర్పాటు చేశారు. ● ఈ ప్రాంగణం 28 ఎకరాల్లో విస్తరించి ఉంది. కోర్టు యార్డు లాన్ రెండు ఎకరాల్లో ఉండగా, భవనం ముందువైపు ఐదెకరాల్లో పచ్చిక బయళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ముందు పచ్చికలో రెండు వైపులా పార్లమెంటు ముందున్న ఫౌంటెయిన్ నమూనాలో రెండు ఫౌంటెయిన్లు ఏర్పాటు చేశారు. ● ప్రధాన భవనం 265 అడుగుల ఎత్తుంటుంది. ప్రధా న గుమ్మటాలుండే సెంట్రల్ టవర్ 8 అంతస్తులుగా ఉంటుంది. ముఖ్య మంత్రి కార్యాలయం, కేబినెట్ సమా వేశ మందిరం ఆరో అంతస్తులో ఉంటాయి. ● రెండు నుంచి ఐదో అంతస్తు వరకు ప్రతి ఫ్లోర్‌లో నాలుగు చొప్పున మంత్రులు, కేబినెట్ ర్యాంకులో ఉండే ముఖ్యుల కార్యాలయా లుంటాయి. ఒకటి, రెండు అంతస్తు ల్లో జీఏడీ, ఆర్థిక శాఖ కార్యాలయా లుంటాయి. ● ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శు లకు 59 కార్యాలయాలు సిద్ధం చేశా రు. అదనపు, ఉప, సహ కార్యదర్శు లకు 90 గదులు, సహాయ కార్యదర్శి స్థాయి వారి కోసం 121 కార్యాల యాలు ఏర్పాటు చేశారు. ఇతర సిబ్బందికి 1,550 గదులు ఏర్పాటు చేశారు. ● ముఖ్యమంత్రికి ప్రత్యేక ప్రధాన ద్వారాన్ని, 2 లిఫ్టులను ఏర్పాటు చేశారు. సీఎం, మంత్రులకు విడిగా పార్కింగ్ వసతి కల్పించారు. ● బిర్లామందిర్ రోడ్డు వైపు దేవాలయాన్ని, వెనకవైపు చర్చి, మసీదులను నిర్మిస్తున్నారు.

కన్నకొడుకును చంపుకోలేను.. | నేనే వెళ్లిపోతున్నా!

పుట్టుకతోనే బుద్ధిమాంద్యం గల కుమారుడు

- బాలుడి కారుణ్య మృతికి భర్త, అత్తింటివారి ఒత్తిడి
- పేగు బంధాన్ని తెంచుకోలేక తనువు చాలించిన తల్లి
- భవనంపై నుంచి దూకి బలవన్మరణం



స్వాతి (ఫైల్)

కూకట్‌పల్లి: పేగు తెంచుకు పుట్టిన కన్నకొడుకు కారుణ్య మృతిని తన కళ్లతో చూడలేనన్న మనోవేదనతో ఓ మాతృమూర్తి బలవన్మరణానికి పాల్పడిన విషాదకర ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పుట్టుకతోనే మానసిక స్థితి సరిగా లేని కుమారుడిని చంపేందుకు భర్త, కుటుంబ సభ్యులు ఒత్తిడి తీసుకురావటమే కాక కొన్ని రోజులుగా వేధింపులకు గురి చేస్తున్నారు. చూస్తూ చూస్తూ కుమారుడిని చంపుకోలేని ఆమె తనకు చావే శరణ్యమంటూ భవనంపై నుంచి దూకి మృతి చెందింది. పోలీసులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన శ్రీధర్‌కు, కాకినాడకు చెందిన రమా వెంకట లక్ష్మీ గణపతి స్వాతి (36)కి తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. పుట్టుకతోనే మానసిక పరిస్థితి బాగాలేని కుమారుడు తేజస్ ఉన్నాడు. కుమారుడు అవిటివాడిగా పుట్టాడని శ్రీధర్ తన భార్యను, తేజస్‌ను అత్తగారి ఇంటి వద్దనే ఉంచాడు. పెద్దల సమక్షంలో పంచాయితీలు అయిన తర్వాత మూడేళ్ల తర్వాత భార్యను, కొడుకును తీసుకుని నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీకి వచ్చాడు. ఇక్కడి మంజీరా మెజిస్టిక్ హోమ్స్‌లోని 9వ అంతస్తులోని ఫ్లాట్ నంబర్ 910లో ఉంటున్నారు. తేజస్ పెరిగి పెద్దవాడవుతున్నా అతని మానసిక పరిస్థితి కుదుటపడలేదు. దీంతో భార్య స్వాతిని వేధింపులకు గురి చేస్తున్నాడు. శ్రీధర్‌తో పాటు అతని తల్లిదండ్రులు, సోదరి, ఆమె భర్త సూటిపోటి మాటలతో మానసికంగా వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ఇటీవల తేజస్ కారుణ్య మృతికి స్వాతిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. తన కళ్ల ముందే కన్నకొడుకును చంపుకోలేని ఆవేదనకు గురైన స్వాతి ఆదివారం రాత్రి భవనం పైఅంతస్తు నుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్వాతి సోదరుడు హేమంత్ కుమార్ ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త శ్రీధర్, మామ సత్యనారాయణ, అత్త లక్ష్మి, వదిన శ్రీదేవి, భర్త దిలీప్‌లపై కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

జేపీఎస్‌ల సర్వీసులు రెగ్యులరైజ్ చేయాలి

- సీఎస్‌కు కార్యదర్శుల అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: మూడేళ్లకు పైగా ప్రొబేషన్ కాలాన్ని పూర్తిచేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్) సర్వీసులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. 317 జీవో కారణంగా నష్టపోయిన సెక్రటరీలకు వెంటనే కేడర్ స్ట్రెంథ్ నిర్ణయించి వారివారి సొంత జోన్లలో పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరింది. సోమవారం నూతన సీఎస్‌కు అసోసియేషన్ అధ్యక్షుడు పి.మధుసూదన్ రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలు వాణి కలిసి తమ సంఘం తరఫున నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. తమ విజ్ఞప్తిపై సీఎస్ సానుకూలంగా స్పందించారని మధుసూదనరెడ్డి తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల కృషి, సహకారంతో గ్రామాలు అభివృద్ధిపథంలో సాగుతున్నాయని సీఎస్ ప్రశంసించారని తెలియజేశారు.

హైదరాబాద్‌లో సీ4ఐఆర్ సెంటర్

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్, తెలంగాణ ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గన్స్, తెలంగాణ ప్రభుత్వ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈవో శక్తి నాగప్పన్ సంతకాలు చేశారు. ఐటీ, పరిశ్రమల మంత్రి కె.తారక రామారావు, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అధ్యక్షుడు బోర్జ్ బ్రెండే తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జీవశాస్త్రాలు (లైఫ్ సైన్సెస్), ఆరోగ్య సంరక్షణ అంశాలపై ఈ కేంద్రం అధ్యయనం చేస్తుంది. భారత్‌లో సీ4ఐఆర్ విభాగాన్ని ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. ప్రస్తుతం అమెరికా, బ్రిటన్ దేశాల్లో ఇలాంటి కేంద్రాలు ఉన్నాయి.

తెలంగాణ అనుకూలతలు, సత్తాకు నిదర్శనం: కేటీఆర్

లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ రాష్ట్రానికి ఉన్న అనుకూలతలు, సత్తాకు సీ4ఐఆర్ కేంద్రం ఏర్పాటు నిదర్శనమని మంత్రి కేటీఆర్ అన్నారు. ఒప్పంద కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, లైఫ్ సైన్సెస్ రంగం అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతోనే ఈ సెంటర్ ఏర్పాటు సాధ్యమైందన్నారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగంలో ఉన్న అవకాశాలను భారత్ అందిపుచ్చుకునేందుకు ఈ కేంద్రం దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధి కల్పనలో హైదరాబాద్ సీ4ఐఆర్ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ప్రెసిడెంట్ బోర్జ్ బ్రెండే అన్నారు. సీ4ఐఆర్ ద్వారా ఆరోగ్య సంరక్షణలో ఇండియాను గ్లోబల్ పవర్‌హౌస్‌గా మార్చేందుకు తెలంగాణ నాయకత్వం వహిస్తుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరం హెల్త్ కేర్ హెడ్ డాక్టర్ శ్యామ్ బిషెన్ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంరక్షణ రంగంలో వినూత్న మార్పులు, రోగుల సౌకర్యాలను మెరుగు పరచడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు.

అభివృద్ధి కోసమే నిధుల ఖర్చు

జ్యూరిచ్ ఎన్ఆర్ఐల భేటీలో కేటీఆర్

తెలంగాణ భవిష్యత్తుకు బాటలు వేసేందుకు భారీ ప్రాజెక్టులపై నిధులు ఖర్చు చేస్తే కొందరు అప్పు తప్పు అంటూ విమర్శలు చేస్తున్నారని మంత్రి కేటీఆర్ అన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, పవర్‌ప్లాంట్‌లు, నీళ్ల ట్యాంకులు కట్టడం పెట్టుబడిగా భావించాలన్నారు. దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లిన కేటీఆర్ బృందానికి స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్‌లో కేటీఆర్ ప్రసంగిస్తూ, రూ.వంద లక్షల కోట్ల అప్పు చేసిన ప్రధాని మోదీ.. దేశానికి ఉపయోగపడే పని ఒక్కటైనా చేశారా అని ప్రశ్నించారు. పేదల కోసం తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మోదీతో పాటు మరికొందరు ఉచితాలంటూ హేళన చేస్తున్నారన్నారు. ప్రపంచ పేదల రాజధానిగా భారత్ ఉందనే విషయాన్ని మరచిన కొందరు సంక్షేమ పథకాలను చిన్న చూపు చూస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణలో పెట్టుబడుల కోసం ప్రవాస భారతీయులు ప్రయత్నించాలని కేటీఆర్ కోరారు. కాగా, దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావే శంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర పెవిలియన్‌ను మంత్రి కేటీఆర్ సోమవారం ప్రారంభించారు. తెలంగాణ– ఎ వరల్డ్ ఆఫ్ ఆపర్చునిటీస్ (తెలంగాణ ఒక అవకాశాల ప్రపంచం) నినాదంతో ఏర్పాటైన ఈ పెవిలియన్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిశీల విధానాలను ప్రతిబింబించేలా రూపొందించారు.

అమెరికా అందగత్తెకు...
విశ్వ సుందరి కిరీటం



వాషింగ్టన్: 2022 సంవత్సరం విశ్వ సుందరి కిరీటాన్ని అమెరికాకు చెందిన ఆర్.బోనీ గాబ్రియెల్ గెలుచుకున్నారు. అమెరికాలోని న్యూ ఆర్లీన్స్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో భారత్‌కు చెందిన 2021 మిస్ యూనివర్స్ హర్నాజ్ సంధూ ఆమెకు కిరీటం తొడిగారు. వెనెజువెలా, డొమినికన్ రిపబ్లిక్ అందాల భామలు తొలి, రెండో రన్నరప్‌గా నిలిచారు. భారత్ నుంచి పోటీపడ్డ మంగళూరుకు చెందిన దివితా రాయ్‌కి 16వ స్థానం దక్కింది. గాబ్రియెల్ యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ నుంచి ఫ్యాషన్ డిజైనింగ్‌లో డిగ్రీ చేశారు. ఫ్యాషన్ డిజైనర్‌గా, మోడల్‌గా చేస్తున్నారు. ఆర్.బోనీ నోలా పేరిట వస్త్ర పరిశ్రమ స్థాపించి కంపెనీకి సీఈఓగా వ్యవహరిస్తున్నారు. భారత్ నుంచి 1994లో సుస్మితా సేన్, 2000లో లారా దత్తా, 2021లో హర్నాజ్ సంధూ మిస్ యూనివర్స్‌గా ఎన్నికయ్యారు.

క్లుప్తంగా...

అమెరికాలో కాల్పులు ఆరుగురు దుర్మరణం

విసాలియా: అమెరికాలో మళ్లీ తుపాకీ గర్జించింది. సెంట్రల్ కాలిఫోర్నియాలోని గోషెన్ అనే ప్రాంతంలో ఓ ఇంటి వద్ద సోమవారం తెల్లవారుజామున కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మొత్తం ఆరుగురు మరణించారు. మృతుల్లో 17 ఏళ్ల తల్లి, ఆరు నెలల ఆమె బిడ్డ కూడా ఉన్నారు. ఇద్దరు వ్యక్తులు కాల్పులకు పాల్పడినట్లు పోలీసులు అధికారులు భావిస్తున్నారు. వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రెండు మృతదేహాలు వీధిలో, మరొకటి ఇంటి గుమ్మం వద్ద, మరో మూడు ఇంటి లోపల లభ్యమయ్యాయని అధికారులు తెలిపారు. ఇవి ఉద్దేశపూర్వకంగానే ఆ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని జరిపిన కాల్పులని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

అణ్వస్త్ర దేశమై ఉండి అడుక్కోవడం సిగ్గుచేటు
పాక్ ఆర్థిక సంక్షోభంపై ప్రధాని ఆవేదన

ఇస్లామాబాద్: అణ్వస్త్ర దేశంగా ఉండి కూడా ఇతరులను బిచ్చమెత్తుకోవాల్సి రావడం సిగ్గుపడాల్సిన విషయమని పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ వాపోయారు. మరిన్ని రుణాలు కావాలని అడగడం తనకు ఇబ్బందిగా మారిందన్నారు. దేశాన్ని ఆర్థికంగా చక్కదిద్దడానికి విదేశీ రుణాలు సరైన పరిష్కారం కాదన్నారు.

ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి దాడి.. 40 మంది దుర్మరణం

కీవ్: ఉక్రెయిన్ నగరం డ్నీప్రో నగరంలోని ఓ అపార్టుమెంట్‌పై రష్యా క్షిపణి దాడిలో 40 మంది దుర్మరణం పాలయ్యారు. 75 మంది గాయపడ్డారు. 1,700 మంది ఉంటున్న ఈ భవనంపై శనివారం క్షిపణి దాడి జరిగింది. పౌర నివాసాలే లక్ష్యంగా నేరుగా రష్యా జరిపిన దాడి అమానవీయమని ఈయూ దుయ్యబట్టింది.

గృహిణులకు నెలకు 2 వేలు
కర్ణాటక ఓటర్లకు కాంగ్రెస్ హామీ

బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే గృహిణులకు నెలకు రూ.2 వేలు చొప్పున అందజేస్తామని పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా చెప్పారు. సోమవారం బెంగళూరులో మహిళల కోసం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గృహ లక్ష్మి యోజన పథకంలో భాగంగా ఏడాదికి రూ.24 వేలు నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. కోటిన్నర మందికి దీంతో లబ్ధి కలుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. మహిళలకు ప్రత్యేకంగా ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తామన్నారు. కర్ణాటకలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటం తెలిసిందే.

కాలిఫోర్నియాలో వరదలు.. 19 మంది దుర్మరణం

కాలిఫోర్నియా: అమెరికాలోని కాలిఫోర్నియా వాసులు వరుస తుపానులతో బిక్కుబిక్కుమంటున్నారు. భారీ వరదలు, మంచు కారణంగా శనివారం రాష్ట్రంలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో రెండు రోజులు వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కాలిఫోర్నియా వరదలను విపత్తుగా అధ్యక్షుడు బైడెన్ ప్రకటించారు. శనివారం సియెర్రా నెవడా ప్రాంతంలో మూడడుగుల మేర మంచు కురిసింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వారం రోజులుగా ఏడడుగుల మేర మంచు పడిందని తెలిపింది. వరదల కారణంగా ప్రధాన రహదారులు, శివారు ప్రాంతాలు జలమయమయ్యాయి.

భారత్ నానాటికీ బలోపేతం
ఆర్మీ డే వేడుకల్లో రాజ్‌నాథ్

బనశంకరి: భారతదేశం ఆర్థికంగా అంతర్జాతీయ స్థాయిలో రోజురోజుకు బలోపేతమౌతోందని, 2027 నాటికి ప్రపంచంలోనే ఆర్థిక వ్యవస్థల్లో మొదటి స్థానంలోకి రావడం తథ్యమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ఆదివారం బెంగళూరు ఏఎస్‌సీ సెంటర్‌లో నిర్వహించిన 75వ ఆర్మీ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్మీ డేను మొదటిసారిగా ఢిల్లీ బయట బెంగళూరులో నిర్వహిస్తున్నామని చెప్పారు.

1 శాతం మంది గుప్పిట్లో... 40% దేశ సంపద!

భారీగా పెరుగుతున్న పేద-ధనిక అంతరం
- ఆక్స్‌ఫాం నివేదిక వెల్లడి
- కుబేరులపై అదనపు పన్నులేయాలి
- ఆ మొత్తాలను పేదలపై వెచ్చించాలి
- అప్పుడే అసమానతలు తగ్గుతాయి

దావోస్: ప్రపంచంలోని అత్యంత సంపన్నులైన 1 శాతం మంది చేతిలో ఉన్న సంపద అంతా కలిపితే ఎంతో తెలుసా? మిగతా వారందరి దగ్గరున్న దాని కంటే ఏకంగా రెట్టింపు! ఈ విషయంలో మన దేశమూ ఏమీ వెనకబడలేదు. దేశ మొత్తం సంపదలో 40 శాతానికి పైగా కేవలం 1 శాతం సంపన్నుల చేతుల్లోనే పోగుపడిందట!! మరోవైపు, ఏకంగా సగం మంది జనాభా దగ్గరున్నదంతా కలిపినా మొత్తం సంపదలో 3 వంతు కూడా లేదు! ఆక్స్‌ఫాం ఇంటర్నేషనల్ అనే హక్కుల సంఘం వార్షిక అసమానతల నివేదికలో పేర్కొన్న చేదు నిజాలివి. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సు తొలి రోజు సోమవారం ఈ నివేదికను ఆక్స్‌ఫాం విడుదల చేసింది. 2020 మార్చిలో కరోనా వెలుగు చూసినప్పటి నుంచి 2022 నవంబర్ దాకా భారత్‌లో బిలియనీర్ల సంపద ఏకంగా 121 శాతంపెరిగిందని అందులో పేర్కొంది. అంటే రోజుకు ఏకంగా రూ.3,608 కోట్ల పెరుగుదల! భారత్‌లో ఉన్న వ్యవస్థ సంపన్నులను మరింతగా కుబేరులను చేసేది కావడమే ఇందుకు కారణమని ఓక్స్‌ఫాం ఇండియా సీఈఓ అమితాబ్ బెహర్ అభిప్రాయపడ్డారు. ఫలితంగా దేశంలో దళితులు, ఆదివాసీలు, మహిళలు, అసంఘటిత కార్మికుల వంటి అణగారిన వర్గాల వారి వెతలు నానాటికీ పెరుగుతూనే ఉన్నాయన్నారు. భారత్‌లో పేదలు హెచ్చు పన్నులు, సంపన్నులు తక్కువ పన్నులు చెల్లిస్తుండటం మరో చేదు నిజమని నివేదిక తేల్చింది.



కేంద్రానికి సూచనలు...
- అసమానతలను తగ్గించేందుకు ఏకమొత్త సంఘీభావ సంపద పన్ను వంటివి వసూలు చేయాలి. అత్యంత సంపన్నులైన 1 శాతం మందిపై పన్నులను పెంచాలి. పెట్టుబడి లాభాల వంటివాటిపై పన్ను పెంచాలి.
- వారసత్వ, ఆస్తి, భూమి పన్నులను పెంచాలి. నికర సంపద పన్ను వంటి వాటిని ప్రవేశపెట్టాలి.
- ఆరోగ్య రంగానికి బడ్జెట్ కేటాయింపులను 2025 కల్లా జీడీపీలో 2.5 శాతానికి పెంచాలి.
- ప్రజారోగ్య వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలి.
- విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులను ప్రపంచ సగటుకు తగ్గట్టుగా జీడీపీలో 6 శాతానికి పెంచాలి.
- సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులందరికీ కనీస మౌలిక వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ఈ కనీస వేతనాలు గౌరవంగా బతికేందుకు చాలినంతగా ఉండేలా చూడాలి.

"2021–22లో వసూలైన మొత్తం రూ.14.83 లక్షల కోట్ల జీఎస్టీలో ఏకంగా 62 శాతం ఆదాయ సూచీలో దిగువన ఉన్న 50 శాతం మంది సామాన్య పౌరుల నుంచే వచ్చింది! టాప్ 10లో ఉన్న వారినుంచి వచ్చింది కేవలం 3 శాతమే" అని పేర్కొంది. "దీన్నిప్పటికైనా మార్చాలి. సంపద పన్ను, వారసత్వ పన్ను తదితరాల ద్వారా సంపన్నులు కూడా తమ ఆదాయానికి తగ్గట్టుగా పన్ను చెల్లించేలా కేంద్ర ఆర్థిక మంత్రి చూడాలి" అని బెహర్ సూచించారు. ఈ చర్యలు అసమానతలను తగ్గించగలవని ఎన్నోసార్లు రుజువైందన్నారు. "అపర కుబేరులపై మరింత పన్నులు వేయడం ద్వారానే అసమానతలను తగ్గించి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోగలం" అని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గాబ్రియేలా బుచ్ అభిప్రాయపడ్డారు. "భారత్‌లో నెలకొన్న అసమానతలు, వాటి ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు సేకరించిన పరిమాణాత్మక, గుణాత్మక సమాచారాలను కలగలిపి ఈ నివేదికను రూపొందించాం. సంపద అసమానత, బిలియనీర్ల సంపద సంబంధిత గణాంకాలను ఫోర్బ్స్, క్రెడిట్‌సుసీ వంటి సంస్థల నుంచి సేకరించాం. నివేదికలో పేర్కొన్న వాదనలన్నింటికీ కేంద్ర బడ్జెట్, పార్లమెంటు ప్రశ్నోత్తరాలు తదితరాలు ఆధారం" అని ఆక్స్‌ఫాం తెలిపింది.

నివేదిక విశేషాలు...
- భారత్‌లో బిలియనీర్ల సంఖ్య 2020లో 102 ఉండగా 2022 నాటికి 166కు పెరిగింది.
- దేశంలో టాప్-100 సంపన్నుల మొత్తం సంపద ఏకంగా 660 బిలియన్ డాలర్లకు, అంటే రూ.54.12 లక్షల కోట్లకు చేరింది. ఇది మన దేశ వార్షిక బడ్జెట్‌కు ఒకటిన్నర రెట్లు!
- భారత్‌లోని టాప్ 10 ధనవంతుల సంపదలో 5 శాతం చొప్పున, లేదా టాప్ 100 ధనవంతుల సంపదలో 2.5 శాతం చొప్పున పన్నుగా వసూలు చేస్తే ఏకంగా రూ.1.37 లక్షల కోట్లు సమకూరుతుంది. ఇది కేంద్ర కుటుంబ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు కేటాయించిన మొత్తం నిధుల కంటే ఒకటిన్నర రెట్ల కంటే కూడా ఎక్కువ! ఈ మొత్తం దేశంలో ఇప్పటి దాకా స్కూలు ముఖం చూడని చిన్నారులందరి స్కూలు ఖర్చులకూ సరిపోతుంది.
- 2017–21 మధ్య భారత కుబేరుడు గౌతం అదానీ ఆర్జించిన (పుస్తక) లాభాలపై పన్ను విధిస్తే ఏకంగా రూ.1.79 లక్షల కోట్లు సమకూరుతుంది. దీనితో 50 లక్షల మంది టీచర్లను నియమించి వారికి ఏడాదంతా వేతనాలివ్వొచ్చు.
- వేతనం విషయంలో దినకూలీల మధ్య లింగ వివక్ష ఇంకా ఎక్కువగానే ఉంది. పురుషుల కంటే మహిళలకు 37 శాతం తక్కువ వేతనం అందుతోంది.
- ఇక ఉన్నత వర్గాల కూలీలతో పోలిస్తే ఎస్సీలకు, పట్టణ కూలీలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల వారికీ సగం మాత్రమే గిడుతోంది.
- సంపన్నులపై, కరోనా కాలంలో రికార్డు లాభాలు ఆర్జించిన సంస్థలపై మరింత పన్ను విధించాలని 2021లో జరిపిన ఫైట్ ఇనీక్వాలిటీ అలియన్స్ ఇండియా సర్వేలో 80 శాతం మందికి పైగా డిమాండ్ చేశారు.
- అసమానతలను రూపుమాపేందుకు సార్వత్రిక సామాజిక భద్రత, ఆరోగ్య హక్కు తదితర చర్యలు చేపట్టాలని 90 శాతానికి పైగా కోరారు.

5 శాతం మందిపై పన్నుతో.. 200 కోట్ల మందికి పేదరికం నుంచి ముక్తి



ప్రపంచవ్యాప్తంగా ఒక్క శాతం సంపన్నుల వద్ద నున్న మొత్తం, మిగిలిన ప్రపంచ జనాభా సంపద కంటే రెండున్నర రెట్లు అధికంగా ఉన్నట్టు ఆక్స్‌ఫాం నివేదిక తెలిపింది. వారి సంపద రోజుకు ఏకంగా 2.7 బిలియన్ డాలర్ల చొప్పున పెరుగుతున్నట్టు పేర్కొంది. అది ఇంకేం చెప్పిందంటే...
- ప్రపంచంలోని మల్టీ మిలియనీర్లు, బిలియనీర్లపై 5 శాతం పన్ను విధిస్తే ఏటా 1.7 లక్షల కోట్ల డాలర్లు వసూలవుతుంది. ఈ మొత్తంతో 200 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేయొచ్చు.
- 2020 నుంచి ప్రపంచమంతటా కలిసి పోగుపడ్డ 42 లక్షల కోట్ల డాలర్ల సంపదలో మూడింత రెండొంతులు, అంటే 26 లక్షల కోట్ల డాలర్లు కేవలం ఒక్క శాతం సంపన్నుల దగ్గరే పోగుపడింది!
- అంతేకాదు, గత దశాబ్ద కాలంలో కొత్తగా పోగుపడ్డ మొత్తం ప్రపంచ సంపదలో సగం వారి జేబుల్లోకే వెళ్లింది!!
- మరోవైపు పేదలు, సామాన్యులేమో ఆహారం వంటి నిత్యావసరాలకు సైతం అంగలార్చాల్సిన దుస్థితి నెలకొని ఉంది.
- వాల్‌మార్ట్ యజమానులైన వాల్టన్ కుటుంబం గతేడాది 850 కోట్ల డాలర్లు ఆర్జించింది.
- భారత కుబేరుడు గౌతం అదానీ సంపద ఒక్క 2022లోనే ఏకంగా 4,200 కోట్ల డాలర్ల మేరకు పెరిగింది!
- కుబేరులపై వీలైనంతగా పన్నులు విధించడమే ఈ అసమానతలను రూపుమాపేందుకు ఏకైక మార్గం.



ఢిల్లీలో రోడ్ షో సందర్భంగా ప్రజలకు ప్రధాని మోదీ అభివాదం

మోదీపై విపక్షాలది దుష్ప్రచారమే

సుప్రీంకోర్టు తీర్పులే నిదర్శనం
బీజేపీ జాతీయ కార్యవర్గం తీర్మానం

న్యూఢిల్లీ: "కేంద్రం ప్రభుత్వంపై ప్రధాని నరేంద్ర మోదీపై ప్రతిపక్షాల ఆరోపణలన్నీ దుష్ప్రచారాలు మాత్రమే. పలు కేసుల్లో ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుల్లోనూ ఇదే స్పష్టమైంది" అని బీజేపీ పేర్కొంది. సోమవారం బీజేపీ జాతీయ కార్యవర్గ భేటీలో కేంద్ర న్యాయ మంత్రి కిరెన్ రిజిజు ఈ మేరకు చేసిన రాజకీయ తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మీడియాకు ఈ మేరకు వెల్లడించారు. "రఫేల్, పెగసస్, సెంట్రల్ విస్టా ప్రాజెక్టు, నోట్ల రద్దు, ఈడబ్ల్యూఎస్ కోటా తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్ర దుష్ప్రచారం సాగించాయి. కానీ వీటికి సంబంధించిన అన్ని కేసుల్లోనూ కేంద్రం వైఖరిని సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పులు వెలువరించింది. విపక్షాలు చెబుతున్నదంతా అబద్ధమేనని దీంతో తేలిపోయింది" అని ఆమె అన్నారు. మోదీపై వారి నిరాధార ఆరోపణలను చట్టపరంగా తిప్పికొట్టామన్నారు. "దేశం కోసం పనిచేస్తున్న మోదీకి ప్రపంచదేశాల్లో గౌరవం లభిస్తోంది. దేశ ప్రతిష్టను ఆయన పెంచారు" అన్నారు.

2023 ఎన్నికలు కీలకం: నడ్డా

లోక్‌సభ ఎన్నికలకు ముందు 2023లో ఎన్నికలు జరిగే 9 రాష్ట్రాల్లో ఒక్కదాన్నీ బీజేపీ కోల్పోరాదని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపునిచ్చారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపును చరిత్రాత్మకంగా ఆయన అభివర్ణించారు. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దూసుకుపోతోందని కొనియాడారు.

మోదీకి ఘన స్వాగతం

అంతకుముందు కార్యవర్గ సమావేశానికి వస్తున్న మోదీకి బీజేపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. పటేల్ చౌక్ నుంచి ఎన్‌డీఎంసీ కన్వెన్షన్ దాకా పార్టీ కార్యకర్తలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి ప్రధానిపై పూలు చల్లారు. నినాదాలతో హోరెత్తించారు. ప్రభుత్వ విజయాలను తెలుపుతూ భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. వేదిక వద్ద మోదీకి నడ్డా స్వాగతం పలికారు.

నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం
72 మంది దుర్మరణం!

కఠ్మాండు: నేపాల్లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఆదివారం ఉదయం 72 మంది ప్రయాణికులతో కఠ్మాండు నుంచి టూరిస్టు కేంద్రమైన పొఖారా బయల్దేరిన యతి ఎయిర్‌లైన్స్ విమానం ల్యాండవడానికి కొద్దిసేపటి ముందు ఒక్కసారిగా కుప్పకూలింది. సెతీ నది ఒడ్డున పొఖారాలోని పాత, కొత్త విమానాశ్రయాలకు సరిగ్గా మధ్యలో నేలను తాకుతూనే భారీ శబ్దంతో పేలిపోయింది. ఈ దారుణంలో అందరూ మరణించినట్టు భావిస్తున్నారు. ఇప్పటిదాకా 69 మృతదేహాలను వెలికితీశారు. మిగతా ముగ్గురి కోసం మంగళవారం కూడా గాలింపు కొనసాగనుంది. తేలింది. మృతుల్లో ఐదుగురు భారతీయులు, నలుగురు రష్యన్లు, ఇద్దరు కొరియన్లతో పాటు ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, అర్జెంటీనా, ఇజ్రాయెల్ నుంచి ఒక్కొక్కరున్నారు. యతి ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ 9ఎన్-ఏఎన్‌సీ ఏటీఆర్-72 విమానం 15 ఏళ్ల నాటిదట. ఇందులోని ట్రాన్స్‌పాండర్ తదితరాలన్నీ మరీ పాతవని ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌రాడార్24 పేర్కొంది. ప్రమాద ప్రాంతంలో సోమవారం బ్లాక్ బాక్స్ దొరికింది. దాన్ని విశ్లేషించాకే ప్రమాద కారణం తెలిసే అవకాశముంది.

ఇళ్లమీద పడేది...!

విమాన కుప్పకూలిన చోటికి కూతవేటు దూరంలోనే పలు నివాస గృహాలున్నాయి. ప్రమాద ధాటికి విమానం రెక్కలు తమ ఇంటికి 12 మీటర్ల సమీపం దాకా దూసుకొచ్చాయని గీతా సునార్ అనే మహిళ తెలిపింది. విమానం నేలను సమీపిస్తుండగా అందులోని ప్రయాణికుల హాహాకారాలు స్పష్టంగా విన్పించాయని సమీపంలో ఆడుకోవడానికి వెళ్లిన పిల్లలు చెప్పారు.



దుర్ఘటన జరిగిన ప్రాంతం

భర్త బాటలోనే...

విమాన ప్రమాదంలో కో పైలట్ అంజూ ఖతీవాడా కూడా మరణించినట్టు భావిస్తున్నారు. ఆమె మృతదేహం ఇంకా దొరకాల్సి ఉంది. అంజూ భర్త పైలట్ దీపక్ పోఖ్రియాల్ కూడా విమాన ప్రమాదంలోనే మరణించారు! 16 ఏళ్ల కింద ఆయన నడుపుతున్న యతి ఎయిర్‌లైన్స్ విమానం ప్రమాదానికి గురై మరణించారు! అయినా వెరవక భర్త తాలూకు బీమా మొత్తంతో అమెరికాలో ఏవియేషన్ కోర్సు చేసి అంజూ కో పైలట్ అయింది. ఆదివారం నాటి ప్రయాణం ముగిస్తే ఆమె పైలట్‌గా పదోన్నతి పొందేది!

మొక్కు తీర్చుకునేందుకు వెళ్లి...

విమాన ప్రమాదంలో మరణించిన ఐదుగురు భారతీయులూ యూపీకి చెందినవారే. వీరిలో సోను జైస్వాల్ (35)కు ఇద్దరు ఆడపిల్లలే కావడంతో అబ్బాయి పుడితే నేపాల్లోని పశుపతినాథ్‌ను సందర్శిస్తానని మొక్కుకున్నాడు. అబ్బాయి పుట్టడంతో ముగ్గురు మిత్రులతో కలిసి మొక్కు తీర్చుకున్నాడు. తర్వాత పారా గ్లైడింగ్ కోసం కఠ్మాండు నుంచి బస్సులో పొఖారా వెళ్లాలనుకున్నారు. చివరి క్షణాల్లో ప్లాన్ మార్చుకుని విమానమెక్కి నలుగురూ మృత్యు ఒడిని చేరారు. ఇక ఐదో భారతీయున్ని సంజయ్ జైస్వాల్‌గా గుర్తించారు.

ఆర్‌వీఎంలకు ఒప్పుకోం
ఈసీ భేటీలో ప్రతిపక్షాల స్పష్టీకరణ

న్యూఢిల్లీ: రిమోట్ ఓటింగ్ మెషీన్(ఆర్‌వీఎం)లను అందుబాటులోకి తేవాలన్న కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిపాదనను ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. వీటి అవసరమేమిటో ముందు తేలాలని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ అన్నారు. 'ఆర్‌వీఎంలను మేం అంగీకరించం. ముందుగా ఈ అంశంపై అందరం ఏకాభిప్రాయానికి రావాలి. ఆ తర్వాతే ఎలా పనిచేస్తాయో తెలుసుకుంటాం' అని మీడియాకు చెప్పారు. ఎన్నికల పట్ల పట్టణ ఓటర్ల నిరాసక్తతకు పరిష్కారం కనుగొనాలని ఈసీని కోరారు. వివిధ కారణాలతో పరాయి రాష్ట్రాలకు వలస వెళ్లిన వారు దూరంగా ఉండే పోలింగ్ బూత్‌లో వేసిన ఓటు ఆర్‌వీఎం ద్వారా సొంత నియోజకవర్గంలో అభ్యర్థులకు పడుతుంది. ఆర్‌వీఎంల పనితీరు వివరించేందుకు ఆదివారం 8 జాతీయపార్టీలు, గుర్తింపు పొందిన 57 పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసింది. అన్ని జాతీయ పార్టీలతోపాటు 40 వరకు ప్రాంతీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారని ఈసీ తెలిపింది. అంతకుముందు కాంగ్రెస్ సహా ప్రతిపక్ష నేతలు సమావేశమై ఆర్‌వీఎంలను వ్యతిరేకించాలని నిర్ణయించాయి. ప్రభుత్వ రంగ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆర్‌వీఎంలను రూపొందించింది. ఒక్కో ఆర్‌వీఎం 72 నియోజకవర్గాలను కవర్ చేస్తుంది. ఇంటర్నెట్‌తో అవసరం లేకుండానే ఇది పనిచేస్తుంది.

ఫిబ్రవరి 28 వరకు గడువు పెంపు

ఏకాభిప్రాయం వచ్చే వరకు ఆర్‌వీఎంలపై పనితీరు రాజకీయ పార్టీలతో సమావేశం ఉండదని అధికారవర్గాలు తెలిపాయి. అంతేకాకుండా, ఆర్‌వీఎంలపై చట్ట పరమైన, పరిపాలన సంబంధం అంశాలపై రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను తెలిపేందుకు జనవరి 31వ తేదీ వరకు ఉన్న గడువును ఫిబ్రవరి 28 వరకు పొడిగించినట్లు పేర్కొన్నాయి. ఆర్‌వీఎంలను తీసుకొచ్చే విషయంలో చట్టపరంగా చేపట్టాల్సిన చర్యలు, మార్పులు చేర్పులపై అభిప్రాయాలను రాత పూర్వకంగా వెల్లడించాలని రాజకీయ పక్షాలను ఈసీ కోరుతోంది.

కొలీజియం కాక

కేంద్రం, న్యాయ వ్యవస్థ మధ్య ముదురుతున్న వివాదం



సుప్రీంకోర్టు కొలీజియం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ నడుమ వివాదంగా మారిన అంశం. కొలీజియం వ్యవస్థను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకం, బదిలీల్లో తమ పాత్ర లేకపోవడం ఏమిటంటూ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. కొలీజియం వ్యవస్థే రాజ్యాంగ విరుద్ధమంటూ పలువురు కేంద్ర మంత్రులు బాహాటంగా గళం విప్పుతున్నారు. కొలీజియం సభ్యులేమో సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకానికి తాము సిఫార్సులు మాత్రమే చేస్తామని, తుది నిర్ణయం కేంద్రానిదేనని అంటున్నారు.

ఏమిటీ కొలీజియం...?

సుప్రీంకోర్టు న్యాయమూర్తుతో పాటు దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల నియామకం, బదిలీలను సిఫార్సు చేయడానికి ఉద్దేశించినదే కొలీజియం వ్యవస్థ. సుప్రీంకోర్టు కొలీజియంలో ప్రధాన న్యాయమూర్తి, మరో నలుగురు అత్యంత సీనియర్ న్యాయమూర్తులు సభ్యులుగా ఉంటారు. న్యాయమూర్తుల నియామకం, బదిలీల విషయంలో కొలీజియంలో భిన్నాభిప్రాయాలు ఉంటే మెజార్టీ సభ్యులదే తుది నిర్ణయం. అయితే ప్రధాన న్యాయమూర్తిని తప్పనిసరిగా సంప్రదించి, ఆయన అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. కొలీజియం తన సిఫార్సులను కేంద్రానికి పంపుతుంది. ఇక హైకోర్టు కొలీజియంలో ప్రధాన న్యాయమూర్తి, ఇద్దరు సీనియర్ మోస్ట్ న్యాయమూర్తులు సభ్యులు. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సులు పంపుతుంది. ముఖ్యమంత్రి వాటిని కేంద్ర న్యాయ శాఖ మంత్రికి పంపిస్తారు. వాస్తవానికి రాజ్యాంగంలో కొలీజియం ప్రస్తావన లేదు. కొలీజియం చేసే సిఫార్సులపై కేంద్రం తన విచక్షణ మేరకు నిర్ణయం తీసుకుంటుంది. అయితే ఒకే పేరును కొలీజియం రెండోసారి సిఫార్సు చేస్తే కేంద్రం ఆమోదించాల్సిందేనంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం గతంలో తీర్పు వెలువరించింది.

రాజ్యాంగం ఏం చెబుతోంది?

రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 ప్రకారం సుప్రీంకోర్టు జడ్జిలను రాష్ట్రపతి నియమించాలి. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే సీజేఐ మినహా మిగతా నియామకాల్లో సీజేఐ అభిప్రాయం తెలుసుకోవాలి. ఆర్టికల్ 217 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తుల నియామకంలో సీజేఐ, గవర్నర్, హైకోర్టు సీజేలను సంప్రదించాలి.

ఏమిటీ వివాదం?

1950 నుంచి 1973 వరకూ కేంద్రం, సీజేఐ కలిసి చర్చించుకుని ఏకాభిప్రాయంతో న్యాయమూర్తులను నియమించే విధానముండేది. సుప్రీంకోర్టులో సీనియర్ మోస్ట్ న్యాయమూర్తిని సీజేఐగా నియమించడం ఆనవాయితీగా కొనసాగింది. 1973లో మాత్రం ముగ్గురు సీనియర్లను పక్కన పెట్టి జస్టిస్ ఎ.ఎన్.రేను సీజేఐగా అప్పటి ప్రభుత్వం నియమించింది. తర్వాత మరో సీజేఐ నియామకంలోనూ ఇలాగే జరగడం కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల మధ్య వివాదానికి దారితీసింది. న్యాయమూర్తుల నియామకంలో కార్యనిర్వాహక వ్యవస్థ కంటే న్యాయ వ్యవస్థకే ఎక్కువ అధికారాలుంటాయని ఫస్ట్ జడ్జెస్ కేసు (1981), సెకండ్ జడ్జెస్ కేసు (1993), థర్డ్ జడ్జెస్ కేసు (1998)ల్లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ఎలా ఏర్పాటైంది?

పార్లమెంట్ చట్టంగానీ, రాజ్యాంగ విధివిధానాలు గానీ లేకుండానే మన దేశంలో 1993లో కొలీజియం వ్యవస్థ మొదలైంది. న్యాయమూర్తుల నియామకంలో ఆర్టికల్ 124(2)లో ఉన్న 'సంప్రదింపుల అనంతరం' అర్థాన్ని 'సమ్మతించిన తర్వాత'గా మారుస్తూ తొమ్మిది మంది సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించింది. తద్వారా న్యాయమూర్తుల నియామకం, బదిలీల అధికారం సీజేఐ నేతృత్వంలోని వ్యవస్థ అయిన కొలీజియానికి దక్కింది.

ప్రత్యామ్నాయముందా?

కొలీజియంకు ప్రత్యామ్నాయంగా నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్(ఎన్‌జేఏసీ)ని కేంద్రం తెరపైకి తెచ్చింది. ఇది స్వతంత్ర కమిషన్.దీనికి సీజేఐ చైర్‌పర్సన్‌గా ఉంటారు. మరో ఇద్దరు అత్యంత సీనియర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర న్యాయ మంత్రి ఎక్స్-ఆఫీషియో సభ్యులుగా ఉంటారు. పౌర సమాజం నుంచి ఇద్దరు ప్రముఖులను సభ్యులుగా సీజేఐ, ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ నామినేట్ చేయాలి. ఈ ఇద్దరిలో కనీసం ఒకరు ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/మైనార్టీ లేదా మహిళ అయి ఉండాలి. రాజ్యాంగ (99వ సవరణ) చట్టం–2014, నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్స్‌మెంట్ కమిషన్ చట్టం (2014) ద్వారా ఎన్‌ఏజేసీని కేంద్రం ప్రతిపాదించింది. సంబంధిత బిల్లులు 2014లోనే పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందాయి. కానీ ఈ బిల్లుల రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్‌జేఏసీని కోర్టు కొట్టేసింది. అయితే న్యాయమూర్తుల ఎంపికకు కొలీజియం స్థానంలో కేంద్రం మరో వ్యవస్థను తీసుకొస్తే అభ్యంతరం లేదని ఇటీవలే స్పష్టం చేసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

కొలీజియంలో ప్రభుత్వ నామినీలు
సీజేఐకి కేంద్ర న్యాయ మంత్రి రిజిజు లేఖ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో చీఫ్ జస్టిస్‌లు, జడ్జిలను నియమించే కొలీజియం వ్యవస్థలో ప్రభుత్వం నామినేట్ చేసేవారికి సైతం చోటుండాలని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు పునరుద్ఘాటించారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు ఆయన తాజాగా లేఖ రాశారు. "జడ్జిల నియామకంలో పారదర్శకత, జవాబుదారీతనం గురించి ప్రజలకు తెలియజేయడం అవసరం. అందుకే న్యాయమూర్తుల ఎంపిక ప్రక్రియలో ప్రభుత్వ ప్రతినిధులకు చోటు కల్పించాలి" అని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. కొలీజియం వ్యవస్థ రాజ్యాంగ విరుద్ధమని కిరణ్ రిజిజు ఇటీవల విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య భారీగా పెరిగిపోవడానికి కొలీజియమే కారణమని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో సీజేఐకి ఆయన లేఖ రాయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

న్యాయ వ్యవస్థకు విషగుళిక: జైరామ్ రమేశ్

న్యాయ వ్యవస్థను పూర్తిగా ఆక్రమించుకొనేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరామ్ రమేశ్ సోమవారం ఆక్షేపించారు. న్యాయ వ్యవస్థను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. సీజేఐకి రిజిజు లేఖను తప్పు పట్టారు. మంత్రి సూచన న్యాయ వ్యవస్థకు విషగుళిక అన్నారు. అయితే కొలీజియంలో సంస్కరణలు అవసరమేనని జైరాం అభిప్రాయపడ్డారు.

సాక్షి
కరీంనగర్
మంగళవారం | 17 | జనవరి | 2023



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను సోమవారం 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సంక్రాంతి సెలవులు, పండుగ కావడంతో భక్తుల రద్దీ పెరిగింది.



ముగిసిన ఆరాధనోత్సవాలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ఆదివారం ముగిశాయి.

గరిష్టం/కనిష్టం
31.0/17.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. చలి తీవ్రత కొనసాగు తుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రయాణికుల రద్దీని పర్యవేక్షించిన ఆర్‌ఎం



విద్యానగర్(కరీంనగర్): సంక్రాంతి సందర్భంగా సోమవారం కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీని కరీంనగర్ రీజనల్ మేనేజర్ ఖుస్రో షా ఖాన్ పర్యవేక్షించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా తగినన్ని బస్సులు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. సోమవారం 100 బస్సులు, మంగళవారం మరో 100 బస్సులను నడిపించనున్నట్లు తెలిపారు. అదనపు బస్సులకు ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని పేర్కొన్నారు. అప్ అండ్ డౌన్ ప్రయాణానికి టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు తిరుగు ప్రయాణ చార్జిలో 10 శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 31 వరకు అమలులో ఉంటుందని.. www.tsrtconline.in వెబ్‌సైట్ ద్వారా ముందస్తు టికెట్లు రిజర్వు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరీంనగర్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్)చందర్ రావు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) శివశంకర్ కరీంనగర్-1, 2 డిపోల మేనేజర్లు ప్రణీత్, మల్లయ్య, సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, బస్ స్టేషన్ మేనేజర్ అంజయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర సాధనలో ఉద్యోగుల పాత్ర మరువలేనిది

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



కరీంనగర్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్ అన్నారు. తెలంగాణ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ఉద్యోగులు రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపారని ప్రశంసించారు. తెలంగాణ తరహా అభివృద్ధి దేశమంతా జరగాలని అన్నారు. దేశ అభివృద్ధి లక్ష్యంగా అడుగులేస్తున్న సీఎం కేసీఆర్‌కు ఉద్యోగులు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. 317 జీవో ద్వారా ఏర్పడిన సమస్యలు, స్పౌజ్ ఉద్యోగులకు న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ జీవీ రామక్రిష్టారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అక్బర్, ఫుడ్ కార్పొరేషన్ సభ్యులు ఆనంద్, తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో పూడిక తొలగింపు



కరీంనగర్‌రూరల్: చెర్లభూత్కూర్‌లోని డీ-89 ప్రధాన కాలువకు అనుబంధంగా ఉన్న ఎల్ ఆర్-3 కాలువలో పూడిక పేరుకపోవడంతో నీరు కిందకు పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలోని పూడికను తొలగించాలని పలు మార్లు అధికారులకు చెప్పినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదు. పొలాలకు నీరు రాకపోవడంతో పంటలను సాగు చేసుకునే పరిస్థితి లేకపోవడంతో సోమవారం రైతులు సొంత ఖర్చులతో జేసీబీని ఏర్పాటు చేసుకుని కాలువలోని పూడికను తొలగించారు. అధికారులు స్పందించి చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలని కోరుతున్నారు.

వందేభారత్‌కు మన రూట్లు రెడీ!

- సిద్ధంగా కాజీపేట- కాగజ్‌నగర్, పెద్దపల్లి- నిజామాబాద్ రూట్లు
- పూర్తిస్థాయి ఆపరేషన్లకు ఎస్‌సీఆర్ సంసిద్ధత
- కాజీపేట- సికింద్రాబాద్ సెక్షన్‌లో గరిష్ట వేగం 130 కి.మీ
- పెద్దపల్లి- కరీంనగర్ రూట్లో 100 కి.మీ
- కరీంనగర్- జగిత్యాల మార్గంలో 90 కి.మీ
- సగటున 100 కి.మీ వేగంతో వెళ్తుందంటున్న అధికారులు
- ఉమ్మడిజిల్లా రూట్లల్లో త్వరగా నడపాలంటున్న ప్రయాణికులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: దేశ రైల్వే చరిత్రలోనే అత్యంత వేగవంతమైన రైలుగా పేరొందిన 'వందే భారత్ రైలు'ను పూర్తిస్థాయిలో నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే సిద్ధమైంది. జనవరి 15వ తేదీన సికింద్రాబాద్- విశాఖపట్నం రైలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పట్టాలపైనా వందే భారత్ పరుగులు తీస్తుందా? అన్న సామాన్యుల అనుమానాలకు దక్షిణ మధ్య రైల్వే తెరదించింది. పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాలో రైల్వే లైను ఉంది. సిరిసిల్లకు రూటు ప్రగతిలో ఉంది. ఇటీవల దక్షిణ మధ్య రైల్వే అధికారులు వందే భారత్‌కు అనుగుణంగా ఈ రూట్లలో వేగాన్ని పెంచారు. పెద్దపల్లి- కరీంనగర్, కరీంనగర్- జగిత్యాల, జగిత్యాల-నిజామాబాద్ రూట్లలో ఈ రైలును నడపగలిగితే.. పొరుగున ఉన్న మహారాష్ట్రకు కేవలం మూడు నాలుగు గంటల్లోనే చేరుకునే వీలుంది. ముఖ్యంగా సిరిసిల్ల, జగిత్యాలలోని నేత, వలస కార్మికులకు ఇది ఎంతో అనువుగా ఉంటుంది.

అన్ని డివిజన్లలో..

దక్షిణ మధ్యరైల్వే పరిధిలో మొత్తం ఆరు డివిజన్లు సికింద్రాబాద్, నాందేడ్, విజయవాడ, గుంటూరు, గుంతకల్, హైదరాబాద్ ఉన్నాయి. అన్ని రూట్లలోనూ గరిష్ట వేగంతో వెళ్లేలా ఇటీవలే రైల్వేలైన్లను ఆధునీకరించారు. విభజన అనంతరం సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లు తెలంగాణలో ఉన్నాయి. వందేభారత్ రైలు గరిష్ట వేగం 160 నుంచి 180 కి.మీలతో ప్రయాణించగలదు. అందుకు అనుగుణంగా రైలు పట్టాల సామర్థ్యం పెరగాలి. దక్షిణ మధ్య రైల్వే ఇటీవల చేపట్టిన అప్‌గ్రేడేషన్ పనులతో ఇక్కడ గరిష్ట వేగం 130 కి.మీలకు చేరుకుంది. తెలంగాణలోని మూడు డివిజన్లలో వందే భారత్ రైలును నడపాల్సి వస్తే.. చాలా సెక్షన్లలో 130 కి.మీ గరిష్ట వేగంతో నడిపేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

గరిష్ట వేగం..130 కి.మీ.. కనిష్టవేగం 30.కి.మీ

ఈ రైలును మూడు డివిజన్లలోని పలు సెక్షన్లను పరిశీలిస్తే.. సామర్థ్యాన్ని బట్టి వేగం మారుతోంది. ఖాజీపేట- బల్లార్షా సెక్షన్‌లో 130 కి.మీ గరిష్ట వేగంతో దూసుకెళ్లగలదని అధికారులు తెలిపారు. అదే సమయంలో అతి తక్కువగా మల్కాజిగిరి- మౌలాలి సెక్షన్లో కేవలం 30.కి.మీ స్పీడుకే పరిమితం కావడం గమనార్హం. అయితే, వేగంపై లైన్ అప్‌గ్రేడేషన్‌తోపాటు లెవెల్ క్రాసింగ్స్, రైల్ ట్రాఫిక్ కూడా ప్రభావం చూపుతుంది.

అత్యాధునిక సౌకర్యాలు..

ఆటోమేటిక్ డోర్స్, స్మోక్ అలారం, సీసీ టీవీ కెమెరాలు, బయో వ్యాక్యూమ్ టాయ్‌లెట్స్, సెన్సార్‌తో పనిచేసే నల్లాలు, ఫుట్‌రెస్టులు వంటి ఆధునిక సదుపాయాలున్నాయి. మిగిలిన రైళ్లతో పోలిస్తే.. దీని నిర్వహణ పూర్తిగా భిన్నం. తొలి వందే భారత్ రైలు సర్వీసు 2019 ఫిబ్రవరి 15న ఢిల్లీ- వారణాసి మధ్య ప్రారంభమైంది. ప్రస్తుతానికి దేశవ్యాప్తంగా మొత్తం ఏడు సర్వీసులు నడుస్తుండగా.. సికింద్రాబాద్- విజయవాడ మధ్య సర్వీసు ప్రారంభమైతే ఆ సంఖ్య ఎనిమిదికి చేరుకుంటుంది. దేశవ్యాప్తంగా దాదాపు 20కిపైగా ప్రాంతాల నడుమ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. అందులో హైదరాబాద్- తిరుపతి, హైదరాబాద్- బెంగళూరు, హైదరాబాద్- నాగ్‌పూర్ మార్గాలు ఉండటం విశేషం.

రూటు	స్పీడు
సికింద్రాబాద్- బల్లార్షా	130 కి.మీ.
ఖాజీపేట-కొండపల్లి	130 కి.మీ.
సికింద్రాబాద్- ఖాజీపేట	130 కి.మీ.
మానిక్‌నగర్- విరూర్ (3వలైన్)	110 కి.మీ.
మందమర్రి- మంచిర్యాల కి.మీ(3వలైన్)	110 కి.మీ.
మంచిర్యాల- పెద్దంపేట (3వలైన్)	100 కి.మీ.
పెద్దంపేట- రాఘవపురం (3వ లైన్)	110 కి.మీ.
రాఘవపురం- కొలనూరు-పొత్కపల్లి (3వలైన్)	90 కి.మీ.
బిజిగిరి షరీఫ్- ఉప్పల్ (3వలైన్)	100 కి.మీ.
పెద్దపల్లి- కరీంనగర్	100 కి.మీ.
కరీంనగర్- జగిత్యాల(లింగంపేట)	90 కి.మీ.
జగిత్యాల(లింగంపేట)- నిజామాబాద్	100 కి.మీ
మేడ్చల్- మనోహరాబాద్	110 కి.మీ
మల్కాజిగిరి- మౌలాలి కార్డ్‌లైన్ సెక్షన్లలో	30 కి.మీ.

ఈ ప్రాంతానికి ఎంతో మేలు



'వందేభారత్' రైలును బల్లార్షా- కాజీపేట మార్గంలో నడపాలి. నాగ్‌పూర్- సికింద్రాబాద్ మార్గంలో వందే భారత్ రైలు ప్రస్తుతం ప్రతిపాదనలో ఉంది. ఈ మార్గంలో రైలు వస్తే.. రామగుండం లేదా మంచిర్యాలకు హాల్టింగ్ కల్పిస్తే.. కోల్‌బెల్ట్ పారిశ్రామిక ప్రాంతాలు, ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.
– కామని శ్రీనివాస్, సామాజిక కార్యకర్త

రవాణా సదుపాయాలకు పెద్దపీట



కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రవాణా సదుపాయాలకు, మౌలిక వసతులకు పెద్దపీట వేస్తుందనడానికి వందేభారత్ రైలే పెద్ద ఉదాహరణ. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ రైలు దేశంలోనే అత్యధిక వేగంతో వెళ్లడం విశేషం. భవిష్యత్తులో దేశంలోని ముఖ్యప్రాంతాలకు దీని సేవలు అందుబాటులోకి వస్తాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలకు సైతం త్వరలో దీని సేవలు అందుతాయి.
– బండి సంజయ్, కరీంనగర్ ఎంపీ



మల్లయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. పక్కన మంత్రులు తదితరులు

పది నిమిషాల్లోనే ముగిసిన సీఎం పర్యటన

- మంత్రి గంగుల కుటుంబాన్ని పరామర్శించిన కేసీఆర్
- ఆయన తండ్రికి నివాళులర్పించి వెంటనే తిరుగు ప్రయాణం
- సీఎం కోసం పోలీసుల భారీ బందోబస్తు



సీఎంకు స్వాగతం పలుకుతున్న నాయకులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్: ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు కరీంనగర్ పర్యటన కేవలం పదినిమిషాల్లోనే ముగిసింది. మంత్రి గంగుల కమలాకర్ తండ్రి గంగుల మల్లయ్య పెద్దకర్మకు వస్తారని సమాచారం ఉన్నా.. ఆదివారం అర్ధరాత్రి వరకు ఉత్కంఠ కొనసాగింది. చివరికి రాత్రి 8.00 గంటల ప్రాంతంలో సీఎం పర్యటన ఖరారైంది. ఖమ్మంలో బీఆర్‌ఎస్ భారీ బహిరంగ సభ ఉండటం, సోమవారం కనుమ పండగ కావడంతో సీఎం వస్తారా? లేదా? అన్న ఊగిసలాట కొనసాగింది. చివరకు ఖరారు కావడం.. పర్యటన ఆసాంతం కేవలం 10 నిమిషాల్లోనే ముగియడం గమనార్హం.

టైం టేబుల్ ప్రకారం..

సాధారణంగా ముఖ్యమంత్రి పర్యటనకు కొన్ని గంటల ముందు సీఎంవో నుంచి ఆయన పర్యటన షెడ్యూల్ విడుదలవుతుంది. సాధారణంగా హెలిక్యాప్టర్ ప్రయాణాన్ని ఎంచుకున్నపుడు పది, ఇరవై నిమిషాలు కాస్త అటూ ఇటుగా కార్యక్రమం మొదలవడం లేదా ముగియడం ఉంటుంది. కానీ, ఈసారి సీఎం పర్యటన అత్యంత పకడ్బందీగా.. అనుకున్న సమయం ప్రకారం సాగింది. సోమవారం ఉదయం 11.40 గంటలకు ఉజ్వల పార్కు సమీపంలోని స్పోర్ట్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో హెలిక్యాప్టర్ దిగిన సీఎం.. కేవలం ఐదు నిమిషాల్లో కొండా సత్యలక్ష్మీ గార్డెన్స్ చేరుకున్నారు. ఉదయం 11.50 గంటలకు వేదికపైకి చేరుకున్నారు. సీఎం వెంట.. మంత్రులు కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, రాజ్యసభ సభ్యులు దీవకొండ దామోదర్‌రావు, జోగినపల్లి సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, వొడితెల సతీష్‌బాబు, రసమయి బాలకిషన్, సంజయ్ కుమార్, సుంకె రవిశంకర్, కోరుకంటి చందర్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, కె.సత్యనారాయణగౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కార్పొరేషన్ల చైర్మన్లు సర్దార్ రవీందర్‌సింగ్, దామోదర్ గుప్తా, బండ శ్రీనివాస్, అనిల్ కూర్మాచలం, నగర మేయర్ సునీల్‌రావు, కలెక్టర్ కర్ణన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణ ఉన్నారు.

మంత్రిని ఓదార్చిన సీఎం..

ముఖ్యమంత్రి రాగానే.. మంత్రి గంగుల కమలాకర్, ఆయన సోదరులు పాదాభివందనం చేశారు. వారిని ఆలింగనం చేసుకొని ఓదార్చారు. అనంతరం మల్లయ్యకు సీఎం నివాళులర్పించారు. అనంతరం కాసేపు మంత్రి, ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మధ్యాహ్నం 12.05 గంటల సమయంలో వేదిక వద్దకు ప్రత్యేక బస్సు చేరుకోగానే.. 12.15 గంటలకు ప్రగతిభవన్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. కాగా.. సీఎం రాక నేపథ్యంలో సీపీ సత్యనారాయణ నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఐజీ రమేశ్ నాయుడు, రాజన్న సిరిసిల్ల ఎస్పీ రాహుల్ హెగ్డే, కరీంనగర్ అడిషనల్ సీపీ చంద్రమోహన్(అడ్మిన్), కరీంనగర్ అడిషనల్ సీపీ (లా అండ్ ఆర్డర్) శ్రీనివాస్, పెద్దపల్లి డీసీపీ రూపేష్ చెన్నూరి తదితర ఐపీఎస్ అధికారులు స్వయంగా వేదికపై సీఎంకు రక్షణ వలయంగా నిలిచారు. ఇక ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ట్రాఫిక్ సిబ్బంది, రోప్‌పార్టీలు సీఎం పర్యటన సందర్భంగా ఉజ్వల పార్కు రోడ్‌లో ట్రాఫిక్ నిలిపివేశారు.

ఈ–శ్రమ్‌పై కార్మికులకు అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

కరీంనగర్: అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు ఈ–శ్రమ్ పోర్టల్ నమోదు చేసుకొని లబ్ధిపొందేలా అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్‌లో ఈ–శ్రమ్ పోర్టల్‌లో అసంఘటిత రంగ కార్మికుల ఉచిత నమోదు, అవగాహనపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 16 నుంచి 59 ఏళ్లలోపు వ్యవసాయ, అనుబంధం, హమాలీలు తదితరులు అర్హులని, ఏడాదిపాటు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద 2 లక్షల ప్రమాద మరణ/అంగవైకల్య బీమా ఉచితంగా కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.కోటేశ్వర్లు, డీఆర్డీవో శ్రీలతారెడ్డి, డీడీ మార్కెటింగ్ అధికారి పద్మావతి, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, డీపీఓ వీరబుచ్చయ్య, జిల్లావైద్యాధికారి జువేరియా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి సబిత కుమారి, పరిశ్రమల శాఖ అధికారి నవీన్ పాల్గొన్నారు.



ముస్తాబైన ఆర్‌అండ్‌బీ అతిథి గృహం

స్మార్ట్‌సిటీలో భాగంగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని అధికారులు ప్రారంభానికి సిద్ధం చేశారు. నూతన హంగులతో అతిథి గృహాన్ని నిర్మించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ఆర్టీసీ ప్రయాణం భద్రమేనా..!

- కాలం చెల్లిన బస్సులను నడుపుతున్న వైనం
- కరీంనగర్ రీజియన్ పరిధిలో 866 బస్సులకు 186 మంది మెకానిక్‌లు

'ఆర్టీసీని దేవుడు కూడా కాపాడలేడు. బస్సులన్నీ ఖండమయ్యాయి. కొత్త బస్సులు కొనుగోలు చేస్తే తప్ప ఈ బస్సులతో ప్రయాణాలు, లాభాలు దేవుడెరుగు అని సాక్షాత్తు సీఎం కేసీఆర్.. 2019లో ఆర్టీసీ కార్మికులు సమస్యల సాధనకు 52 రోజుల పాటు నిరవధిక సమ్మె చేసిన సందర్భంలో అన్న మాటలు. మూడేళ్లు గడుస్తున్నా ఆర్టీసీ కొత్త బస్సులు కొనుగోలు చేయలేదు. అవే బస్సులతో ప్రయాణికులను చేరవేస్తున్నాయి.'



కరీంనగర్: ఆర్టీసీలో కాలంచెల్లిన బస్సులు నడుపుతుండడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ రీజియన్ పరిధిలో కరీంనగర్-1, కరీంనగర్-2, గోదావరిఖని, హుస్నాబాద్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ మొత్తం 11 డిపోలున్నాయి. వాటిలో 526 ఆర్టీసీ, 340 అద్దె మొత్తం 866 బస్సులు నడుస్తున్నాయి. వీటికి గాను కేవలం 186 మంది మెకానిక్‌లు రీజియన్ పరిధిలో పనిచేస్తున్నారు. ఈ బస్సులు రోజూ 3.50 లక్షల కి.మీటర్లు తిరిగి ప్రయాణికులను గమ్యం చేర్చుతూ రూ.1 కోటి నుంచి రూ.1కోటి 20 లక్షల వరకు రీజియన్ పరిధిలో ఆదాయాన్ని సమకూర్చిపెడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిపోలకు నాలుగేళ్లుగా కొత్త బస్సులు కేటాయించలేదు. ఉన్న బస్సులు 15 లక్షల కి.మీ పైబడి తిరిగినవే కావడంతో వాటిని నడిపేందుకు డ్రైవర్లు నిత్యం సాహసమే చేస్తున్నారని చెప్పవచ్చు. లోకల్ బస్సులతో పాటు దూరప్రాంతాలకు వెళ్లే అన్నిరకాల సర్వీసులు ప్రయాణానికి ఏ మాత్రం అనుకూలంగా లేవని, నష్టాల ఊబిలో చిక్కుకుపోయిన ఆర్టీసీని కాపాడుకోవాలని టార్గెట్లు పెట్టడమే తప్ప తమ బాగోగులు చూడటం లేదని డ్రైవర్లు, కండక్టర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీటిలో అధికంగా సూపర్ లగ్జరీ, రాజధాని, ఎక్స్‌ప్రెస్, మినీ బస్సులు ఉన్నాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కాలం చెల్లిన బస్సులను సైతం నడుపుతున్నారనే ఆరోపణలూ వెల్లువెత్తుతున్నాయి.

నాలుగు విభాగాలుగా మెకానిక్‌లు

బస్సుల మరమ్మతుకు మెకానిక్‌లను నాలుగు బృందాలుగా ఏర్పాటు చేశారు. మొదటి బృందంలో ఎక్కువ మంది మెకానిక్‌లు ఉండి ప్రతీ బస్సును నిత్యం పరిశీలిస్తారు. రెండో బృందం బస్సు ట్రిప్పునకు వెళ్లి వచ్చిన ప్రతీసారి బస్సును మొత్తం తనిఖీ చేస్తారు. మూడో బృందం ప్రతీ బస్సును వారానికోసారి ప్రత్యేకంగా పరిశీలించి గ్రీజింగ్ చేసి, ఫిల్టర్లు శుభ్రం చేస్తారు. ఇక నాలుగో బృందం నెలకోసారి బస్సుల టైర్లు, గేర్ బాక్స్‌ను పరిశీలిస్తారు. ఇంజిన్ ఆయిల్, ఫిల్టర్లను మార్చుతారు. డ్రైవర్లు సూచించిన సమస్యలను సైతం ప్రత్యేకంగా పరిష్కరిస్తారు.

ఖాళీలతో సతమతం

సాధారణంగా డిపోలో వంద బస్సులు ఉంటే 32 మంది మెకానిక్‌లు, ఒక్కో మెకానిక్‌కు ఒక సహాయకుడు ఉండాలి. కొన్నేళ్లుగా ఆర్టీసీలో కొత్త నియామకాలు చేపట్టకపోవడంతో మెకానిక్‌ల సంఖ్య తగ్గింది. కాగా బస్సుల సంఖ్య తగ్గినందున సరిపడా మెకానిక్‌లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని డిపోల్లో సిబ్బంది తక్కువగా ఉండడంతో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించారు. సహాయకులుగా అప్రెంటిస్‌లను నియమిస్తున్నా సరిపడా వేతనాలు ఇవ్వకపోవడంతో వారు పనిచేసేందుకు విముఖత చూపుతున్నారనే ఆరోపణలు మెండుగా ఉన్నాయి. తక్షణమే కొత్త బస్సుల కేటాయింపులతో పాటు సిబ్బంది నియామకంపై దృష్టిసారించాలని ఆర్టీసీ కార్మికులు యాజమాన్యాన్ని కోరుతున్నారు.

నిత్యం పర్యవేక్షించాలి

సాధారణంగా బస్సును డిపో నుంచి బయటకు తీసే సమయంలో మెకానికల్ ఇంజినీర్ పరిశీలించి సమస్యలు ఉంటే మెకానిక్‌లతో మరమ్మతు చేయించాలి. ఆ రోజు విధుల్లో చేరుతున్న డ్రైవర్ తనకు కేటాయించిన బస్సును సరిచూసుకోవాలి. అతడు ఏమైనా సమస్యలు సూచిస్తే వాటిని పరిష్కరించాలి. అనంతరం బస్సు ప్రయాణం పూర్తయిన తర్వాత డిపోలోకి వచ్చే సమయంలో డ్రైవర్లు గుర్తించిన సమస్యలను ప్రత్యేకంగా సూచిస్తారు. వీటికి రాత్రి విధుల్లో ఉండే మెకానిక్ మరమ్మతు చేపడతారు.

రీజియన్ పరిధిలోని 11 డిపోలలో మెకానిక్‌ల సంఖ్య	
గోదావరిఖని	28
హుస్నాబాద్	9
హుజూరాబాద్	17
కరీంనగర్–1 డిపో	26
కరీంనగర్– 2 డిపో	22
మంథని	13
జగిత్యాల	22
కోరుట్ల	15
మెట్‌పల్లి	10
సిరిసిల్ల	12
వేములవాడ	12

క్లుప్తంగా

24న జగిత్యాల జిల్లాకు పవన్‌కల్యాణ్

కొండగట్టు(చొప్పదండి)/ధర్మపురి: జనసేన పార్టీ అధ్యక్షుడు, సినీ నటుడు పవన్ కల్యాణ్ ఈనెల 24న జిల్లాలో పర్యటించనున్నారని ఆ పార్టీ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ తెలిపారు. ఈమేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2009లో జరిగిన ఎన్నికల ప్రచారం సందర్భంగా కొండగట్టు సమీపంలో త్రుటిలో విద్యుత్ ప్రమాదం నుంచి బయటపడ్డారని, శ్రీకొండగట్టు శ్రీఆంజనేయస్వామి కటాక్షంతోనే తనకు ప్రమాదం తప్పిందని పవన్‌కల్యాణ్ భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అదేనమ్మకంతో ఇప్పటికే ఓసారి కొండగట్టు వచ్చి శ్రీఆంజనేయస్వామిని దర్శించుకున్నారని, మరోసారి రానున్నారని పేర్కొన్నారు. ప్రతీపనిలో స్వామివారి అనుగ్రహం, ఆశీర్వాదం ఉండాలనే సంకల్పంతో తాను ప్రత్యేకంగా రూపొందించుకున్న వారాహి వాహనానికి ఇక్కడే పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు. ఆ తర్వాత ముఖ్య నాయకులతో సమావేశం అవుతారని, భవిష్యత్‌లో తెలంగాణలో పార్టీ అనుసరించే వ్యూహం గురించి చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు.. నారసింహ యాత్ర– 32 ఆలయాల సందర్శన కార్యక్రమాన్ని పవన్ కల్యాణ్ ప్రారంభిస్తారు. అందులో భాగంగా ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలోనూ పూజలు చేస్తారు. ఆ తర్వాత మిగతా నారసింహ ఆలయాలు సందర్శిస్తారని హరిప్రసాద్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జగిత్యాలక్రైం: చల్‌గల్ గ్రామంలో ఆదివారం రాత్రి కారు ఢీకొని మార్గం మహేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మహేశ్ పని నిమిత్తం బయటకు వచ్చి ఇంటికి వెళ్తుండగా కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో మహేశ్ కాలు విరిగింది. స్థానికులు అతడిని జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు.

ఆటో ఢీకొని.. యువకుడి దుర్మరణం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామశివారులో ఆదివారం రాత్రి జగిత్యాల–నిజామాబాద్ రహదారిపై జరిగిన ప్రమాదంలో బొమ్మెడి సాయి(26) మృతిచెందాడు. సాయి తన అక్కతో కలిసి ఆదివారం సినిమా కోసం జగిత్యాల వచ్చి రాత్రి ఇంటికి బయలు దేరి వెళ్తున్నాడు. చల్‌గల్ ఎక్స్‌రోడ్డు వద్ద టాటాఏస్ వాహనం అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బొమ్మెడి సాయి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మృతుడి తండ్రి సాయిరాం ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

పంతుళ్లకు తీపికబురు

- పదోన్నతులు, బదిలీలకు ముహూర్తం
- కొత్త జిల్లాల ప్రాతిపదికనే ప్రమోషన్లకు పచ్చజెండా
- రేపో, మాపో విడుదల కానున్న షెడ్యూల్

కరీంనగర్ జిల్లాలో పదోన్నతుల ఖాళీలు ఇవే...

పోస్టులు ఖాళీలు	గెజిటెడ్
హెచ్‌ఎం–2	48
స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్	21
స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్	08
స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్	24
స్కూల్ అసిస్టెంట్ సోషల్	38
స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్	15
స్కూల్ అసిస్టెంట్ తెలుగు	15
స్కూల్ అసిస్టెంట్ హిందీ	11
స్కూల్ అసిస్టెంట్ ఉర్దూ	01
స్కూల్ అసిస్టెంట్ పీడీ	05
ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం	49
మొత్తం	235



కరీంనగర్: ఏళ్లకు ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియ ఎట్టకేలకు ముందుకు కదలనుండడంతో వారిలో ఆనందం నెలకొంది. నూతన జిల్లాల ప్రకారం విద్యాశాఖ బదిలీలకు, పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పాటు రెండు,మూడు రోజుల్లో బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని ఆదివారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఉపాధ్యాయ సంఘాలు, ఉన్నతాధికారుల సమావేశంలో వెల్లడించడం ఉపాధ్యాయ వర్గానికి ఊరటనిచ్చింది. జిల్లాల పునర్విభజన తరువాత 2015లో టీచర్లకు బదిలీలతో పాటు పదోన్నతులు ఇచ్చారు. మళ్లీ 2018లో ఉపాధ్యాయులకు బదిలీలకు మాత్రమే అవకాశం కల్పించిన ప్రభుత్వం పదోన్నతుల ప్రక్రియను ఆటకెక్కించింది. దీంతో ఏడేళ్లుగా ఉపాధ్యాయులు పదోన్నతులు లేక, ఆర్థిక ప్రయోజనాలు అందక ఆయోమయ పరిస్థితిలో పడ్డారు. జిల్లాలో ఇప్పటికే ఆయా పాఠశాలల్లో ఖాళీలను గుర్తించగా.. పదోన్నతి కోసం అర్హత ఉన్న ఎస్జీటీల ధ్రువపత్రాల పరి శీలన కూడా పూర్తి చేశారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు బదిలీలు, పదోన్నతుల ప్ర క్రియ కోసం పూర్తిస్థాయి కసరత్తులో నిమగ్నమయ్యారు.

ఉపాధ్యాయ ఖాళీలు ఇవే...

ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో జిల్లాలోని 16మండలాల్లో 423 ప్రాథమిక, 77ప్రాథమికోన్నత, 151 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో 43 వేల మందికిపైగా విద్యార్థులు అభ్యసిస్తున్నారు. జిల్లాకు విద్యాశాఖలో 3174 పోస్టులు మంజూరు కాగా వాటిలో 2,689 మంది విధులు నిర్వహిస్తున్నారు. వివిధ విభాగాల్లో ఉపాధ్యాయ ఖాళీలు 485 ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు ప్రభుత్వానికి నివేదించాయి. ఇందులో ఎస్‌జీటీలు మినహా మిగతా ఖాళీలు పదోన్నతుల ద్వారానే భర్తీ ఉంటుంది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలో 70 శాతం పదోన్నతి ద్వారా 30 శాతం నూతన నియామకాల ద్వారా భర్తీ చేయాలనేది నిబంధన. ఏడేళ్లుగా పదోన్నతులు లేకపోవడంతో విద్యా వ్యవస్థలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి పదోన్నతులకు అర్హత ఉన్నాచాలా మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయడం ఫలితంగా దాని తర్వాత వచ్చే లబ్ధిని కోల్పోయారు. ఉపాధ్యాయ సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావడంతో ప్రభుత్వం ఎట్టకేలకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

జాబితా తయారు చేసే పనిలో అధికారులు

మేనేజ్‌మెంట్ల వారీగా ప్రమోషన్లు ఇచ్చేందుకు లిస్టు తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమైనట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా మొత్తం 485 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని విద్యాశాఖకు గతంలోనే ధ్రువీకరించారు. వివిధ విభాగాల్లో 235 ప్రమోషన్లు పొందేందుకు ఖాళీలు ఉన్నట్లు అధికారులు నివేదించారు. ప్యానల్ గ్రేడ్ హెచ్‌ఎం పోస్టులతో పాటు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ప్రమోషన్లు ఇస్తే కిందిస్థాయి నుంచి ఉద్యోగుల్లో ప్రమోషన్లలకు కదలిక వస్తుంది. దీంతో దాదాపు 400వరకు ప్రమోషన్లు రావచ్చని అంచనా ఉంది. ప్రతి ప్రాథమిక పాఠశాలకు హెచ్‌ఎం పోస్టు మంజూరు చేస్తామని గతంలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం అది కూడా ఆచరణ రూపం దాల్చితే విద్యాశాఖలో ప్రమోషన్ల జాతర ప్రారంభమైనట్లేనని పలువురు భావిస్తున్నారు.

పకడ్బందీగా రూపొందించాలి



జిల్లా విద్యాశాఖ అధికారులు సీనియార్టీ జాబితాలు రూపొందించడంలో పారదర్శకంగా వ్యవహరించాలి. బదిలీలు, పదోన్నతులు జరిగినప్పుడల్లా తప్పుల తడక లాంటి జాబితాలతో గందరగోళంగా తయారవుతుంది. ఏడేళ్ల తరువాత జరుగుతున్న పదోన్నతుల ప్రక్రియను సాఫీగా నిర్వహించాలి. అన్ని వెకేన్సీలను క్లియర్‌గా చూపించాలి. పదోన్నతులు కౌన్సిలింగ్ ద్వారా, బదిలీలు వెబ్‌కౌన్సిలింగ్ ద్వారా జరపాలి.

– ముస్కు తిరుపతిరెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

- రూ.80వేల నగదు బూడిద



మంటలలో కాలిపోతున్న పత్తి, పూరిగుడిసె

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని కిష్టునాయక్‌తండా పరిధి కిందితండాలో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఓ కౌలు రైతు పండించిన పత్తి దగ్ధమైంది. కిందితండాకు చెందిన కౌలురైతు బానోతు శంకు తనకున్న ఎకరంతోపాటు మరో 15 ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి సాగుచేశాడు. పూరి గుడిసెలో నివసిస్తున్న కౌలురైతు దిగుబడిగా వచ్చిన పత్తిని అదే గుడిసెలో నిలువచేశాడు. పత్తి ధర పెరుగుతుందనే ఆశతో విక్రయించలేదు. సాయంత్రం గుడిసెలో నుంచి మంటలు ఎగిసిపడుతుండడంతో చుట్టుపక్కల వారు చూసి నీళ్లు పోసి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడడంతో సిరిసిల్ల అగ్నిమాపక వాహనానికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వాహనం వచ్చేసరికి 80 శాతం పత్తి కాలిపోగా.. ఇంట్లో దాచిన రూ.80వేల నగదు కూడా కాలి బూడిదైంది. సుమారు 120 క్వింటాళ్ల పత్తి నిలువ చేయగా 85 క్వింటాళ్ల వరకు కాలిపోయింది. బాధిత రైతును జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, కృష్ణారెడ్డి పరామర్శించారు. రైతుకు తక్షణ సహాయంగా జెడ్పీటీసీ రూ.10వేలు అందించారు.

దాడులకు దారితీసిన భూ పంచాయితీ



చేతుల్లో కర్రలతో వాగ్వాదం చేసుకుంటున్న యువకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలంలోని అంకుశాపూర్, రామన్నపల్లి గ్రామాల శివారులో ఆదివారం పలువురు యువకులు కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో గాయపడ్డ వారు సిరిసిల్ల ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. మండలంలోని బద్దెనపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 224, 222లో సుమారు 2.30 ఎకరాల భూమి ఉంది. ఆ భూమి హద్దుల విషయంలో గుండెవేణి ముత్తయ్య, జడల కైలాసం, లచ్చయ్య మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ విషయంపై గతేడాది డిసెంబర్‌లో తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం ఇరువురి కుటుంబాలకు చెందిన యువకులు కర్రలు, రాడ్లతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలుకాగా సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఎవరికి ఎటువంటి ప్రాణహాని లేదు.. గుండవేణి మహేశ్ ఫిర్యాదుతో తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తల్వార్‌తో యువకుడి హంగామా



యువకుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ చౌరస్తాలో కత్తితో ఆదివారం ఓ యువకుడు హంగామా సృష్టించాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఆ యువకుడు.. ఉపాధి నిమిత్తం జగిత్యాలకు వచ్చాడు. మతిస్థిమితం కోల్పోవడంతో ఆదివారం కొత్త బస్టాండ్ చౌరస్తాలో కొబ్బరిబొండాల దుకాణం వద్ద కత్తి తీసుకుని రోడ్డుపైకి వచ్చి హల్‌చల్ చేశాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టగా మతిస్థిమితం లేదని గుర్తించారు.

చికిత్స పొందుతూ పోస్టల్ ఉద్యోగి మృతి



నారాయణస్వామి మృతదేహం

హుజూరాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ పోస్టల్ ఉద్యోగి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. కుటుంబసభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ధర్మపురి నారాయణస్వామి(53) హుజూరాబాద్ పట్టణ శివారులోని కేసీ క్యాంపు తపాలా కార్యాలయంలో అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్‌గా పని చేస్తున్నారు. పోస్టల్ ఎన్నికల కోసం ఈ నెల 8న బైక్‌పై తన సహోద్యోగి వెంకట్రాజంతో కలిసి, జమ్మికుంటకు వెళ్లారు. రాత్రి హుజూరాబాద్ వస్తుండగా తోకలపల్లి శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు హనుమకొండలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. నారాయణస్వామి అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య గీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బొల్లం రమేశ్ తెలిపారు.

మృతుడి కుటుంబానికి చేయూత..

నారాయణస్వామి మృతి వార్త తెలుసుకున్న పోస్టల్ ఉద్యోగులు సోమవారం ఆయన ఇంటికి వెళ్లారు. మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తపాలశాఖ తరఫున రూ.50 వేలు అందించారు. అంత్యక్రియల నిమిత్తం మరో రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా పోస్టల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉకంటి మహేందర్, గ్రూప్–సీ బ్రాంచి అధ్యక్షుడు ఇల్లందుల సమ్మయ్య, పోస్ట్‌మాన్ సంఘం బ్రాంచి మాజీ కార్యదర్శి తిరుపతినాయక్, ట్రెజరర్ సత్యనారాయణ, జూపాక బ్రాంచి పోస్టుమాస్టర్ కేతిరి ప్రదీప్‌కుమార్ రెడ్డి, జీడీఎస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎర్ర రాజు, కోట రఘురాం తదితరులు పాల్గొన్నారు.

రాజన్న గుడి ఆవరణలో ఆగిన ఊపిరి



సాయిలు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన భక్తుడు సాయిలు ఆలయ ఆవరణలోనే మరణించాడు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నిజాంసాగర్‌కు చెందిన సాయిలు కుటుంబ సభ్యులతో కలసి సోమవారం వేములవాడకు వచ్చాడు. రాజన్నను దర్శించుకున్న కాసేపటికే ఆలయ ఈవో ఆఫీస్ వద్ద మూర్ఛవ్యాధితో కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు, భక్తులు ప్రాథమిక చికిత్స అందించేందుకు ప్రయత్నించినప్పటికీ సమయానికి వైద్యం అందకపోవడంతో సాయిలు ప్రాణాలు కోల్పోయాడు. రాజేశ్వరపురం వసతి గదుల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక వైద్యశాలలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతోనే సాయిలు మరణించాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సమయానికి వైద్యం అందిస్తే బతికేవాడన్నారు.

మద్యానికి బానిసై ఒకరి బలవన్మరణం

మానకొండూర్: మండల కేంద్రానికి చెందిన ఊరడి శ్రీనివాస్(48) ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. భార్య స్వరూపతో నిత్యం గొడవ పడుతుండేవాడు. దీంతో ఆమె చెంజర్లలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఆదివారం మద్యం సేవించిన శ్రీనివాస్ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మద్యానికి బానిసై, తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. మృతుడికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

చెక్కపల్లిలో తల్లీకొడుకు..

వేములవాడరూరల్: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడరూరల్ మండలంలోని చెక్కపల్లి గ్రామంలో ఆ దివారం రాత్రి తల్లీకొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరి మృతితో పండుగపూట గ్రామంలో విషాదం అలుముకుంది. పోలీసులు, గ్రామస్తులు తె లిపిన వివరాలు. చెక్కపెల్లికి చెందిన కొండవేని మల్లవ్వ(51), దేవయ్య దంపతులకు ఒక కూతురు, కొడుకు కనకయ్య(33) ఉన్నారు. కొడుకు కనకయ్య భార్య వదిలిపెట్టి తల్లిగారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి కనకయ్య మనోవేదనకు గురయ్యాడు. జీవితం అంటేనే విరక్తిగా ఉంటుందని త రచూ తల్లితో అనేవాడని గ్రామస్తులు తెలిపారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి తల్లీకొడుకు ఇంట్లోనే ఉరివేసుకున్నారు. భర్త దేవయ్య పనిమీద బయటకు వెళ్లి సాయంత్రం తిరిగొచ్చి చూడగా ఇంట్లో ఇద్దరూ విగతజీవులుగా కనిపించారు. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

కులం పేరుతో దూషించిన ముగ్గురిపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): లక్ష్మీదేవిపల్లిలో కులంపేరుతో దూషించి, ఇద్దరిపై దాడి చేసిన ముగ్గురిపై సోమవారం ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ, దాడి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై మనోహర్‌రావు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కుంటాల దుబ్బయ్య రాత్రి తన కుమారుడి ఇంటికి వెళ్తుండగా అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న అదే గ్రామానికి చెందిన సంతోష్, తిరుపతి, శేఖర్.. రాత్రి పూట ఎటు వెళ్తున్నావని ప్రశ్నిస్తూనే అకారణంగా కులంపేరుతో దూషిస్తూ దాడికి దిగారు. అదే సమయంలో అక్కడే ఉన్న మరో దళిత మహిళ జమున అడ్డురాగా ఆమెను కులం పేరుతో దూషిస్తూ ఆమెపై దాడి చేశారు. దుబ్బయ్య ఫిర్యాదు మేరకు సంతోష్, తిరుపతి, శేఖర్‌పై కేసు నమోదు చేశారు.

దాడి చేసిన ఐదుగురిపై..

మల్యాల: తమ ఇంటి ముందు నుంచి దారిలేదని, నడువొద్దని చెప్పినందుకు ఐదుగురు కలిసి ఒకరిపై దాడిచేశారు. మ్యాడంపల్లిలో ఈ ఘటన చోటుచేసుకుందని ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాలు.. పిట్టల లక్ష్మి ఇంటి ఎదుట నుంచి వెళ్లేందుకు దారి లేదని పరిసరాల్లోని నందగిరి శేఖర్, మల్లేశ్, పిట్టల నివాస్, సిరవేణి గణేశ్, పిట్టల పోషవ్వకు లక్ష్మి భర్త చెప్పాడు. దీనిని మనసులో పెట్టుకుని ఈనెల 14న రాత్రి మద్యం తాగి పిట్టల లక్ష్మి ఇంటికి వచ్చి, నానా బూతులు తిట్టారు. లక్ష్మి భర్త పిట్టల రవిపై బీరుసీసాలతో దాడి చేశారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భూవివాదంలో ఘర్షణ.. ఒకరి మృతి

ధర్మారం: రచ్చపల్లి గ్రామానికి చెందిన ఇరు కుటుంబాల మధ్య ఉన్న భూ వివాదం ఒకరి ప్రాణం తీసింది. ఎస్సై అశ్విని వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జమ్మికుంట వైకుంఠం(59), జమ్మికుంట దామోదర్ ఇండ్లు పక్కపక్కన ఉంటాయి. ఇద్దరి మధ్య భూ వివాదం కొనసాగుతోంది. వైకుంఠం ఇంటికి జమ్మికుంట దామోదర్, జమ్మికుంట అహల్య, రామచంద్రం, అనిల్ వచ్చి అతడిపై దాడిచేశారు. వైకుంఠం స్పృహతప్పి పడిపోయాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కొడుకు మధుకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశ్విని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..

గోదావరిఖని: గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగానగర్‌కు చెందిన ఎండీ ఇర్ఫాన్ ఖాన్(27) అనుమానాస్పద స్థితిలో ఆది వారం ఉరివేసుకుని మృతి చెందాడు. జీడీకే–5 ప్రయివేట్ ఓబీలో వోల్వో ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఇర్ఫాన్ గత కొంత కాలంగా మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలి పారు. మృతుడి తండ్రి మహమూద్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ రెండో సీఐ ప్రసాదరావు తెలిపారు. ఉరివేసుకున్న సమయంలో చేతులు వెనక్కి కట్టేసి ఉండటం, చనిపోయిన సమయంలో వేషధారణ కూడా మారడంతో ఇర్ఫాన్ మృతిపై కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతునికి భార్య, 8నెలల బాబు ఉన్నాడు.

అనారోగ్యంతో పాత్రికేయుడు..



ఎలియా (ఫైల్)

పెగడపల్లి: మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు బొమ్మెన ఎలియా (45) ఆదివారం సాయంత్రం అనా రోగ్యంతో మృతిచెందాడు. ఆరేళ్లుగా పాత్రికేయ వృత్తిలో పనిచేస్తున్న ఎలియా కొద్ది రోజుల నుంచి గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. సర్పంచ్ మేరుగు శ్రీని వాస్, ఎంపీటీసీ జమునస్వామి నివాళులర్పించారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం



ముత్తారం: సీతంపేట గ్రామానికి చెందిన బండి శంకర్ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలింది. ఇల్లుమొత్తం దగ్ధమైంది. గ్రామస్తుల వివరాల మేరకు.. శంకర్ తన ఇంటిని మహారాష్ట్ర నుంచి వచ్చిన ఓ కూలీకి అద్దెకిచ్చాడు. అతడు పండక్కి ఇంటికి వెళ్లాడు. ఆదివారం వేకువజామున ఇంట్లో గ్యాస్ లీకేజీ అయ్యింది. సిలిండర్ పేలడంతో ఇంటి పైకప్పుతో పాటు ఇల్లుమొత్తం దగ్ధమైంది. సుమారు రూ.10లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు శంకర్ తెలిపాడు.

బైక్‌లు ఢీకొని వ్యక్తి దుర్మరణం



నర్సింగరావు(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): తక్కళ్లపెల్లి గ్రామశివారులో సోమవారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో అదే గ్రామానికి చెందిన మిర్యాల నర్సింగరావు(78) మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన నర్సింగరావు వ్యక్తిగత పని నిమిత్తం కోరుట్లకు బైక్‌పై వెళ్తున్నారు. గ్రామశివారులో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టడంతో నర్సింగరావు తీవ్రగాయాలపాలయ్యారు. చికిత్సనిమిత్తం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందారు. నర్సింగరావు గ్రామ పంచాయతీ కోఆప్షన్ సభ్యుడిగా సేవలందిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు. కాగా చిన్న కుమారుడు కృష్ణప్రసాద్ ఏడాదిన్నర క్రితం కరోనాతో మృతిచెందారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామచంద్రం తెలిపారు.

వేటగాళ్ల ఉచ్చుకు ఒకరి బలి

- పండగపూట రుద్రంగిలో విషాదం



మంగ్యానాయక్ (ఫైల్)

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి అనుబంధ గ్రామం దసరానాయక్‌తండాలో పండగపూట విషాదం నెలకొంది. అటవీ జంతువుల కోసం వేటగాళ్లు పెట్టిన విద్యుత్ తీగల ఉచ్చులకు ఓ నిండు ప్రాణం బలైంది. పోలీసులు తెలిపిన వివరాలు. దసరానాయక్‌తండాకు చెందిన గుగులోతు మంగ్యానాయక్(45) వ్యవసాయంతోపాటు మేకలు పెంచుతుంటాడు. ఆదివారం వ్యవసాయ పనులు ఉండి అతని కొడుకును మేకలు మేపేందుకు అడవికి పంపించాడు. కొన్ని మేకలు అడవిలో తప్పిపోవడంతో వాటిని వెతికేందు కు అర్ధరాత్రి అడవికి వె ళ్లాడు. అటవీ జంతువుల కోసం వేటగాళ్లు అమర్చిన విద్యుత్‌తీ గలు తగిలి మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, కూ తుళ్లు లలిత, రోజా, కుమారుడు తరుణ్ (14) ఉ న్నారు. ఇద్దరి కూతుళ్లకు పెళ్లిళ్లు అయ్యాయి. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, రుద్రంగి ఎస్సై ప్రభాకర్ సంఘటన స్థలానికి చేరుకొని శవపంచనామా చేశారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

తప్పుడు కేసు పెట్టారని యువకుడి ఆత్మహత్య



రాజు (ఫైల్)

చిగురుమామిడి(మానకొండూర్): మండలంలోని గాగిరెడ్డిపల్లికి చెందిన జెల్ల రాజు(30) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజు ఈ నెల 13న గాగిరెడ్డిపల్లికే చెందిన ఓ మహిళతో గొడవ పడ్డాడు. ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనపై తప్పుడు కేసు పెట్టారని మనస్తాపానికి గురైన అతను గత ఆదివారం అర్ధరాత్రి ఊరి చివరన చెట్టుకు ఉరేసుకున్నాడు. కాగా రాజు జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటూ అక్కడే ఓ ప్రైవేటు ఛానల్‌లో పని చేసేవాడు. తల్లి గతంలోనే చనిపోగా తండ్రి కొంరయ్య గ్రామంలోనే ఉంటున్నాడు. రాజుకు ఒక తమ్ముడు ఉన్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాస సుధాకర్ తెలిపారు.

ఒంటరితనంతో ఒకరు..



ప్రశాంత్ (ఫైల్)


తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లికి చెందిన సిలివేరి ప్రశాంత్(24) సోమవారం ఆత్మహత్యకు పా ల్పడ్డాడు. గ్రామానికి చెందిన సిలివేరి నర్సయ్యకు ముగ్గురు కొడుకులు. చిన్న కొడుకు ప్రశాంత్ ఇంటర్మీడియెట్ పూ ర్తిచేసి పనిచేస్తుండేవాడు. కొద్ది రోజుల క్రితం తలకు గాయమవడంతో పనికి వెళ్లడం లేదు. ఒంటరిగా ఉంటూ బాధపడేవాడు. ఈక్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నా డు. తన కొడుకు మృతిపై ఎలాంటి అనుమానం లేదని తండ్రి నర్సయ్య ఫిర్యాదుతో తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..



అమరేందర్ (ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. అన్నపూర్ణకాలనీలో నివాసముంటున్న రాచకొండ అమరేందర్(30) ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్నాళ్లుగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. భార్య కవిత పండుగకు పుట్టింటికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో చున్నీతో ఉరేసుకుని ఆ త్మహత్య చేసుకున్నాడు. అ మరేందర్ తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.




కరీంనగర్‌లో ఇళ్ల ఎదుట వేసిన రంగురంగుల ముగ్గులు



గాలిపటాలు ఎగురవేస్తున్న యువకులు



కమాన్‌పూర్‌లో ముగ్గు వేస్తున్న మహిళ

ఘనంగా సంక్రాంతి వేడుకలు

కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో ఆదివారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు ఇంటి ఎదుట రంగురంగులతో ముగ్గులు వేశారు. వీధులన్నీ రంగులముగ్గులతో హరివిల్లును మరపించాయి. యువకులు, చిన్నారులు పతంగులను ఎగురవేస్తూ సందడి చేశారు. పలు ఆలయాల్లో ఇంటిల్లిపాదితో పాటు హాజరై అర్చనలు జరిపించుకున్నారు. నగరంలోని రాంపూర్ ప్రాచీన గిద్దెపెరుమాళ్ల ఆలయంలో అర్చకుడు రామక శంకరశర్మ ఆధ్వర్యంలో పూజలు జరుగగా ఈఓ. మారుతి పాల్గొన్నారు. రైతులు తమ పశువులను, ఎడ్ల బండ్లను తీసుకవచ్చి అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. చామన్‌పల్లిలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. గోపాల్‌పూర్‌లో ఎడ్లబండ్లతో ఊరేగింపుగా వెళ్లి మల్లన్న ఆలయం చుట్టూ ప్రదక్షిణలు జరిపారు. సోమవారం కనుమను పురస్కరించుకుని మహిళలు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

– కరీంనగర్ కల్చరల్/కరీంనగర్‌రూరల్



గోపాల్‌పూర్‌లో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

అటెన్షన్ ప్లీజ్



కలెక్టర్ నివాసం ఎదుటే లీకేజీలు

కరీంనగర్‌లోని కలెక్టర్ నివాసం ఎదుట కొన్ని రోజులుగా మంచినీటి పైపులైన్ లీకేజీ అవుతోంది. నీరంతా రోడ్డుపై ప్రవహించడంతో ఆ రహదారి వెంట వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. లీకేజీకి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : ఇస్లావత్ సేవా, మున్సిపల్ కమిషనర్
సెల్ నంబర్ : 98499 05876

క్లుప్తంగా

యజ్ఞవరాహక్షేత్రంలో గోదా కల్యాణం



గోదాకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్: ధనుర్మాసం సందర్భంగా నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో సోమవారం గోదాయజ్ఞవరాహస్వామి కల్యాణాన్ని కన్నులపండువలా నిర్వహించారు. భక్తులు అమ్మ వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో సర్వవైదిక సంస్థానం మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కార్టూన్ పోటీల్లో ప్రతిభ



భూపతి వేసిన కార్టూన్

కరీంనగర్ కల్చరల్: తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ఇటీవల తెలుగు భాషా సంస్కృతి అంశంపై మెయిల్ మాధ్యమం ద్వారా నిర్వహించిన కార్టూన్ పోటీల్లో కరీంనగర్‌కు చెందిన కార్టూనిస్ట్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు తునికి భూపతి ప్రతిభ కనబర్చి ఉత్తమ కార్టూనిస్ట్‌గా ఎంపికయ్యారు. సోమవారం ఫలితాలు విడుదల కాగా.. తానా ప్రపంచ సాహిత్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్, తెలంగాణ కార్టూనిస్టుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజాకీరా హుస్సేన్, వేముల రాజమౌళి, సభ్యులు అభినందనలు తెలిపారు.

మొగి పురుగు నివారణపై అవగాహన



ఖాసీంపేటలో పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గన్నేరువరం: వరిలో మొగి పురుగు నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఖాసీంపేట క్లస్టర్ రైతు వేదికలో రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి వరి పంటను పరిశీలించి, అన్నదాతలకు పలు సూచనలు చేశారు. నాటు వేసి, 20 నుంచి 30 రోజుల మధ్యలో ధనుక కంపెనీ వారి మోర్టార్ మందును 150 గ్రాములు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నాటు వేసి, 15 రోజులలోపు అయితే కెల్డన్ 250 నుంచి 300 గ్రాముల పొడిని నీటిలో కలిపి, పిచికారీ చేయాలని చెప్పారు. నారుమడిలోనే మొగి పురుగును గుర్తించినట్లయితే నివారణకు క్లోరోపైరిపాస్ 50 ఈసీని 2 ఎంఎల్‌ను ఒక లీటర్ నీటిలో కలిపి, పిచికారీ చేయాలన్నారు. ఏవో కిరణ్మయి మాట్లాడుతూ.. పై మందులను స్ప్రే చేసిన రెండు రోజుల తర్వాత తప్పనిసరిగా జింక్ 250 గ్రాములను, మల్టీకే కేజీ ఎకరానికి నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, మానసాదేవి ఆలయ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్, ఏఈవో అంజలి తదితరులు పాల్గొన్నారు.

యాసంగి పంట లెక్క తేలుతోంది

- కొనసాగుతున్న క్రాప్‌బుకింగ్ ప్రక్రియ
- ఈనెల 20 వరకు ఆరుతడి పంటలకు గడువు



గోపాల్‌పూర్‌లో వరిపంట వివరాలను నమోదు చేస్తున్న ఏఈవో ప్రణయ్

కరీంనగర్‌రూరల్: యాసంగి సీజన్‌లో రైతాంగం సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయాధికారులు సేకరిస్తున్నారు. ప్రధానంగా వరిపంటతో పాటు మొక్కజొన్న, కందులు, పెసర, వేరుశెనగ తదితర ఆరుతడి పంటలను రైతులు సాగు చేస్తారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు వీలుగా వ్యవసాయశాఖ పంటల నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఏఈవోలు మోఖాపై వెళ్లి పరిశీలించి క్రాప్ బుకింగ్ యాప్‌లో నమోదు చేస్తున్నారు.

20వరకు ఆరుతడి పంటలకు అవకాశం

కరీంనగర్ మండలంలో ఈ యాసంగి సీజన్‌లో మొత్తం 13 వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తారని వ్యవసాయాధికారులు పంటల ప్రణాళికను రూపొందించారు. వరి 12,185 ఎకరాలు, మొక్కజొన్న 400, వేరుశెనగ 30, కందులు 11, పెసర 10 తదితర పంటలను సాగు చేస్తారని అంచనా వేశారు. పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ కమిషనర్ రఘునందన్‌రావు ఆదేశాల మేరకు ఏఈవోలు తమ క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో పంటల నమోదును పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో ఏఈవోలు పర్యటించి రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి క్రాప్ బుకింగ్ యాప్‌లో పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారు. ఈనెల 20 వరకు ఆరుతడి పంటలను నమోదు చేసేందుకు అవకాశముండగా ఏఈవోలు నమోదును వేగవంతం చేశారు.

వేగవంతంగా పంటల నమోదు

కరీంనగర్ మండలంలో పంటల నమోదు ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఏఈవోలు తమ క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటివరకు సేకరించిన పంటల వివరాలను క్రాప్‌బుకింగ్‌లో ఏఈవోలు నమోదు చేశారు. ఈనెల 20వరకు ఆరుతడి పంటలను నమోదు చేసేందుకు అవకాశముంది.

– బి.సత్యం, మండల వ్యవసాయాధికారి

ఆధ్యాత్మికం



అంజనాద్రిపై గోపూజలు

భగత్‌నగర్ అంజనాద్రి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో కనుమ పండుగ సందర్భంగా టీటీడీ, హిందూధర్మ ప్రచారపరిషత్ సూచన మేరకు సోమవారం గోపూజలు నిర్వహించారు. గర్రెపల్లి మహేశ్వరశర్మ గోమాత ప్రాశస్త్యంపై ప్రవచనం చేశారు. కార్యక్రమంలో చిలకపాటి హనుమంతరావు, వరాహమిహిర జ్యోతిష్యాలయ నిర్వాహకుడు, పురోహితుడు కాందూరి వెంకటేశ్వర్లు, అర్చకుడు మంగళంపల్లి రామకృష్ణశర్మ, భక్తులు పాల్గొన్నారు. – కరీంనగర్ కల్చరల్

కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- మంత్రి గంగుల కమలాకర్



పనులు పరిశీలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ సిటీ: కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి ఆ దిశగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తీగలవంతెనకు అనుబంధంగా నిర్మిస్తున్న కరీంనగర్‌లోని కాపువాడ, రాజాథియేటర్ వద్ద రోడ్లను మేయర్ సునీల్‌రావుతో కలిసి సోమవారం పరిశీలించారు. అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ రాక ముందు కరీంనగర్ అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. స్వరాష్ట్రం వచ్చాక వందల కోట్ల రూపాయల నిధులతో నగరంలో మట్టిరోడ్లు కనపడకుండా రోడ్లు అభివృద్ధి చేశామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ స్తంభాల స్థానంలో విద్యుత్ టవర్లు వేశామని, రూ.250 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నామని అన్నారు. త్వరలోనే డైనమిక్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి కేబుల్ బ్రిడ్జి ప్రారంభిస్తామని తెలిపారు. మానేరు రివర్ ఫ్రంట్ నిర్మాణంతో సౌత్ ఇండియాలో అట్రాక్టివ్ సిటీగా కరీంనగర్ మారుతోందన్నారు. రోడ్లు ఆక్రమణకు గురికాకుండా ప్రజలు, వ్యాపారులు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

నేషనల్ మైనార్టీ కమిషన్ రాష్ట్ర కమ్యూనిటీ లీడర్ ప్యానెల్ మెంబర్‌గా ముజీబ్



ఎండీ ముజీబ్

కరీంనగర్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమ్యూనిటీ లీడర్ ప్యానెల్ మెంబర్‌గా భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ముజీబ్ నియమితులయ్యారు. ఈమేరకు నేషనల్ కమిషన్ ఆఫ్ మైనారిటీస్ శాఖ సోమవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేసింది. కమ్యూనిటీ లీడర్‌గా నియమితులైన ముజీబ్ రాష్ట్ర మైనార్టీ కమ్యూనిటీ సమస్యలు, సంక్షేమం, అభివృద్ధిపై, వెల్ఫేర్ స్కీములపై రాష్ట్రంలో తగిన మార్గ దిశా నిర్దేశనం చేయడానికి కృషి చేయవచ్చని నియామకపు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, నేషనల్ మైనార్టీ కమిషన్ మెంబర్ షాహాజాదీ, బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులకు, బీజేపీ శ్రేణులకు ముజీబ్ కృతజ్ఞతలు తెలిపారు.

కలశ స్థాపన.. కంకణధారణ



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని సప్తగిరికాలనీ కోదండ రామాలయంలో మంగళవారం నుంచి ఈనెల 23 వరకు చిన్న జీయర్ స్వామి ప్రధాన శిష్యుడు, ప్రముఖ ఉభయవేదాంత పండితులు, నంబి వేణుగోపాలాచార్య కౌశిక (జగిత్యాల)తో జరుగనున్న 50వ శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచనంలో భాగంగా సోమవారం సాయంత్రం కలశస్థాపన, కంకణధారణ, అంకురార్పణ జరిగాయి. జ్యోతిష్య, వాస్తు, ఆగమ శాస్త్ర పండితుడు నమిలకొండ రమణాచార్యులు, అర్చకుడు కలకుంట్ల రామాచార్యుల బృందం ఆధ్వర్యంలో వైదిక ప్రక్రియ కొనసాగింది. కాగా ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు ప్రవచనం ఉంటుందని, నిత్యం భాగవత హోమం, గోదానం, గోపూజలు ఉంటాయని ప్రవచన నిర్వహణా బృంద బాధ్యులు తెలిపారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

ప్రజలందరూ క్షేమంగా ఉండాలి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

చొప్పదండి: కొత్త ఏడాది ప్రజలందరూ క్షేమంగా ఉండాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆకాంక్షించారు. చొప్పదండి పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో హోలీ షాలోం చర్చి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన యేసుక్రీస్తు వాగ్దాన పండుగ కార్యక్రమాన్ని ఆయన కేక్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్ థామస్ దైవజనులకు శాంతి సందేశం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన చైర్మన్ కప్ క్రికెట్ పోటీలు



క్రికెట్ టోర్నీ విన్నర్, రన్నరప్ జట్లతో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు

కొత్తపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో చైర్మన్ రుద్ర రాజు ఆధ్వర్యంలో రెండురోజులుగా నిర్వహించిన చైర్మన్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. పది జట్లు తలపడ్డ ఈ టోర్నీలో విన్నర్స్ కప్‌ను మెరుపు టీం, రన్నర్స్ కప్‌ను సుమన్ టీం గెలుచుకోగా బహుమతులను మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు అందజేశారు. టోర్నీ ఆర్గనైజర్ ఎండీ యాకూబ్ అలీ, ఎండీ మదర్‌ఖాన్, ఎండీ ఖదీర్‌బాబా, క్రీడాకారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీసుస్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: మంత్రి గంగుల కమలాకర్ తండ్రి పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం కేసీఆర్ కరీంనగర్ వస్తున్న సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రిని అడ్డుకోవాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదని, మమ్ములను అక్రమంగా అరెస్ట్ చేసి సీఎం కేసీఆర్ వెళ్లేంత వరకు స్టేషన్‌లో ఉంచారని అన్నారు, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రశ్నిస్తారనే భావనతో ఈ విధమైన అరెస్టులకు పాల్పడుతున్నారని అన్నారు. అరెస్టయిన వారిలో గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, కుర్ర పోచయ్య, దండి రవీందర్, ముక్క భాస్కర్, ఎండీ చాంద్, నదీం, షేహెన్షా, కీర్తి కుమార్, ఇమామ్, భారీ, జాఫర్, సిరాజొద్దిన్, కమల్ తదితరులు ఉన్నారు.


గంగాధర: సీఎం కేసీఆర్ సోమవారం కరీంనగర్ వచ్చిన సందర్భంగా గంగాధర మండలంలోని బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టుగా చేసి, ఠాణాకు తరలించారు. అరెస్టయిన వారిలో పెరుక శ్రావణ్‌కుమార్, కోల అశోక్, రామిడి రాజిరెడ్డి, నల్లాల రాజేందర్ తదితరులున్నారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3 గంటల వరకు 11 కేవీ సీతారాంపూర్ ఫీడర్ పరిధిలోని రేకుర్తి ప్రధాన రహదారి, సీతారాంపూర్ ప్రాంతాలు, 11కేవీ దుర్శేడ్ ఫీడర్ పరిధిలోని గుంటూర్‌పల్లి, దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాల్లో విద్యుత్ అభివృద్ధి పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్‌రూరల్ ఏడీఈ రాజు తెలిపారు. అదేవిధంగా ప్రత్యామ్నాయ 33 కేవీ లైన్‌ల పనులు జరుగుతున్నందున ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు 33/11 కేవీ చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీసీరోడ్డు నిర్మించాలి



కాలనీవాసుల అర్ధనగ్న ప్రదర్శన

రామడుగు: తమ కాలనీకి సీసీరోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేట ఎస్సీ కాలనీవాసులు సోమవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే రోడ్డు నిర్మించాలని కోరారు.

సమాచారం

20న అంజన్న ఆలయంలో వేలం

కరీంనగర్ కల్చరల్: నగరంలోని గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 20న మధ్యాహ్నం టెంకాయలు, పూజసామగ్రి అమ్మకం, సౌండ్‌సిస్టమ్, డెకొరేషన్ నిర్వహకు టెండర్‌–బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో ఉడుతల వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులు 19వ తేదీలోపు ఆలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు ఆలయాల హుండీల లెక్కింపు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని శ్రీవేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయాల హుండీలను బుధవారం ఉదయం 11 గంటలకు లెక్కించనున్నట్లు ఈవో కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బంది విధిగా హాజరు కావాలని, ఔత్సాహిక భక్తులు కూడా పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

అరెస్టు అప్రజాస్వామికం

రామడుగు: సీఎం కేసీఆర్ కరీంనగర్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం సరికాదని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాజమల్లయ్య ఒక ప్రకటనలో అన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

నగరంలోని సప్తగిరికాలనీలో గల టెలిఫోన్ క్వార్టర్స్ ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై ఈనెల 5న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు అధికారులకు, సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్





ప్రమాదానికి ముందు కోట్‌పల్లి చెరువులో ఆడుకుంటున్న కుటుంబ సభ్యులు

విషాదం మిగిల్చిన ఈత సరదా

- కోట్‌పల్లి ప్రాజెక్టులో మునిగి నలుగురి మృతి
- వికారాబాద్ జిల్లా ధారూర్‌లో ఘటన

ధారూరు: ఈత సరదా విషాదంగా మారింది. నలుగురు వ్యక్తులు నీటమునిగి ప్రాణాలు కోల్పోయారు. పండుగ వేళ విషాదం నింపిన ఈ ఘటన సోమవారం వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం కోట్‌పల్లిలో చోటుచేసుకుంది. సీఐ అప్పయ్య కథనం ప్రకారం.. పూడూర్ మండలం మన్నెగూడకు చెందిన బాయికని పెంటయ్య కుమారులు లోకేశ్ (28), వెంకటేశ్(25), వీరి బాబాయి బుచ్చయ్య కొడుకు జగదీశ్(24), మేనత్త కొడుకు రాజేశ్ (24).. తమ కుటుంబ సభ్యులైన మరో 9 మందితో కలసి కోట్‌పల్లి ప్రాజెక్టుకు వచ్చారు. అక్కడి పరిసరాలను, అడవి అందాలను వీక్షించారు. అనంతరం సేదతీరేందుకు నీటి ఒడ్డుకు చేరుకున్నారు. అందరూ సరదాగా మాట్లాడుకుంటూ కాలక్షేపం చేస్తున్న సమయంలో ఈత వచ్చిన లోకేశ్, జగదీశ్ నీటిలోకి దిగారు. వీరిని చూసి వెంకటేశ్, రాజేశ్ కూడా నడుములోతు వరకు వెళ్లి నీటిలో ఆడుకోవడం ప్రారంభించారు. కాగా, లోకేశ్, జగదీశ్ జలాశయంలో కొద్ది దూరంలో ఉన్న బండరాయి వద్దకు వెళ్లి వెనుదిరుగుతున్న సమయంలో ఈతరాని వెంకటేశ్, రాజేశ్‌లు వీరికి ఎదు రుగా వెళ్లేందుకు ప్రయత్నించి నీటిలో మునిగారు. వీరిని కాపాడేందుకు లోకేశ్, జగదీశ్‌లు ఒక్కొక్కరిని పట్టుకున్నారు. అయితే ఆందోళనకు గురైన వెంకటేశ్, రాజేశ్ వారిని గట్టిగా పట్టుకుని ఈత కొట్టే వీలులేకుండా చేశారు. దీంతో నలుగురూ నీటిలో మునిగిపోయారు. దీంతో ఒడ్డున ఉన్న ఇతర కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని గమనించి గట్టిగా కేకలు వేయడంతో కొద్ది దూరంలో ఉన్న బోటింగ్ సిబ్బంది అక్కడికి చేరుకుని నీటిలో మునిగిన వారి కోసం గాలించారు. అయితే అప్పటికే వారు మరణించడంతో మృతదేహాలను బయటకు తీశారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను వికారాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. బుచ్చయ్య కొడుకు జగదీశ్ స్వగ్రామంలోనే వ్యవసాయం చేస్తున్నాడు. లోకేశ్ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. వెంకటేశ్, రాజేశ్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. లోకేశ్, వెంకటేశ్, రాజేశ్ తమ కుటుంబాలతో హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. సంక్రాంతి పండుగ కోసం వీరంతా సొంతూరు మన్నెగూడకు వచ్చారు.

టీచర్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ | పదోన్నతులకూ ఓకే

సంక్రాంతి వేళ సర్కారీ ఉపాధ్యాయులకు ప్రభుత్వం తీపి కబురు

- రెండు రోజుల్లో షెడ్యూల్
- ఏప్రిల్ తర్వాతే జాయినింగ్
- మంత్రి సబిత ప్రకటన
- టీచర్ల సంఘాల్లో ఆనందం



సాక్షి, హైదరాబాద్: పదోన్నతులు, బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మంగళ, బుధవారాల్లో ఇందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదలవుతుందని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆశిస్తున్నారు. విధి విధానాలు ఎలా ఉంటాయని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మంత్రులు హరీశ్‌రావు, సబిత ఇంద్రారెడ్డి ఆదివారం ఆయా సంఘాల నేతలతో సమాలోచనలు జరిపారు. అనంతరం బదిలీలు, పదోన్నతులకు సీఎం కేసీఆర్ అంగీకారం తెలిపారని, త్వరలోనే షెడ్యూల్ విడుదల చేస్తామని సబిత తెలిపారు. కస్తూరీ బా గాంధీ బాలికల విద్యాలయంలో కూడా ఇది అమలవుతుందని ఆమె చెప్పారు. సంక్రాంతి కానుకగా ఈ శుభవార్త చెబుతున్నట్టు ఆమె పేర్కొన్నారు. టెన్త్ పరీక్షల షెడ్యూల్ ప్రకటించడం... ఇతర తరగతుల పరీక్షలు త్వరలో జరుగుతున్న కారణంగా ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు ప్రకటించినా, ఏప్రిల్ తర్వాతే వీటిని అమలు చేస్తామని తెలిపారు. అయితే ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియను ఫిబ్రవరి రెండో వారం కల్లా పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

ప్రమోషన్లు ఎంతమందికి?

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 1.05 లక్షల మంది ఉపాధ్యాయులున్నారు. వీటిల్లో 18 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. కానీ ప్రభుత్వం మాత్రం 12 వేల పోస్టులే ఖాళీగా ఉన్నాయని అసెంబ్లీలో తెలిపింది. 317 జీవో అమలు తర్వాత దీనిపై స్పష్టమైన లెక్కలు తీయాల్సి ఉంది. ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 7111 ఖాళీలున్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)లకు పదోన్నతులు కల్పించడం ద్వారా 70 శాతం ఖాళీలు భర్తీ చేస్తారు. మిగిలిన 30 శాతం డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తారు. ఈ క్రమంలో 5 వేల మంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్స్‌గా పదోన్నతి లభిస్తుంది. ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయ పోస్టులు 2084 ఖాళీలున్నాయి. వీటిని ఎస్జీటీల ద్వారా భర్తీ చేస్తారు. ఉన్నత పాఠశాలల్లో 1948 పోస్టులు ఖాళీ ఉన్నాయి. వీటిని ప్రస్తుతం ఉన్న స్కూల్ అసిస్టెంట్స్ ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. ఇలా మొత్తం 9 వేల మందికిపై ఉపాధ్యాయులకు ప్రమోషన్లు లభిస్తాయి.

కోర్టు వివాదాల తర్వాతే ఎంఈవోలు, డిప్యూటీ డీఈవోల భర్తీ

మండల విద్యాశాఖాధికారులు, డిప్యూటీ జిల్లా విద్యాశాఖాధికారులు, భాషా పండితుల అప్‌గ్రేడ్ వ్యవహారం చేపట్టేందుకు ప్రభుత్వం సాహసించడం లేదు. రాష్ట్రంలో 443 ఎంఈవో పోస్టులున్నాయి. కానీ ఇప్పుడు పనిచేస్తున్న ఎంఈవోలు 21 మంది మాత్రమే. డిప్యూటీ డీఈవో పోస్టులు 78 ఉంటే 18 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఎంఈవో పోస్టులను నేరుగా ఎంపికైన ప్రభుత్వ హెచ్ఎంల ద్వారానే భర్తీ చేయాలని ప్రభుత్వ టీచర్లు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక సంస్థల పాఠశాలలకూ ఈ అవకాశం ఇవ్వాలని మరికొన్ని సంఘాలు పట్టుబడుతున్నాయి. ప్రస్తుతం వివాదం కోర్టు పరిధిలో ఉంది. భాషా పండితుల విషయం కూడా న్యాయస్థానంలో ఉంది. ఈ కారణంగా కోర్టు వివాదం ముగిసిన తర్వాతే ఈ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఎన్నికల కోసమేనా?

హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. మార్చిలో ఈ ఎన్నిక జరిగే వీలుంది. మరోవైపు సాధారణ ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే 317 జీవో కారణంగా ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. 2015లో ప్రమోషన్లు, బదిలీలు చేపట్టారు. 2017లో మరోసారి బదిలీలు మాత్రమే జరిగాయి. అప్పట్నుంచి బదిలీలు, పదోన్నతులు లేవు. ఈ ప్రభావం ఎమ్మెల్సీ, సాధారణ ఎన్నికలపై ఉంటుందని ప్రభుత్వం సందేహిస్తోందని, అందుకే హడావుడిగా ఉపాధ్యాయవర్గాలను ఆకర్షించేందుకు ప్రకటన చేశారని కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. 317 జీవో కారణంగా జరిగిన బదిలీల్లో 13 జిల్లాల్లో స్పౌజ్ కేసులను పరిష్కరించలేదని, ఇప్పుడు బదిలీలు ఎలా చేపడతారని మరికొంతమంది అంటున్నారు.

ఖాళీలన్నీ భర్తీ చేయాలి

బదిలీలు, పదోన్నతులు ఇవ్వాలనే నిర్ణయం మంచిదే. దీంతో పాటు స్కూళ్ళలో అన్ని స్థాయి ల్లో ఖాళీలు భర్తీ చేయాలి.. అప్పుడే విద్యా వ్యవస్థలో మార్పు సాధ్యం. ఎంఈవో, డిప్యూటీ డీఈవో వంటి పర్యవేక్షక పోస్టులను విస్మరించకూడదు.

– పి రాజభాను చంద్ర ప్రకాశ్, తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెచ్ఎంల సంఘం అధ్యక్షుడు

మంచి నిర్ణయం

ఉపాధ్యాయ సంఘాలకు ఈ తరహా తీపి కబురు ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఈ ప్రక్రియ పూర్తి చేయాలనే నిర్ణయం సమర్థనీయం.

– బీరెల్లి కమలాకర్, పింగిలి శ్రీపాల్ రెడ్డి (పీఆర్‌టీయూటీఎస్ నేతలు)

తీరు మార్చుకోకపోతే మూల్యం చెల్లిస్తారు

వైద్యులు, మెడికల్ షాపుల యజమానులను హెచ్చరించిన మావోయిస్టులు

చర్ల: భద్రాచలంతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రా ప్రాంతాల్లోని గిరిజన, గిరిజనేతర పేదల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, ల్యాబ్‌లు, మెడికల్ షాపుల యజమానులు ఇకనైనా తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో మూల్యం చెల్లించక తప్పదని మావోయిస్టు పార్టీ హెచ్చరించింది. ఈ మేరకు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం - అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ సోమవారం లేఖ విడుదల చేశారు. భద్రాచలంలోని ఆస్పత్రులు మాఫియాకు అడ్డాగా మారగా, గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని సంపాదనే ధ్యేయంగా వైద్యులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని బూచిగా చూపి వైద్యం పేరుతో రోజుల తరబడి ఆస్పత్రుల్లో ఉంచి అవసరం లేకున్నా రకరకాల పరీక్షలు, చికిత్స చేస్తూ డబ్బు కోసం హింసిస్తున్నారని ఆరోపించారు. ఇంకోపక్క భద్రాచలం ప్రభుత్వ వైద్యశాల వైద్యులు సైతం సొంత క్లినిక్‌లకే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తూ పేదలను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. ఇకనైనా వైద్యులు, ల్యాబ్‌లు, మెడికల్ షాపుల యజమానులు పద్ధతి మార్చుకోవాలని ఆజాద్ లేఖలో హెచ్చరించారు.

కాపాడేవాడే కడతేర్చాడు

- భార్య, కుమార్తె, తల్లిని చంపి.. తాను ఆత్మహత్య
- హైదరాబాద్‌లోని తార్నాకలో ఓ ప్రైవేట్ ఉద్యోగి ఘాతుకం
- చెన్నై వెళ్లేందుకు కుటుంబం నిరాకరించడంతో దారుణం



భార్య సింధూరతో ప్రతాప్



చిన్నారి ఆద్య

సాక్షి, హైదరాబాద్/ఉస్మానియా యూనివర్సిటీ: నగరంలోని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో ఘోరం జరిగింది. తనతో చెన్నై రావడానికి నిరాకరించిన భార్యతో పాటు కుమార్తెను, కన్నతల్లిని చంపేశాడు. ఆపై తాను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు ఓ ప్రైవేట్ ఉద్యోగి. సోమవారం మధ్యాహ్నం ఈ విషాద ఉదంతం వెలుగులోకి వచ్చింది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు.. చెన్నైకి చెందిన ప్రతాప్ (34) అక్కడి ఓ కార్ల కంపెనీలో డిజైన్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఈయనకు దాదాపు ఎనిమిదేళ్ల క్రితం తార్నాక ప్రాంతానికి చెందిన సింధూర (32)తో వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఆద్య ఉంది. సింధూరకు రెండు నెలల క్రితం హిమాయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది. దీంతో ఆమెతో పాటు ఆద్య, ప్రతాప్ తల్లి రాజతి నగరానికి వచ్చారు. తార్నాకలోని రూపాలీ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్నారు. చెన్నైలోనే ఉద్యోగం చేస్తున్న ప్రతాప్ వారాంతాల్లో ఇక్కడికి వచ్చి వెళ్తుండేవాడు. చెన్నై వెళదామనే విషయంపై కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి.

బెడ్రూంల్లో నిద్రిస్తుండగా..

చెన్నైలో స్థిరపడటానికి ఉద్యోగం వదిలి రావాలంటూ భార్య సింధూరపై ప్రతాప్ ఒత్తిడి తెస్తున్నాడు. దీనికి ఆమె అంగీకరించడంపోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదాలు, గొడవలు జరుగుతున్నాయి. సంక్రాంతి పండుగ వీకెండ్‌లో రావడంతో శుక్రవారం ప్రతాప్ నగరానికి వచ్చాడు. చెన్నై వెళ్లే విషయమై రెండు రోజులుగా వీరి మధ్య గొడవలు జరిగి ఆదివారం రాత్రి తారస్థాయికి చేరింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన ప్రతాప్.. కుటుంబాన్ని హతమార్చి తానూ తనువు చాలించాలని నిర్ణయించుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున ప్రధాన బెడ్రూంలో నిద్రిస్తున్న భార్య, కుమార్తెను, కొద్దిసేపటి తర్వాత పక్కనే మరో బెడ్రూంలో పడుకుని ఉన్న తల్లినీ చంపివేశాడు. హాల్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

సింధూర సహోద్యోగులు ఫోన్ చేయడంతో..

సింధూర సోమవారం విధులకు హాజరుకావాల్సి ఉంది. ఆమె బ్యాంక్‌కు రాకపోవడంతో ఆరా తీసేందుకు సహోద్యోగులు ఫోన్ చేశారు. సింధూర నుంచి స్పందన రాకపోవడంతో మధ్యాహ్నం వరకు ప్రయత్నించారు. చివరకు మధ్యాహ్నం 2 గంటల సమయంలో సింధూర అపార్ట్‌మెంట్‌కు వచ్చారు. ఎంత పిలిచినా లోపల నుంచి స్పందన లేకపోవడంతో పక్కన అపార్ట్‌మెంట్‌లో నివసించే సింధూర తల్లి జమునను తీసుకువచ్చారు. వీరికి ఫ్లాట్‌లోకి హాల్‌లో ఫ్యాన్‌కు వేలాడుతున్న ప్రతాప్ మృతదేహం కనిపించింది. బెడ్స్‌పై ఉన్న సింధూర, ఆద్యలను పరిశీలించారు. సింధూర కొన ఊపిరితో ఉండటంతో సమీపంలోని ఓ ఆసుపత్రికి తరలించి డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. చికిత్స ప్రారంభించడానికి ముందే ఆమె తుది శ్వాస విడిచింది. నలుగురి మృతదేహాలను పోస్టుమార్టం పరీక్షల నిమిత్తం మార్చురీకి తరలించారు. సింధూర తల్లి జమున ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంత ఘోరం జరుగుతుందనుకోలేదు: సింధూర తల్లి జమున



'ప్రతాప్ మాకు దగ్గరి బంధువు హైదరాబాద్ నుంచి చెన్నై షిఫ్ట్ కావాలనే విషయంపై భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నాయి. కానీ.. ఇంత ఘోరం జరుగుతుందని ఊహించలేదు' అని జమున మీడియాతో అన్నారు. రాజతి మెడపై ఉన్న గుర్తుల్ని బట్టి ఉరి బిగించి లేదా గొంతు నులిమి చంపినట్లు పోలీసులు భావిస్తున్నారు. సింధూర, ఆద్యల మృతికి కారణాన్ని స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. పోస్టుమార్టం పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక నివేదిక వచ్చిన తర్వాతే దీనిపై స్పష్టత వస్తుందని ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్ నాయక్ తెలిపారు. ఈ కేసును అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సింధూర కోసం వాళ్ల ఆఫీస్ వారు వచ్చి చూసేదాకా ఇంతటి ఘోరం జరిగిందని నాకు తెలియదు. ఆమె ఫోన్ ఎత్తట్లేదు అని ప్రతాప్ కూడా స్పందించట్లేదని కంగారు పడుతూ వచ్చి చెప్పారు. ఎంత కొట్టినా తలుపులు కూడా తీయట్లేదని ఆందోళన చెందారు. అప్పుడు వచ్చి చూస్తే ఈ ఘోరం కనిపించింది. మేం పక్క అపార్ట్‌మెంట్లో ఉంటాం. ఏదైనా ఇబ్బంది అనిపిస్తే మా దగ్గరికి వస్తే సరిపోయేది కదా. ఇంత ఘోరం జరిగి ఉండేది కాదు కదా.

సిర్పూర్ గడ్డపై నీలిజెండా ఎగురవేస్తాం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్
- కాగజ్‌నగర్‌లో భారీ బహిరంగ సభ



ర్యాలీలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ గడ్డపై నీలిజెండా ఎగురవేస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రెండో విడత పాదయాత్రలో భాగంగా కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పాలకులు బహుజనులను భయభ్రాంతులకు గురిచేస్తూ అణగదొక్కుతున్నారని ఆరోపించారు. సిర్పూర్ నియోజకవర్గానికి మంజూరైన అభివృద్ధి పనులన్నీ ఆంధ్రా ప్రాంత కాంట్రాక్టులకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. సిర్పూర్ పేపర్ మిల్లులో స్థానిక కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. కాలుష్యం స్థానికులకు ఇస్తూ లాభాలను మాత్రం కంపెనీ, పాలకులు పంచుకుంటున్నారన్నారు. జీవో నంబర్ 317తో కుమురంభీం జిల్లా యువత తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఎనిమిదేళ్లుగా బీసీలకు కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. విద్యార్థులకు కనీసం రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ హయాంలో బిల్లులు రాక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విమర్శించారు. విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్, రైతుల పంటలకు మద్దతు రావాలన్నా, కౌలు రైతులకు న్యాయం జరగాలన్నా బహుజనుల రాజ్యం రావాల్సి ఉందని స్పష్టం చేశారు. బీజేపీ నాయకులు కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారని, వారిని ప్రజలు క్షమించరన్నారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు మొర్లె గణపతి, నియోజకవర్గ కార్యదర్శి దుర్గం ప్రవీణ్, నియోజకవర్గ అధ్యక్షుడు రాంప్రసాద్, నాయకులు జ్యోతి, నవీన్ పాల్గొన్నారు.

జంగీ జాతర ప్రారంభం



కొరంగే వంశీయుల ప్రత్యేక అభిషేక పూజలు

బేల: మండలంలోని సదల్‌పూర్ గ్రామ శివారులో గల బైరందేవ్, మహాదేవ్ ఆలయాల ఆవరణలో జంగీ జాతర సోమవారం ప్రారంభమైంది. కొరంగే వంశీయులు సంప్రదాయ పూజల అనంతరం జంగోలింగో దీక్షలు చేపట్టారు. చంపెల్లి గ్రామపటేల్ సోనేరావు దంపతులు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు జాతరను ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి కుషాల్‌రావు, కార్యదర్శి రాందాస్, మాజీ ఎంపీపీ కుందతాయి, ఎంపీటీసీ అరుణ్, సర్పంచ్‌లు జంగ్‌షా, శంకర్ పాల్గొన్నారు.



పెన్‌గంగా తీరంలో పూజలు చేస్తున్న జంగుబాయి దీక్షాపరులు

జంగుబాయి దీక్షల విరమణ

తాంసి: జంగుబాయి దీక్ష చేపట్టిన జిల్లాకు చెందిన పలువురు సోమవారం భీంపూర్ మండలంలోని పెన్‌గంగా తీరంలో దీక్ష విరమించారు. ఏటా పుష్య మాసంలో జంగుబాయి ఆలయంలో దీక్షలు స్వీకరించి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తుంటారు. దీక్ష గడువు ముగియడంతో సోమవారం పెన్‌గంగకు చేరుకున్నారు. నదిలో పుణ్యస్నానాలు ఆచరించి యశ్వంత్ మహారాజ్ ఆధ్వర్యంలో పూజలు చేసి దీక్షలు విరమించారు. భీంపూర్ సర్పంచ్ లింబాజీ, దీక్షాపరులు పాల్గొన్నారు.




అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పోటెత్తిన భక్తజనం

జైనథ్: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని పూసాయి ఎల్లమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఆదివారం వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా నిర్మల్, నిజామాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గర్భగుడి నుంచి వచ్చే జలధారతో నిండిన కోనేరులో స్నానాలు చేస్తే చర్మ ఇతర వ్యాధులు నయం అవుతాయని భక్తుల విశ్వాసం. అనంతరం అక్కడే భోజనాలు చేశారు. నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పండ్ల తోటలకు రాయితీలు

- అరటి, జామ, మామిడి, సీతాఫలం సాగుకు అవకాశం
- లక్ష్యం మేరకు రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



సాగు చేస్తున్న అరటి తోట

జగిత్యాలఅగ్రికల్చర్: ఈసారి అన్నదాతలు వరి, మొక్కజొన్న వంటి సాధారణ పంటలతోపాటు అరటి, జామ వంటి పండ్లతోటలూ సాగు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటిదాకా తమకు నచ్చిన పండ్లమొక్కలను ప్రైవేట్ నర్సరీల నుంచి కొనుగోలు చేసేవారు. నిర్వాహకులు ఎంత ధర చెబితే అంత చెల్లించేవారు. అయితే, 2022–23లో రాష్ట్రీయ ఉద్యాన మిషన్ పథకం ద్వారా కొత్తగా పండ్లతోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీ ప్రకటించింది.

రాయితీలు ఇలా..

- టిష్యూకల్చర్ అరటి, బొప్పాయి, మామిడి, సీతాఫలం, జామ, ఆయిల్‌పామ్ తోటల తోపాటు, కూరగాయల్లో కలుపు మొక్కల నియంత్రణకు మల్చింగ్ వంటి వాటికి ఉద్యానశాఖ రాయితీలు ఇస్తుంది.
- ఒక హెక్టారు(సుమారు రెండున్నర ఎకరాలు)కు.. టిష్యూకల్చర్ అరటి సాగుకు రూ.30,739, బొప్పాయికి రూ.22,500, మామిడికి రూ.9,840, జామకు రూ.17,600, సీతాఫలానికి రూ.25,400, ప్లాస్టిక్ మల్చింగ్‌కు రూ.16 వేలు రాయితీ వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

లక్ష్యం మేరకు దరఖాస్తుల స్వీకరణ..

పండ్లతోటలకు రాయితీ కల్పించేందుకు రాష్ట్ర ఉద్యానశాఖ లక్ష్యం నిర్దేశించింది. రైతుల నుంచి అవసరం మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇప్పటికే బొప్పాయి సాగు లక్ష్యం 7 హెక్టార్లు కాగా, ఆ మేరకు దరఖాస్తులు వచ్చాయి. ఎక్కువగా వస్తే, ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే నూతన ఆర్థిక సంవత్సరంలో రాయితీలు ఇస్తారు. అరటికి జగిత్యాల జిల్లా టార్గెట్ 20 హెక్టార్లు కాగా, 10 హెక్టార్ల వరకు పూర్తయ్యింది. మామిడి 11 హెక్టార్ల లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 5 హెక్టార్ల వరకు దరఖాస్తులు వచ్చాయి. జామ లక్ష్యం 7.60 హెక్టార్లు కాగా, 4 హెక్టార్ల వరకు లక్ష్యం సాధించారు. సీతాఫలం 2.50 హెక్టార్లు కాగా, ఆ మేరకు దరఖాస్తులు అందాయి. ఎంపిక ప్రక్రియ కొనసాగుతున్నది. ప్లాస్టిక్ మల్చింగ్ 10 హెక్టార్లు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 4 హెక్టార్ల వరకు అందించారు. ఎక్కువ మందికి ఈ పథకాలను వర్తింపజేసేందుకు ఒక్కో రైతుకు ఒక హెక్టారు వరకే రాయితీ ఇవ్వనున్నారు.

ఆయిల్‌పామ్‌కు ప్రత్యేక రాయితీ..

- జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఇతర పండ్ల తోటలతో పోల్చితే ఉద్యానశాఖ ప్రత్యేక సబ్సిడీ వర్తింపజేస్తుంది.
- ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు 90శాతం రాయితీపై మొక్కలు ఇస్తారు.
- నాలుగేళ్లపాటు తోట నిర్వహణ కోసం ఎకరాకి రూ.4,200 చెల్లిస్తారు.
- దీనికితోడు, డ్రిప్‌ను 90 శాతం రాయితీపై అందజేస్తున్నారు.
- జిల్లాలోని గొల్లపల్లి మండలం అబ్బాపూర్ నర్సరీలో పెంచిన ఆయిల్‌పామ్ మొక్కల సామర్థ్యాన్ని బట్టి ఫిబ్రవరిలో 4,300 ఎకరాల్లో నాటనున్నారు.
- ఇంకా, వచ్చే దరఖాస్తులను బట్టి జూన్, జూలైలో నాటేలా ఉద్యానశాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

ఏప్రిల్ నుంచి నాటిన తోటలకే..

వచ్చే ఏప్రిల్ నుంచి నాటిన తోటలకే ప్రభుత్వం రాయితీ ఇవ్వనుంది. టిష్యూకల్చర్ అరటి మొక్కలను ఉద్యానశాఖ ధ్రువీకరించిన ప్రైవేట్ కంపెనీల నంచే కొనుగోలు చేయాలి. పండ్ల తోటల్లో మొక్కలు నాటడంలోనూ ఉద్యాన శాఖ నిబంధనలు పాటించాలి. అధికారులతో కలిసి రాయితీ పొందే రైతులు తోటల వద్ద ఫొటోలు దిగాలి.

లక్ష్యం మేరకు ఎంపిక



ఉద్యానశాఖ ద్వారా రాయితీపై పండ్లతోటల్లో మొక్కలు నాటేందుకు లక్ష్యం నిర్ణయించారు. ఆ మేరకు ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న వారికి రాయితీ వర్తింపజేశాం. ఇంకా దరఖాస్తు చేసుకుంటే లక్ష్యం మేరకు ఎంపిక చేసి సబ్సిడీ ఇస్తాం. ఈ ఏడాది కొత్తగా నాటిన పండ్లతోటలకే రాయితీ వర్తిస్తుంది. – ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానశాఖాధికారి, జగిత్యాల

ఎవరిని సంప్రదించాలంటే..

పండ్లతోటల రాయితీ పొందాలనే రైతులు తమ నియోజకవర్గాల్లోని ఉద్యాన శాఖ అధికారులు, లేదా జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేయాలి. వివరాలకు.. జిల్లాలోని మేడిపల్లి, కోరుట్ల, కథలాపూర్, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల రైతులు ఉద్యానశాఖాధికారి శ్యాం ప్రసాద్ 79977 25062 లేదా77802 39329, జగిత్యాల రూరల్, జగిత్యాల అర్బన్, మల్యాల, కొడిమ్యాల, రాయికల్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు చెందిన రైతులు ఉద్యానశాఖాధికారి స్పందన 79977 25063 లేదా 94936 13845, ధర్మపురి, పెగడపల్లి, గొల్లపల్లి, వెల్గటూర్, బుగ్గారం మండలాల రైతులు ఉద్యానశాఖాధికారి దేవ ప్రసాద్ 79977 25065 లేదా70136 81010 నంబర్లలో సంప్రదించండి.

వయోపరిమితి ఐదేళ్లు పెంచాలి

జగిత్యాల: కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ వయోపరిమితి ఐదు సంవత్సరాలు పెంచాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జి.తిరుపతినాయక్ మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ నోటిఫికేషన్ రెగ్యులర్‌గా రాలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో టీఎస్‌పీఎస్సీ నుంచి గ్రూప్స్- 2,3,4, జూనియర్ లెక్చరర్స్, డిగ్రీ లెక్చరర్స్, పాలిటెక్నిక్ తదితర వాటికి నోటిఫికేషన్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు సంవత్సరాల సడలింపు ఇవ్వడం జరిగిందని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ వారికి కూడా ఇవ్వాలన్నారు. హైకోర్టు ఉద్యోగాల నోటిఫికేషన్‌లో వయోపరిమితి ఐదు సంవత్సరాలు ఇచ్చారని, అదే మాదిరిగా టీఎస్‌పీఎస్సీ నుంచి వచ్చే నోటిఫికేషన్‌లో కూడా ఇవ్వాలని కోరారు.

క్లుప్తంగా...

ఉత్తమ ఇంక్యుబేటర్‌గా 'టీ హబ్'

- 2022 జాతీయ స్టార్టప్ అవార్డుల ప్రదానం.. ఢిల్లీలో అవార్డు స్వీకరించిన టీ హబ్ సీఈఓ



సాక్షి, హైదరాబాద్: భారత్‌లో ఆవిష్కరణలకు మూల స్తంభంలా పనిచేస్తున్న 'టీ హబ్'కు 'బెస్ట్ ఇంక్యుబేటర్ ఇండియా' అవార్డు లభించింది. జాతీయ స్టార్టప్ దినోత్సవం సందర్భంగా కేంద్ర ఐటీ శాఖ మంత్రి పీయూష్ గోయల్ సోమవారం ఢిల్లీలో 'నేషనల్ స్టార్టప్ అవార్డులు 2022'ను ప్రదానం చేశారు. టీ హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్‌రావు కేంద్ర మంత్రి చేతుల మీదుగా ఈ అవార్డు స్వీకరించారు. వివిధ రాష్ట్రాలు అవార్డుల కోసం పోటీ పడగా అవార్డు విజేతల్లో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు చెందిన స్టార్టప్‌లు 33 శాతం విజేతలుగా నిలిచాయి. 17 రంగాల్లో 42 స్టార్టప్‌లు అవార్డులు సాధించగా కర్ణాటక 18, మహారాష్ట్ర 9, ఢిల్లీ 4, గుజరాత్ 3, ఉత్తరాఖండ్ 2, తెలంగాణ, ఒరిస్సా, కేరళ, హిమాచల్‌ప్రదేశ్, హరియాణా, అస్సాం ఒక్కో అవార్డును పొందాయి. జాతీయ స్థాయిలో 55 ఇంక్యుబేటర్లు పోటీ పడగా, టీ హబ్‌కు ఉత్తమ ఇంక్యుబేటర్ అవార్డు దక్కింది. టీ హబ్‌కు అవార్డు రావడంపై ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ హర్షం వ్యక్తం చేశారు.

భారత్‌ను కాలుష్య రహిత దేశంగా మార్చుదాం

- హైటెక్స్‌లో జరిగిన సదస్సులో సింగరేణి డైరెక్టర్ చంద్రశేఖర్

సాక్షి, హైదరాబాద్: దేశాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎస్.చంద్రశేఖర్ కోరారు. ఖనిజ పరిశ్రమల్లో హైడ్రోజన్, ఎల్ఎన్‌జీ గ్యాస్‌తో నడిచే యంత్రాలపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ స్థాయి ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మినరల్ ఇండస్ట్రీస్ సదస్సు రెండు రోజులపాటు హైటెక్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఖనిజ పరిశ్రమల్లో పర్యావరణ చర్యలు అనే అంశంపై సోమవారం పలువురు మైనింగ్ మేధావులు తమ పత్రాలను సమర్పించారు. ఈ సదస్సులో ఎన్ఎండీసీ చైర్మన్, ఫీమీ అధ్యక్షులు సుమిత్ దేవ్, ఉపాధ్యక్షులు శాంతేష్ గురెడ్డి, సింగరేణి డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు ముఖ్య అతిథిగా చంద్రశేఖర్ హాజరై ప్రసంగించారు. ఖనిజ పరిశ్రమల్లో వినియోగించే థర్మల్ విద్యుత్ తగ్గించేలా చూడాలని కోరారు. సింగరేణి సంస్థ ఇప్పటికే తన విద్యుత్ అవసరాల కోసం 219 సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుందని, మరో 81 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుని, 2023-24 నాటికి సంస్థ అవసరాలకు కావాల్సిన విద్యుత్‌ను సోలార్ ప్లాంట్ల ద్వారా సమకూర్చుకుంటామని వివరించారు. దీంతో 100 శాతం 'నెట్ జీరో ఎనర్జీ' లక్ష్యాన్ని సాధించబోతున్నామని వెల్లడించారు.

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో 'ఏఈఈ' హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఈనెల 22న అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల హాల్‌టికెట్లను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించింది. 22వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం5 గంటల వరకు రెండు దఫాలుగా పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులు పరీక్ష సమయానికంటే 45 నిమిషాల ముందు పరీక్షా కేంద్రానికి రావాల్సి ఉంటుందని కమిషన్ స్పష్టం చేసింది.



దొడ్డ శ్రీనివాస్‌రెడ్డి

డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ (వరల్డ్ వైడ్ వెబ్) ఇంటర్‌నెట్ ప్రపంచానికి గుర్తింపు కార్డు. వెబ్ మొదలైనప్పటికీ ఇప్పటికీ పోలికే లేనంతగా మారిపోయింది. చదవడానికి, రాయడానికి, సమాచారాన్ని పంచుకోవడానికి వేదిక అయిన ఈ వెబ్ త్వరలో మరో అవతారం ఎత్తబోతోంది. మరింత స్వేచ్ఛాయుతంగా, ఆంక్షలులేని, అనుమతులు అవసరంలేని సరికొత్త వెబ్ ఆవిష్కృతం కాబోతోంది. వెబ్ పరిణామ క్రమాన్ని మూడు అంచెలుగా చెప్తున్నారు. తొలినాటి వెబ్‌ను వెబ్ 1.0గా, ప్రస్తుతం నడుస్తున్నదాన్ని వెబ్ 2.0గా రాబోయేదానిని వెబ్ 3.0గా పిలుస్తున్నారు. దీనిని సినిమాలతో పోలిస్తే.. వెబ్ 1.0 అంటే బ్లాక్ అండ్ వైట్ సినిమా అయితే వెబ్ 2.0 రంగుల చిత్రం, అదే వెబ్ 3.0 ఏకంగా త్రీడీ సినిమా అనుకోవచ్చు. మరి వెబ్ పుట్టు పూర్వోత్తరాలు, దాని పరిణామం, రాబోయే రోజుల్లో ఏ విధంగా మారబోతున్నదో తెలుసుకుందాం.

వచ్చేస్తుంది వెబ్ 3.0



ఆంక్షల్లేని నెట్ ప్రపంచం

బ్లాక్ చైన్, కృత్రిమమేధ, మెషీన్ లెర్నింగ్‌తో సరికొత్త వెబ్ ప్రపంచం

నియంత్రణ లేని స్వేచ్ఛాయుత డిజిటల్ వాతావరణం

చట్టాలు, ఆంక్షలకు కాలం చెల్లబోతున్నాయి

బడా కంపెనీల పెత్తనం ఇక సాధ్యంకాదు

వెబ్ 1.0

యూరప్ పరిశోధన సంస్థ 'సెర్న్'లో కంప్యూటర్ సైంటిస్టుగా పనిచేసిన బెర్నర్స్‌లీ 1990లో వెబ్‌ను రూపొందించారు. వెబ్‌కు అవసరమైన ప్రాథమిక సాంకేతిక పరిజ్ఞానమైన హెచ్‌టీఎంఎల్, యూఆర్ఎల్, హెచ్‌టీటీపీల రూపకర్త బెర్నర్స్‌లీ. తొలి వెబ్‌పేజీని కూడా ఆయనే ఆవిష్కరించారు. తొంబై దశకం మొత్తంగా సాగిన ఈ తొలినాటి వెబ్‌లో కేవలం ఒక కంప్యూటర్ నుంచి మరో కంప్యూటర్‌కు వెబ్ పేజీల ద్వారా సమాచారం పంపడానికి మాత్రమే వీలయ్యేది. నెట్‌స్కేప్ వంటి వెబ్‌బ్రౌజర్‌ల ద్వారా ఈ-మెయిల్స్ పంపుకొనేవారు. ఇంటర్నెట్‌లో చాలా పరిమితంగా సమాచారం అందుబాటులో ఉండేది. రీడ్‌ఓన్లీగా పిలిచే ఈ వెబ్ 1.0 దాదాపుగా 1990లో మొదలై 2004 వరకు సాగింది. వెబ్ 1.0 చివరి రోజుల్లో క్రమంగా రూపాంతరం చెందుతూ వెబ్ 2.0 ఆవిర్భావానికి బాటలు వేసింది.

వెబ్ 2.0

ప్రస్తుతం మనకు సుపరిచయమైన వెబ్ వెర్షన్ ఇది. తొలినాటి వెబ్‌కు ఏమాత్రం పోలికలేని స్థాయిలో మార్పు చెంది వెబ్ 2.0గా రూపుదాల్చింది. స్థిరమైన వెబ్ నుంచి అత్యంత వేగవంతమైన క్రియాశీల అప్లికేషన్‌గా అవతరించింది. చదవడానికి పరిమితమైన వెబ్‌పేజీల నుంచి చదవడం, రాయడం, పరస్పరం సంభాషించుకోగలడం వంటివాటికి వేదికైంది. అపార జ్ఞాన సంపదకు భాండాగారంగా మారింది.

సోషల్ మీడియా నుంచి డిజిటల్ కరెన్సీ వరకు అన్ని రంగాలను ప్రభావితం చేసింది. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఫ్లిక్కర్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్ వంటి అనేకానేక సోషల్ మీడియా వెబ్‌సైట్లకు వెబ్ 2.0 పునాది అయింది. సమస్త సమాచారాన్ని ముంగిటకు తెచ్చి.. ప్రపంచ ప్రజల జీవన శైలినే మార్చేసింది. ఆన్‌లైన్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం వంటి అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. క్రిప్టోకరెన్సీ వంటి డిజిటల్ కరెన్సీ చలామణీలోకి రావడానికి కూడా వెబ్ 2.0 తోడ్పడింది.

వినోద రంగంలో నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్ లాంటి వేల ఓటీటీ చానెల్స్, స్ట్రీమింగ్ సైట్ల పుట్టుకకు ఆస్కారం కల్పించింది. వెబ్ సాంకేతిక పరిజ్ఞానాలైన హెచ్‌టీఎంఎల్5, సీఎస్ఎస్3, జావా స్క్రిప్ట్ ఆధారంగా రోజురోజుకు కొత్త ఆవిష్కరణలతో గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్ వంటి వందల కోట్ల డాలర్ల వ్యాపార సామ్రాజ్యాల సృష్టిని సాకారం చేసింది. ఇప్పుడు బ్లాక్ చైన్ టెక్నాలజీతో 2.0 మరో అవతారం ఎత్తడానికి సమాయత్తం అవుతోంది.

వెబ్ 3.0

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి నిరంతరంగా సాగుతూ ఉంటుంది. ఈ క్రమంలోనే వెబ్ 3.0 తెరపైకి వస్తోంది. ఇది ఎప్పుడు మొదలవుతుందో కచ్చితంగా చెప్పలేకున్నా.. ప్రస్తుత పరిణామాల ఆధారంగా 2023 చివరికల్లా వెబ్ 3.0 ఒక రూపుదాల్చుతుందని సాంకేతిక పరిజ్ఞాన నిపుణుల అంచనా. ఎవరి నియంత్రణ అవసరం లేకుండా బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఆధారంగా రూపొందిన క్రిప్టోకరెన్సీలే వెబ్ 3.0కు తొలి అడుగుగా వారు చెప్తున్నారు. గత వెబ్ వెర్షన్లకు రాబోయే 3.0కు ఉన్న ప్రాథమిక వ్యత్యాసం ఏమిటంటే.. రాబోయేది నియంత్రణలు లేని స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేయడమే. వెబ్ 3.0 మౌలిక నిర్మాణంలో పెద్దగా మార్పు లేకపోయినా.. నూతన సాంకేతిక పరిజ్ఞానాల కారణంగా దీని స్వభావాలు సమూలంగా మారబోతున్నాయి. ప్రస్తుతం వెబ్ వివిధ కంపెనీల నియంత్రణలో నడుస్తుండగా.. వెబ్ 3.0 పూర్తి స్వేచ్ఛా వాతావరణంలో పనిచేయబోతోంది. దీనికోసం బ్లాక్ చైన్ టెక్నాలజీతోపాటు కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషీన్ లెర్నింగ్ వంటి టెక్నాలజీలు వెబ్‌కు జత అవుతున్నాయి. ప్రస్తుతం ఒకటి లేదా రెండు సర్వర్ల ఆధారంగా ఇంటర్నెట్ సమాచార మార్పిడి జరుగుతోంది. వీటిపై కార్పొరేషన్లు, ప్రభుత్వాల నియంత్రణ ఉంటోంది. సమాచార మార్పిడి ఐపీ అడ్రస్‌ల ఆధారంగా జరుగుతోంది. వీటికి అనుమతించడం, నియంత్రించడం ఆయా సర్వర్లపై పెత్తనం ఉన్న కంపెనీలు, ప్రభుత్వాలకే ఉంది. రాబోయే వెబ్ 3.0 సరికొత్త ఈ నియంత్రణలకు లొంగకుండా పనిచేస్తుంది. కంపెనీలు, ప్రభుత్వాల ఆధారంగా కాకుండా వినియోగించే వారి నియంత్రణలో పనిచేసే విధంగా ఉంటుంది. యూజర్ కోరే సమాచారాన్ని కృత్రిమమేధ ద్వారా ప్రపంచంలో ఏ సర్వర్‌లో ఉన్నా తీసుకునే హక్కు రాబోతోంది.



కచ్చితత్వం దిశగా..



ఈ సరికొత్త సాంకేతికత వల్ల వినియోగదారుడికి కచ్చితమైన సమాచారం అందే అవకాశాలు పెరగనున్నాయి. యూజర్ ఏదైనా సమాచారం కోరితే.. ప్రస్తుతం దానికి సంబంధించిన ప్రత్యక్ష, పరోక్ష అంశాలన్నీ అందుబాటులోకి వస్తున్నాయి. ఏది వాస్తవమో, ఏది అవాస్తవమో నిర్ణయించుకునే ఆస్కారం లేకుండాపోతోంది. ఇక మీదట ఏదైనా సమాచారం కోరినప్పుడు వెబ్ 3.0లోని కంప్యూటర్ సమాచారం కోరిన నేపథ్యాన్ని కూడా అర్థం చేసుకుని, వాస్తవికతను జోడించి అవసరమైన మేరకే కచ్చితమైన సమాచారాన్ని అందించగలుగుతుంది. ఇక ముందు కంపెనీలన్నీ ఈ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాలను పొందుపర్చగల కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, ఇతర ఉత్పత్తులను తీసుకురానున్నాయి. ఈ పరిజ్ఞానం ఆధారంగా పనిచేయబోయే యాప్‌లను కూడా డీయాప్స్ (డీసెంట్రలైజ్డ్ యాప్స్)గా పిలవబోతున్నారు.

ఏం జరగబోతోంది?

- వెబ్ 3.0 యుగంలో మనకు నియంత్రిత సమాచారం నుంచి విముక్తి లభిస్తుంది. కోరుకున్న సమాచారం కచ్చితత్వంతో, ఎవరి ప్రమేయానికి లోనవకుండా అందుబాటులోకి వస్తుంది. మన వ్యక్తిగత వివరాలపై ఎవరి నియంత్రణ ఉండబోదు. విస్తృతమైన డేటాబేస్ ఉన్న ఫేస్‌బుక్, గూగుల్ వంటి కంపెనీలు ఇక ముందు ఆ డాటాబేస్‌పై నియంత్రణ కోల్పోతాయి.
- కొత్త వెబ్‌లోని సమాచారంపై ప్రభుత్వాలు, పోలీసు వ్యవస్థలకు నియంత్రణ సాధ్యం కాదు. ప్రభుత్వ సెన్సార్‌షిప్‌లు పనిచేయవు. ఇప్పటికే సైబర్ క్రైంను అదుపు చేయడానికి అష్టకష్టాలు పడుతున్న పోలీసు వ్యవస్థకు దీనితో మరిన్ని కష్టాలు వచ్చే అవకాశముంది.
- డిజిటల్ సమాచారానికి సంబంధించిన ఆయా దేశాల చట్టాలను అమలు చేయడం కూడా సాధ్యం కాదు. ఇదివరకు కొన్ని సర్వర్ల ద్వారా సమాచార మార్పిడి జరిగేది. వాటి నియంత్రణ ద్వారా ప్రభుత్వాలు, పోలీసులు, కోర్టులు చట్టాలను అమలు చేయగలిగేవి. కొత్త వెబ్‌లో సమాచారం అనేక కేంద్రాల నుంచి లభించడం వల్ల.. దానిపై పెత్తనం అసాధ్యంగా మారబోతోంది. మారబోయే సరికొత్త సాంకేతిక వాతావరణంలో ప్రభుత్వాలు, చట్టాలను అమలు చేసే వ్యవస్థలు తమ పంథా మార్చుకోవలసిన పరిస్థితి రానుంది.

8వ నిజాం ముకరంజా బహదూర్ కన్నుమూత

ఈనెల 14న టర్కీలో తుదిశ్వాస

- నేడు హైదరాబాద్‌కు భౌతికకాయం
- 18వ తేదీన చౌమహల్లా ప్యాలెస్‌లో సందర్శనకు ప్రజలకు అవకాశం



మక్కా మసీదు ఆవరణలోని అసఫ్‌జాహీ సమాధులవద్ద అంత్యక్రియలకు ఏర్పాట్లు


సాక్షి, హైదరాబాద్/చార్మినార్: నిజాం కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. 8వ నిజాం రాజు మీర్ బర్కత్ అలీ ఖాన్ ముకరంజా బహదూర్ (89) శనివారం రాత్రి టర్కీలోని ఇస్తాంబుల్‌లో కన్నుమూశారు. అనారోగ్యంతో కొన్నాళ్లుగా చికిత్స పొందుతున్న ముకరంజా పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయం మంగళవారం హైదరాబాద్ చేరుకుంటుందని నిజాంట్రస్ట్ సభ్యులు ప్రకటించారు. తన అంతిమ సంస్కారాలను హైదరాబాద్ మక్కా మసీదులోని అసఫ్‌జాహీ సమాధుల వద్ద నిర్వహించాలన్న ఆయన కోరిక మేరకు పార్థివ దేహాన్ని హైదరాబాద్‌కు తీసుకొస్తున్నారు. హైదరాబాద్ సంస్థానం ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్ మనుమడే ముకరంజా. 1933 అక్టోబర్ 6న ఫ్రాన్స్‌లో ఆయన జన్మించారు. డెహ్రాడూన్‌లో పాఠశాల విద్య, లండన్‌లో ఉన్నత విద్యాభ్యాసం చేశారు.

1967లో ఎనిమిదవ నిజాంగా..

భారత యూనియన్‌లో హైదరాబాద్ చేరిన తర్వాత, ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ జనవరి 26, 1950 నుంచి అక్టోబర్ 31, 1956 వరకు రాష్ట్ర రాజ్ ప్రముఖ్‌గా పనిచేశారు. ఫిబ్రవరి 1967లో ఆయన మరణానంతరం ఏప్రిల్ 6, 1967లో ఎనిమిదవ అసఫ్ జాహీగా ముకరంజాకు పట్టాభిషేకం చేశారు. నిజాం చారిటబుల్ ట్రస్ట్, ముకరంజా ట్రస్ట్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్‌కు ముకరంజా చైర్మన్‌గా వ్యవహరించారు. ఏడో నిజాం వారసుడిగా భారీ సంపదను ముకరంజా వారసత్వంగా పొందారు. కాగా, మక్కా మసీదులోని అసఫ్‌జాహీ సమా ధుల ప్రాంగణంలో ముకరంజా ఖననం కోసం నిజాం ట్రస్టు సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18న నిర్వహించే ముకరంజా అంత్యక్రియలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులు సోమవారం పరిశీలించారు. ముందుగా చౌమహల్లా ప్యాలెస్‌ను సందర్శించిన అధికారుల బృందం సభ్యులు అక్కడ ఏర్పాట్లు పరిశీలించింది.

ప్రజల సందర్శనార్థం చౌమహల్లా ప్యాలెస్‌లో..

మంగళవారం ముకరంజా భౌతికకాయాన్ని ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తీసుకువచ్చిన అనంతరం చౌమహల్లా ప్యాలెస్‌కు తరలించనున్నారు. 18న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చౌమహల్లా ప్యాలెస్‌లో ఆయన పార్థివ దేహాన్ని సందర్శించడానికి ప్రజలను అనుమతించనున్నారు. తర్వాత అంత్యక్రియల కోసం పార్థివ దేహాన్ని తరలిస్తారు.



1967లో ఎనిమిదవ అసఫ్ జాహీగా ముకరంజాకు పట్టాభిషేకం..

బాలింతల మృతి ఆందోళనకరం: గవర్నర్

- ఓ గైనకాలజిస్టుగా ఈ ఘటనపై ఎన్నో ప్రశ్నలున్నాయి.. సర్కారీ ఆస్పత్రులే పేదల చివరి ఆశ
- మీడియాతో గవర్నర్ తమిళిసై



సాక్షి, హైదరాబాద్: నగరంలోని మలక్‌పేట ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో సిజేరియన్ వికటించి ఇద్దరు బాలింతలు మృతిచెందడం పట్ల రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలకు సర్కారీ ఆస్పత్రులే ఆఖరి ఆశ అని ఆమె వ్యాఖ్యానించారు. గైనకాలజిస్టుగా తనకు ఈ ఘటనపై ఎన్నో ప్రశ్నలున్నాయని తెలిపారు. ఘటన జరిగిన వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని అనుకున్నానని, కానీ సంక్రాంతి పండుగని ఆగానని అన్నారు. గతంలో సైతం కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల సమయంలో నలుగురు మహిళలు మరణించారని గుర్తు చేశారు. జనాభా అవసరాలకు తగ్గట్టుగా రాష్ట్రంలో వైద్య సదుపాయాలు మెరుగుపడాలని ఆమె అభిప్రాయపడ్డారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆదివారం రాజ్‌భవన్‌లో జరిగిన వేడుకల్లో ఆమె పాల్గొని మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులు తన పరిశీలనలో ఉన్నాయనీ పెండింగ్‌లో లేవని తెలిపారు. యూనివర్సిటీల ఉమ్మడి నియామక బోర్డు బిల్లులోని అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యూనివర్సిటీ నియామకాల బిల్లుపై న్యాయ వివాదాలు వచ్చే అవకాశం ఉందని, దీంతో నియామకాల్లో జాప్యం జరగరాదని తన భావనని చెప్పారు. ఈ తరహా విధానాలకు గతంలో న్యాయ స్థానాలు అభ్యంతరం తెలిపాయన్నారు. బిల్లుపై యూజీసీ కొన్ని అంశాలను లేవనెత్తిందని గవర్నర్ వెల్లడించారు. వర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ కావాలని తన అభిమతమన్నారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా గవర్నర్ తమిళిసై స్వయంగా తయారు చేసిన పొంగలిని సూర్యుడికి సమర్పించిన అనంతరం ఉత్సవాల్లో పాల్గొన్న వారికి వడ్డించారు.

ముకరంజా మృతి పట్ల సీఎం సంతాపం

అత్యున్నత అధికార లాంఛనాలతో అంత్యక్రియలు ● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సంస్థానం ఆఖరి నిజాం 'మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహద్దూర్' మనవడు, నిజాం పెద్దకుమారుడు ఆజమ్ ఝా, దుర్రె షెహవార్ దంపతుల కుమారుడు ముకరంజా బహద్దూర్ మరణం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నిజాం వారసుడుగా, పేదల కోసం విద్య, వైద్య రంగాల్లో ముకర్రమ్ ఝా చేసిన సామాజిక సేవలకు గుర్తుగా, వారి అంత్యక్రియలను అత్యున్నతస్థాయి అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. టర్కీలోని ఇస్తాంబుల్‌లో శనివారం రాత్రి మరణించిన ముకరంజా పార్థివ దేహం హైదరాబాద్‌కు చేరుకున్న తర్వాత, వారి కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు అంత్యక్రియల సమయాన్ని, స్థలాన్ని నిర్ధారించి తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారు ఎ.కె.ఖాన్‌కు సూచించారు. సీఎం ఆదేశాల మేరకు అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఏకే ఖాన్ సమన్వయం చేస్తున్నారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో ముకరంజా అంత్యక్రియలను నిర్వహించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విశ్వహిందూ పరిషత్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది.

'కంటి వెలుగు'కు ఆధార్ తప్పనిసరి

- కలెక్టర్లతో సమీక్షలో మంత్రి హరీశ్
- రేపు ఖమ్మంలో లాంఛనంగా ప్రారంభించనున్న కేసీఆర్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: రాష్ట్రంలో చేపడుతున్న కంటివెలుగు రెండో దశ కార్యక్రమానికి అన్ని శాఖలు సహకరించాలని ఆర్థిక, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. ఈనెల 18న ఖమ్మంలో కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. శిబిరానికి వచ్చే ప్రజలు తప్పనిసరిగా ఆధార్ కార్డు తెచ్చుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి సోమవారం ఆయన సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి రిజ్వి, కమిషనర్ శ్వేతతోపాటు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. శిబిరాల నిర్వహణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగిన భద్రత కల్పించాలని హరీశ్‌రావు సూచించారు. ఈనెల 18న ఖమ్మంలో సీఎం లాంఛనంగా ప్రారంభించనుండగా, జిల్లాల్లో ఈనెల 19న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్లు తదితరులు కంటివెలుగును ప్రారంభించాలని చెప్పారు. వైద్య బృందాలు సమీప పట్టణాలు, మండల కేంద్రాల్లోనే రాత్రిబస చేసేలా పర్యవేక్షిస్తూ ప్రతిరోజూ ఉదయం 8-45 గంటలకల్లా తప్పనిసరిగా శిబిరాలను తెరవాలని స్పష్టంచేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగును నిర్వహిస్తున్నందున కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సీఎస్ శాంతికుమారి సూచించారు. ఈ సమావేశంలో ఎంపీలు నామా నాగేశ్వర రావు, వద్దిరాజు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మంత్రి హరీశ్, ఎంపీలు నామా, వద్దిరాజు రవిచంద్ర

ఆధునిక రైల్వేకు రూపకల్పన

రూ.250 కోట్ల నుంచి రూ.3వేల కోట్లకు పెరిగిన తెలంగాణ రైల్వే బడ్జెట్





వందేభారత్ రైలులో చిన్నారులు వేసిన చిత్రాన్ని చూపిస్తున్న తమిళిసై. చిత్రంలో అశ్వినీ వైష్ణవ్, బండి, కిషన్‌రెడ్డి, విజయశాంతి ● చిన్నారులతో ముచ్చటిస్తున్న తలసాని

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో గత ఎనిమిదేళ్లలో రైల్వేల పురోగతి అద్భుతంగా సాగిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. 2014 కు ముందు తెలంగాణకు రైల్వే బడ్జెట్‌లో రూ. 250 కోట్లలోపే కేటాయింపు ఉండేదని, ఇప్పుడు అది రూ. 3వేల కోట్లకు పెరిగిందన్నారు. రైలును చూడని మెదక్ లాంటి ప్రాంతాలకు ఇప్పుడు రైల్వే కనెక్టివిటీ ఏర్పడిందని, ఇది తెలంగాణలో రైల్వేపరంగా పురోగతికి గుర్తని ఆయన వ్యాఖ్యానించారు. సంక్రాంతి నాడు ఆదివారం ఉదయం సికింద్రాబాద్- విశాఖపట్నం మధ్య నడిచే దేశంలో ఎనిమిదో వందేభారత్ రైలును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఢిల్లీ నుంచి ఆయన జెండా ఊపగా, సికింద్రాబాద్ స్టేషన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యక్షంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ తెలంగాణలో రైల్వేలో పురోగతిని ప్రత్యేకంగా ప్రస్తావించారు.

త్వరలోనే తెలంగాణలోని అన్ని బ్రాడ్ గేజ్ మార్గాల విద్యుదీకరణ

2014కు ముందు ఎనిమిదేళ్ళ కాలంలో తెలంగాణ ప్రాంతంలో కొత్తగా వేసిన రైలు మార్గం 125 కిలోమీటర్ల లోపే ఉండగా, గడిచిన ఎనిమిదేళ్లలో 325 కిలోమీటర్ల మేర కొత్తగా నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఎనిమిదేళ్లలో ట్రాక్ విస్తరణ పనులు 250 కిలోమీటర్లకు పైగా జరిగాయని, విద్యుదీకరణ పనులు మూడు రెట్లు పెరిగాయని వెల్లడించారు. త్వరలోనే అన్ని బ్రాడ్ గేజ్ మార్గాల విద్యుదీకరణ పూర్తి చేస్తామని ప్రధాని హామీ ఇచ్చారు.

ఏపీలో కూడా బలోపేతానికి చర్యలు

ఆంధ్రప్రదేశ్‌లో కూడా రైలు నెట్ వర్క్‌ను బలోపేతం చేయటానికి కేంద్రం చర్యలు చేపట్టిందన్నారు. కొద్ది కాలంలోనే 350 కిలోమీటర్ల కొత్త రైలు మార్గాన్ని, 800 కిలోమీటర్ల మేర ట్రాక్ గేజ్ మార్పిడి పనులను పూర్తి చేయటాన్ని ప్రస్తావించారు. 2014 కు ముందు కాలంతో పోల్చుకుంటే ఆంధ్ర ప్రదేశ్‌లో ఏటా 60 కిలోమీటర్ల మేర మాత్రమే విద్యుదీకరణ జరగగా ఇప్పుడు ఆ వేగం ఏడాదికి 220 కిలోమీటర్లకు పెరిగిందన్నారు. దేశీయంగా సొంత పరిజ్ఞానంతో అద్భుతంగా రూపొందిన ఈ రైలు నవ భారత సామర్థ్యానికి, దీక్షకు ఒక చిహ్నం అని ప్రధాని అభివర్ణించారు. సైనిక దినోత్సవం సందర్భంగా భారత సైనికులకు కూడా ప్రధాని మోదీ ఘనంగా నివాళులర్పించారు.

పక్షం రోజుల్లో రెండోది... : ఈ ఏడాది కేవలం 15 రోజుల్లోనే రెండో వందే భారత్ రైలు పట్టాలెక్కిందని పేర్కొంటూ, వందే భారత్ రైళ్ళ తయారీలో వేగానికి ఇది నిదర్శనమన్నారు. సికింద్రాబాద్ వందే భారత్‌కు పూర్వం పట్టాలెక్కిన 7 వందే భారత్ రైళ్ళు 23 లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణించాయని, ఇది భూమి చుట్టూ 58 ప్రదక్షిణలతో సమానమని పేర్కొన్నారు.

ఇక రోజువారీగా వందేభారత్..: ఈ రైలు సికింద్రాబాద్‌లో బయలుదేరి వరంగల్, ఖమ్మం మీదుగా ఏపీలోని విజయవాడ, రాజమండ్రి స్టేషన్లలో ఆగుతూ విశాఖపట్నం చేరుకుంటుందని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు వందేభారత్ రైలు సంక్రాంతి కానుకగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. త్వరలో రూ.700 కోట్ల వ్యయంతో ప్రధాని ఆధ్వర్యంలో సికింద్రాబాద్ స్టేషన్ అద్భుతంగా పునర్నిర్మాణం జరగనుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీజేపీ నేతలు లక్ష్మణ్, విజయశాంతి పాల్గొన్నారు.

సాక్షి
ఫ్యామిలీ
కరీంనగర్
మంగళవారం ॥ 17-1-2023

స్పృహ

అద్భుతదీపం దొరికితే అద్భుతాలు సృష్టించవచ్చు.
అది కథల్లో తప్ప బయట దొరకదని
మనకు తెలుసు!
అయితే అలీన అలమ్‌కు 'పవర్ ఆఫ్ పాజిటివ్ యాక్షన్'
రూపంలో అద్భుతదీపం దొరికింది.
ఆ అద్భుతదీపంతో వ్యాపారంలో
ఓనమాలు తెలియని అలీన
సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణిస్తోంది.
నిస్సహాయత తప్ప ఏమీ లేని వారికి అండగా ఉండి
ముందుకు నడిపిస్తోంది...


దివ్యాంగులతో అలీన అలమ్

అలీన అద్భుతదీపం

కోల్‌కత్తాకు చెందిన అలీన అలమ్‌కు హైస్కూల్ రోజుల్లో బాగా నచ్చిన మాట... పవర్ ఆఫ్ పాజిటివ్ యాక్షన్. రోడ్డు దాటుతున్న వృద్ధురాలికి సహాయపడినప్పుడు, ఆకలితో అలమటిస్తూ దీనస్థితిలో పడి ఉన్న వ్యక్తికి తన పాకెట్‌మనీతో కడుపు నిండా భోజనం పెట్టించినప్పుడు, పిల్లాడికి స్కూల్ ఫీజు కట్టలేక సతమతమవుతున్న ఆటోడ్రైవరుకు తన వంతుగా సహాయం చేసినప్పుడు..

'పవర్ ఆఫ్ పాజిటివ్ యాక్షన్' అనేది తన అనుభవంలోకి వచ్చింది.

'ఒక మంచి పని చేస్తే అది ఊరకే పోదు. సానుకూల శక్తిగా మారి మనల్ని ముందుకు నడిపిస్తుంది' అనే మాట ఎంత నిజమో తెలిసి వచ్చింది.

అలీన తల్లి గృహిణి. తండ్రి ఒక కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగి.

'డబ్బే ప్రధానం' అనే ధోరణిలో వారు పిల్లల్ని పెంచలేదు.

బెంగళూరులోని అజిమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీలో మాస్టర్స్ చేసింది అలమ్. అక్కడ చదుకునే రోజుల్లో ఎన్నో డాక్యుమెంటరీలను చూసింది. తన ఆలోచనలు విశాలం కావడానికి,



కొత్తగా ఆలోచించడానికి, కొత్తమార్గాన్ని అన్వేషించడానికి అవి కారణం అయ్యాయి.

'రోమన్ చక్రవర్తి నీరోపై తీసిన ఒక డాక్యుమెంటరీ చూసి చలించిపోయాను. యుద్ధఖైదీల పట్ల అతడు క్రూరంగా వ్యవహరిస్తాడు. అయితే ఆ క్రూరత్వం అనేది ఆ చక్రవర్తికి మాత్రమే పరిమితమై లేదు. అతడితో అంతం కాలేదు. రకరకాల రూపాల్లో అది కొనసాగుతూనే ఉంది. క్రూరత్వంపై మానవత్వం విజయం సాధించాలి' అంటుంది అలీన.

23 సంవత్సరాల వయసులో 'మిట్టీ' పేరుతో కేఫ్ ప్రారంభించింది అలీన.'ఏదైనా మంచి ఉద్యోగం చేయకుండా ఇదెందుకమ్మా' అని తల్లిదండ్రులు నిట్టూర్చలేదు. ఆశీర్వదించారు తప్ప అభ్యంతర పెట్టలేదు. ఇది లాభాల కోసం ఏర్పాటు చేసిన కేఫ్ కాదు. మానసిక వికలాంగులు, దివ్యాంగులకు ధైర్యం ఇచ్చే కేఫ్.

'మిట్టీ' అనే పేరును ఎంచుకోవడానికి కారణం అలమ్ మాటల్లో...

'మనం ఈ నేల మీదే పుట్టాం. చనిపోయిన తరువాత ఈ నేలలోనే కలుస్తాం. నేలకు ప్రతి ఒక్కరూ సమానమే'

నిజానికి 'మిట్టీ' మొదలు పెట్టడానికి ముందు తన దగ్గర పెద్దగా డబ్బులు లేవు. దీంతో ఒక ఆలోచన చేసింది. 'దివ్యాంగులకు మిట్టీ కేఫ్ ద్వారా సహాయ పడాలనుకుంటున్నాను. నాకు అండగా నిలవండి' అంటూ కరపత్రాలు అచ్చువేసి కర్నాటకలోని కొన్ని పట్టణాల్లో పంచింది.

అయితే పెద్దగా స్పందన లభించలేదు.

ఒక అమ్మాయి మాత్రం అలీనకు సహాయంగా నిలవడానికి ముందుకు వచ్చింది.

'ఒక్కరేనా! అనుకోలేదు. ఈ ఒక్కరు చాలు అనుకొని ప్రయాణం మొదలుపెట్టాను' అని గతాన్ని గుర్తుకు తెచ్చుకుంది అలీన.

కొందరు ఆత్మీయుల ఆర్థిక సహకారంతో హుబ్లీ(కర్నాటక)లోని బీవిబీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ క్యాంపస్‌లో 'మిట్టీ' తొలి బ్రాంచ్ ప్రారంభించింది.

ఇక వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం ఏర్పడలేదు.

నాలుగు సంవత్సరాలలో బెంగళూరు, కర్నాటకాలలో 17 బ్రాంచ్‌లను ఏర్పాటు చేసింది. దివ్యాంగులు, మానసిక సమస్యలతో సతమతమవుతున్న వారికి ధైర్యం ఇచ్చి, తగిన శిక్షణ ఇచ్చి ఈ కేఫ్‌లలో ఉపాధి కల్పించడం ప్రారంభించింది అలీన.

'మిట్టీ' సక్సెస్‌ఫుల్ కేఫ్‌గానే కాదు దివ్యాంగుల హక్కులకు సంబంధించి అవగాహన కేంద్రంగా కూడా ఎదిగింది.

'మిట్టీ కేఫ్‌లోకి అడుగుపెడితే చాలు చెప్పలేనంత ధైర్యం వస్తుంది' అంటుంది కోల్‌కతాకు చెందిన 22 సంవత్సరాల కీర్తి.

దివ్యాంగురాలిగా కీర్తి అడుగడుగునా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంది. అయితే మిట్టీ కేఫ్ తనలో ఎంతో ధైర్యాన్ని నింపింది.

ఇలాంటి 'కీర్తి'లు ఎంతో మందికి అండగా నిలుస్తోంది మిట్టీ కేఫ్.

వైరల్

తండ్రీ... నీ ఆశీర్వాదం

కూతురు పైలెట్.. తండ్రి ప్రయాణికుడు. మరి కాసేపట్లో విమానం గాల్లో ఎగరాలి. కూతురు కాక్‌పిట్ నుంచి బయటికొచ్చి తండ్రి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకుంది. తండ్రి ఆనందంతో తబ్బిబ్బు అయ్యాడు. తల్లిదండ్రుల ఆశీర్వాదం మరిచి నేను ఏ పనీ చేయను అంటున్న భారతీయ పైలెట్ కతద్న్యా సోషల్ మీడియాలో మెటికలు విరిచే ఆశీర్వాదం పొందుతోంది.


తండ్రి ఆశీర్వాదం తీసుకుంటున్న పైలెట్ కతద్న్యా



'ఈ రోజు కోసం నేను 13 ఏళ్లుగా ఎదురు చూస్తున్నా' అని ఇన్‌స్టాలో రాసుకుంది పైలెట్ కృతద్న్యా హాలె తన తండ్రితో పాటు ఉన్న తన ఫొటోను పోస్ట్ చేస్తూ.

'నేను పైలెట్ అవ్వాలని కలలు కంటున్నప్పుడు మా నాన్న తప్ప ఎవరూ నా మీద విశ్వాసం ఉంచలేదు. నా కెరీర్ మొదలెట్టి 13 ఏళ్లు అయింది. ఇవాళ మా నాన్నను ఆకాశం మీదుగా గమ్యాన్ని చేర్చే అవకాశం వచ్చింది' అని కూడా రాసుకుంది కృతద్న్యా.

ముంబై నుంచి స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌కి ఎయిర్‌బస్ 320 తరచూ నడిపే కృతద్న్యా తన తండ్రిని బహుశా స్వదేశం తీసుకు వస్తూనో లేదా స్పెయిన్ తీసుకువెళుతూనో ఒక వీడియో పోస్ట్ చేసింది. విమానం ఎగిరే ముందు కాక్‌పిట్ నుంచి బయటకు వచ్చి పాసింజర్ సీట్‌లో కూచుని ఉన్న తండ్రి కాళ్లకు మొక్కి ఆశీర్వాదం తీసుకుంది. ఆయన్ను హత్తుకుంది. తబ్బిబ్బవుతూ తండ్రి ఆమెను ఆశీర్వదించాడు.

ఆ వీడియోను కృతద్న్యా పోస్ట్ చేస్తూ 'తల్లిదండ్రుల ఆశీర్వాదం లేకుండా నేను ఏ పని చేయను. ఒక్కోసారి డ్యూటీకి నేను తెల్లవారుజాము మూడుకో నాలుక్కో ఇంటి నుంచి బయట పడాల్సి వచ్చినా నా తల్లిదండ్రులు గాఢనిద్రలో ఉన్నా వారి పాదాలు తాకి వెళ్లడం అలవాటు' అని రాసింది.

ఈ వీడియోను ఆమె పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే దానికి దాదాపు ఐదు లక్షల లైకులు వచ్చాయి. ఇన్‌స్టాలో చాలామంది నెటిజన్లు ఉద్వేగానికి లోనయ్యారు. 'నిన్ను, మీ నాన్నను చూసి కన్నీరు ఆగడం లేదు' అని ఒకరు రాస్తే 'ఇది అసలు సిసలు భారతీయ సంస్కృతి' అని మరొకరు రాశారు. 'నీలాంటి అమ్మాయిలే మాకు రోజూ స్ఫూర్తినిస్తున్నారు' అని మరొక మహిళ కామెంట్ చేసింది.

భారతీయ కుటుంబాల్లో తండ్రీ కూతురు అనుబంధం ప్రత్యేకమైనది. కొందరు కూతుళ్లు అమ్మ కూచిలుగా కాకుండా నాన్న బిడ్డలుగా ఉంటారు. నాన్నతో క్లోజ్‌గా ఉంటారు. నాన్నలు వారి కోసం ప్రాణం పెడతారు. కృతద్న్యా, ఆమె తండ్రిలో అలాంటి తండ్రీ కూతుళ్లు తమను తాము పోల్చుకోవడంతో ప్రస్తుతం ఈ వీడియో యమా వైరల్‌గా మారింది.

న్యూస్ మేకర్

జీవితం ఆమెతో ఫుట్‌బాల్ ఆడింది

పౌలమి అధికారి



మొన్న ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌లో
మన పురుషుల టీం కనిపించిందా?
పురుషుల టీమ్‌ను తయారు చేసుకోలేని మనం
స్త్రీల టీమ్‌ను మాత్రం ఏం పట్టించుకుంటాం?
అసలు ఫుట్‌బాల్ ఆడే అమ్మాయిలకు మన దేశంలో
ఏం మర్యాద, ప్రోత్సాహం ఉన్నాయి?
కోల్‌కటా ఫుట్‌బాల్ క్రీడాకారిణి
పౌలమి అధికారి ఒకప్పుడు దేశ జట్టులో ఆడింది.
ఇప్పుడు?
జరుగుబాటు కోసం జొమాటో డెలివరి గర్ల్‌గా పని చేస్తోంది.
గత రెండు మూడు రోజులుగా ఈమె జీవిత అవస్థ గురించి
సోషల్ మీడియాలో, మీడియాలో ఆవేదన వ్యక్తం అవుతోంది.

జొమాటో అని రాసి ఉన్న ఎర్రటి టీ షర్ట్ తొడుక్కుని కోల్‌కటాలో సైకిల్ మీద ఫుడ్ డెలివరీ చేస్తున్న 24 ఏళ్ల పౌలమి అధికారి ఒక ఫుట్‌బాల్ క్రీడాకారిణి అని ఎవరూ ఊహించరు. గత కొంత కాలంగా ఇల్లు గడవడానికి పౌలమి ఫుడ్ డెలివరీ చేస్తోంది. కోల్‌కటాకే చెందిన సంజుక్త చౌధురి అని ట్విటర్ యూజర్ పౌలమి గురించి చిన్న వీడియో తీసి ట్విటర్‌లో ఉంచడంతో గత రెండు మూడు రోజుల్లోనే చాలా రెస్పాన్స్‌లు వచ్చాయి. విస్తృతంగా కామెంట్స్ కూడా వచ్చాయి. ఒక ఫుట్‌బాల్ క్రీడాకారిణి నిస్సహాయ స్థితిలో ఉండటం ఏ మాత్రం సరికాదనే అభిప్రాయాలు వెల్లడయ్యాయి.

అబ్బాయి అనుకునేవారు

కోల్‌కటాలోని బెహలా ప్రాంతంలో నివసించే పౌలమి బాల్యంలోనే తల్లిని కోల్పోయింది. తండ్రి టాక్సీ డ్రైవర్‌గా పని చేస్తుంటే మేనత్త పెంచి పెద్ద చేసింది. చిన్నప్పటి నుంచే పౌలమి ఫుట్‌బాల్ ఆడేది. అయితే అబ్బాయిలాగా కనిపించే పౌలమిని చూసి అందరూ అబ్బాయి అనుకుని ఆడించేవారు. 'ఆ తర్వాత నేను అమ్మాయి అని తెలిశాక ఆటలో రానివ్వలేదు. అమ్మాయిలు ఫుట్‌బాల్ ఆడితే వారికి ఏ మర్యాద లేదు. నేను ఫుట్‌బాల్ మానేసి కొన్నాళ్లు హాకీ ఆడాను. అయితే మా ప్రాంతంలోని అనిత సర్కార్ అనే ఫుట్‌బాల్ కోచ్ నన్ను చూసి ఫుట్‌బాల్‌లో ట్రయినింగ్ ఇచ్చింది. నేను మంచి ప్లేయర్‌ని అయ్యాను' అంటుంది పౌలమి. పదిహేను ఏళ్లు వచ్చేసరికే పౌలమి మంచి ఫుట్‌బాల్ క్రీడాకారిణి అయ్యింది. దేశం తరఫున అండర్ 16 జట్టుకు ఎంపికయ్యి 2013లో జరిగిన అండర్ 16 ఛాంపియన్‌షిప్ కోసం శ్రీలంక వెళ్లి ఆడింది. అయితే ఆ సమయంలో తగిలిన గాయాల నుంచి కోలుకోవడం కష్టమైంది. ఇంటివాళ్లుగాని, క్రీడా సంస్థలుగాని సరైన వైద్యం, ఫిట్‌నెస్ ట్రయినింగ్ ఇప్పించకపోవడంతో వెనుకబడింది. మళ్లీ కోలుకుని 2016లో జరిగిన స్ట్రీట్ 'హోమ్‌లెస్ ఫుట్‌బాల్ వరల్డ్‌కప్' కోసం దేశం తరఫున గ్లాస్‌గో వెళ్లి ఆడింది. ఆ తర్వాత కూడా ఆమెకు ఫుట్‌బాల్ అసోసియేషన్ నుంచి ఎటువంటి మద్దతు, ప్రోత్సాహం లభించలేదు.

వెంటాడిన పేదరికం

2017లో తండ్రి చేస్తున్న డ్రైవర్ ఉద్యోగం పోయింది. ఇంకో చెల్లెలు, తను తప్ప సంపాదనకు ఎవరూ లేరు. 2019 నాటికి బతకడం దుర్భరమైంది. 'అప్పుడే నేను జొమాటోలో చేరాను. ఆ రోజుల్లో రోజుకు 500 సంపాదించేదాన్ని. లాక్‌డౌన్ ఎత్తేశాక చాలామంది ఈ ఉద్యోగంలోకి వచ్చారు. ఆర్డర్లు తక్కువ. పైగా నాకు సైకిల్ తప్ప బండి లేదు. దాంతో దగ్గరి ఆర్డర్లే తీసుకుంటాను. అందువల్ల రోజుకు 400 వస్తాయి. ఒక్కో ఆర్డర్ మీద 20 లేదా 30 రూపాయలు వస్తాయి. ఒక్కోసారి రోజుకు 300 రూపాయలకు మించి రావు. నాకు వేరే దారి లేదు... ఈ పని తప్ప' అంది పౌలమి. రోజుకు 12 గంటలు పని చేస్తూ కూడా ఒక్కోసారి ఫుట్‌బాల్‌ను సాధన చేస్తుంటుంది పౌలమి. బి.ఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నదిగాని అది కూడా నత్తనడకన సాగుతున్నది.

వెల్లువెత్తిన స్పందన

పౌలమి కథనానికి స్పందన వెల్లువెత్తింది. దేశంలో ఫుట్‌బాల్ క్రీడాకారుల స్థితి ఆ మాటకొస్తే ఏ కొద్ది మందో తప్ప అందరు క్రీడాకారుల స్థితి ఇలాగే ఉందనే స్పందన వచ్చింది. ఫుట్‌బాల్ ఆటను ఇలా నిర్లక్ష్యం చేయడం వల్ల ఇన్ని కోట్ల మంది భారతీయులు ఉన్నా పురుషులలో గాని, స్త్రీలలోగాని ప్రపంచ దేశాలతో తలపడే మెరుగైన టీమ్‌లు తయారు కావడం లేదనే విమర్శలు వచ్చాయి. 'నాకు ఇప్పుడు కుదురైన ఉద్యోగం, ప్రాక్టీసు చేయడానికి మంచి స్పైక్స్ కావాలి' అంటున్న పౌలమిలాంటి వారిని ఆ స్థితిలో ఉంచడం విషాదం.

ఇప్పుడు వచ్చిన స్పందనతో ఆమెకు ఎలాంటి సహాయం అందుతుందో చూడాలి.


జొమాటో గర్ల్‌గా... పౌలమి అధికారి ఫుట్‌బాల్ క్రీడాకారిణిగా...

వైరల్

సత్తా చాటి స్వర్ణం గెలిచిన బంగారు బామ్మ


క్యారమ్స్ టోర్నమెంట్‌లో వసంతి ఉత్సుకర్

'ఖాన్‌తో గేమ్స్ ఆడవద్దు' అని ఒక సినిమాలో హెచ్చరించారు బ్రహ్మానందం. ఈ బామ్మ మాత్రం 'నాతో గేమ్స్ ఆడండి' అని అందరినీ ఆహ్వానిస్తుంటుంది. ఆటలో తన శక్తి యుక్తులను ఎప్పటికప్పుడు పెంచుకుంటూ ఉంటుంది. 'బామ్మతో క్యారమ్స్ ఆడడం బహు కష్టం సుమీ' అనిపించేలా ఉంటుంది ఆమె ఆట నైపుణ్యం.

మహారాష్ట్రలోని పుణెలో జరిగిన క్యారమ్ టోర్నమెంట్స్‌లో యూత్ ఎక్కువగా పాల్గొంది. అంతమాత్రాన వసంతి ఉత్సుకర్ బామ్మ సైలెంట్‌గా ఉంటుందా ఏమిటి! తన సత్తా చాటడానికి క్యారమ్స్ బరిలోకి దిగింది. డబుల్స్ విభాగంలో స్వర్ణపతకం, సింగిల్స్‌లో కాంస్య పతకం గెలుచుకొని 'నువ్వు బంగారం బామ్మ' అంటూ జేజేలు అందుకుంది. 'ఏజ్ ఈజ్ జస్ట్ ఏ నంబర్ సుమీ' అనే వాస్తవాన్ని మరోసారి ఘనంగా గుర్తు చేసింది. వసంతి బామ్మ క్యారమ్స్ ఆడుతున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తే వైరల్‌గా మారింది.

కిచెన్ టిప్స్

- కూరల్లో కారం ఎక్కువ పడితే కొంచెం టమాటా కలిపి తక్కువ మంట మీద కాసేపు ఉంచాలి.
- కొద్దిగా పంచదార కలిపినా సరి పోతుంది.
- అదే చికెన్, సీ ఫుడ్ అయితే కొద్దిగా నిమ్మరసం కలపవచ్చు.



బ్యూటిప్స్

బొప్పాయి... తేనె ఫేస్ ప్యాక్

బొప్పాయిలో ఉండే ఎంజైమ్స్ చర్మంపై చక్కటి ప్రభావాన్ని చూపుతాయి. ఇవి చర్మాన్ని కాంతివంతంగా మార్చడంతోపాటు చర్మంపై ఉండే మృతకణాలను తొలగించి చర్మాన్ని అందంగా మారుస్తాయి. తేనెలోని గుణాలు చర్మానికి పోషణనిస్తాయి. బాగా మగ్గిన బొప్పాయి పండు ముక్క తీసుకొని బాగా మెత్తగా చేసుకోవాలి. దీనికి చెంచా తేనె కలిపి.. రెండూ బాగా మిక్స్ అయ్యేలా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకొని పూర్తిగా ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది.



నిమ్మరసం.. కీర దోస.. రోజ్ వాటర్

నిమ్మరసంలో సహజసిద్ధమైన బ్లీచింగ్ గుణాలుంటాయి. ఇవి ట్యాన్‌ను పోగొట్టి చర్మాన్నిమెరిపిస్తాయి. దీనికి రోజ్ వాటర్, కీర దోస రసం కూడా కలిపితే.. చర్మానికి జీవకళ అందుతుంది. ఈ మిశ్రమం చర్మంపై ఉన్న డార్క్ స్పాట్స్‌ను సైతం తగ్గిస్తుంది. టేబుల్ స్పూన్ చొప్పున నిమ్మరసం, కీర దోస రసం, రోజ్ వాటర్ తీసుకోవాలి. ఈ మూడింటిని గిన్నెలో వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో కాటన్ బాల్ ముంచి ముఖానికి రాసుకోవాలి. పావుగంట లేదా ఇరవై నిమిషాల తర్వాత ముఖాన్ని ఫ్రిజ్‌లో ఉంచిన నీటితో కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది.



పాఠం నేర్చుకున్నాను

- క్రిటిక్స్ అవార్డ్స్‌లో కీరవాణి

''నా జీవితంలో ఉన్న మహిళలందరికీ ధన్యవాదాలు. స్కూల్ ఎడ్యుకేషన్ కంటే కూడా కామిక్ బుక్స్, కథల పుస్తకాలను చదివించి నా క్రియేటివిటీని పెంచిన మా అమ్మ రాజనందినికి, నన్ను బెస్ట్ వెర్షన్‌గా మార్చుకోవడంలో ప్రోత్సహించిన తల్లి లాంటి మా వదిన శ్రీవల్లికి, నా సినిమాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేయడంతో పాటు నా లైఫ్‌ని డిజైన్ చేసిన నా భార్య రమకు (తను లేకపోతే నేనిక్కడ లేను), చిరునవ్వుతో నా జీవితం ముందుకెళ్లేలా తోడ్పడే నా కూతుళ్లకు ధన్యవాదాలు. ఫైనల్‌గా నా దేశం ఇండియా.. మేరా భారత్ మహాన్.., జైహింద్'' అంటూ సలాం చేశారు దర్శకుడు రాజమౌళి. అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో జరిగిన 'ఫిలిం క్రిటిక్స్ చాయిస్ అవార్డ్స్'లో 'ఆర్ఆర్ఆర్' చిత్రం రెండు (బెస్ట్ ఫారిన్ ఫిల్మ్, బెస్ట్ సాంగ్) విభాగాల్లో అవార్డులను దక్కించుకుంది. ఈ అవార్డు అందుకున్న అనంతరం రాజమౌళి పై విధంగా ప్రసంగించారు. ఇక ఇటీవల గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ స్కోర్' విభాగంలో 'ఆర్ఆర్ఆర్‌లోని 'నాటు నాటు' పాటకు అవార్డు వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు 'ఫిలిం క్రిటిక్స్ చాయిస్ అవార్డ్స్'లోనూ ఈ పాటకు అవార్డు సొంతం చేసుకున్నారు చిత్ర సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి. ఈ సందర్భంగా మాట్లాడుతూ– ''జాస్' సినిమా చూసినప్పుడు నేనో పాఠం నేర్చుకున్నాను. షార్క్ దగ్గరికి వచ్చినప్పుడల్లా ప్రమాదం సూచించే విధంగా ఓ సంకేతం ఉంటుంది. అక్కడ రిచ్ ఆర్కెస్ట్రెషన్‌తో మెలోడీ మ్యూజిక్‌ని ఆశించాను, కానీ నిరాడంబరంగా, స్మూత్ మ్యూజిక్‌ని ఇచ్చారు జాన్ విలియమ్స్. నాకు నిరాడంబరత, వినయం తాలూకు పాఠం నేర్పి, ఇన్నేళ్లుగా నాకు స్ఫూర్తిగా నిలిచినందుకు థ్యాంక్స్ జాన్ విలియమ్స్ సార్'' అన్నారు కీరవాణి. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య 'ఆర్ఆర్ఆర్'ని నిర్మించిన విషయం తెలిసిందే.



నమ్మలేకపోతున్నాను

- రాజమౌళి



జేమ్స్ కామెరూన్, రాజమౌళి



రాజమౌళి

అవార్డు వేడుకలో ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ పాల్గొన్నారు. ఈ వేడుక ప్రాంగణంలో కామెరూన్‌ని కలిశారు రాజమౌళి. ''గొప్ప దర్శకులు జేమ్స్ కామెరూన్ 'ఆర్ఆర్ఆర్' సినిమాను చూశారు. ఆయనకు ఈ సినిమా ఎంతో నచ్చడంతో, తన భార్య సుజీని చూడమని సిఫార్సు చేసి, ఆమెతో కలిసి రెండోసారి 'ఆర్ఆర్ఆర్' సినిమాను చూశారు. మా సినిమా (ఆర్ఆర్ఆర్)ను విశ్లేషిస్తూ మీరు (జేమ్స్ కామెరూన్) మాతో పది నిమిషాలు మాట్లాడదాన్ని నేను నమ్మలేకపోతున్నాను. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి దర్శకుల్లో నేనూ ఉన్నానన్నట్లుగా మీరు (కామెరూన్) చెప్పారు. మాతో పది నిమిషాల సమయాన్ని గడిపినందుకు, నన్ను ప్రశంసించినందుకు ధన్యవాదాలు'' అని సోమవారం ట్వీట్ చేశారు రాజమౌళి. ఇక ఈ సంగతి ఇలా ఉంచితే... లాస్ ఏంజెల్స్ వేదికగా ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో హాలీవుడ్‌కు చెందిన మరో ప్రముఖ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్‌ను రాజమౌళి, కీరవాణి కలిసి కాసేపు ముచ్చటించిన సంగతి తెలిసిందే.

షూటింగ్‌లో ప్రమాదం

సోమవారం రెండు షూటింగ్ లొకేషన్స్‌లో రెండు ప్రమాదాలు జరిగాయి. ఒకటి హైదరాబాద్‌లో జరుగుతున్న 'ది వాక్సిన్ వార్' షూటింగ్ సెట్. ఈ షూటింగ్‌లో నటి, నిర్మాతల్లో ఒకరైన పల్లవీ జోషి గాయపడ్డారు. రెండోది మలేసియా. ఈ షూటింగ్‌లో హీరో విజయ్ ఆంటోని గాయపడ్డారు. ఆ వివరాల్లోకి వెళితే...



● పల్లవీ జోషి, విజయ్ ఆంటోని

కారు ఢీకొట్టడంతో పల్లవీకి గాయాలు

దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి రూపొందిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ది వాక్సిన్ వార్'. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్ శివార్లలో వేసిన సెట్‌లో జరుగుతోంది. ఓ సన్నివేశం చిత్రీకరిస్తుండగా కారు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో పల్లవీ జోషికి గాయాలు కావడంతో సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స అందించారు. అయితే చేస్తున్న సన్నివేశం పూర్తి చేశాకే పల్లవి ఆస్పత్రికి వెళ్లారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగుందని, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చిత్రబృందం తెలిపింది. ఐ యామ్ బుద్ధ ప్రొడక్షన్ పతాకం పై పల్లవీ జోషి 'ది వాక్సిన్ వార్' చిత్రాన్ని నిర్మించడంతో పాటు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. 'ది కాశ్మీర్ ఫైల్స్' కోసం వివేక్ అగ్నిహోత్రితో కలిసి పని చేసిన అభిషేక్ అగర్వాల్ తన అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌లో ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

బోట్ ప్రమాదంలో గాయపడిన విజయ్ ఆంటోని: 'బిచ్చగాడు' సినిమాతో పాపులర్ అయిన హీరో విజయ్ ఆంటోని తీవ్రంగా గాయపడ్డారు. 'బిచ్చగాడు'కి సీక్వెల్‌గా ఆయన హీరోగా నటిస్తున్న 'బిచ్చగాడు 2' షూటింగ్ మలేసియాలో జరుగుతోంది. ఈ చిత్రానికి విజయ్ ఆంటోనియే దర్శకుడు. ఈ చిత్రం షూటింగ్‌లో భాగంగా వాటర్ బోట్‌లో ప్రయాణిస్తుండగా ఆ బోట్ హఠాత్తుగా కెమెరా ఉన్న మరో పడవలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విజయ్ ఆంటోనీని వెంటనే అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స అందిస్తున్నారు.

ప్రముఖ రచయిత బాలమురుగన్ కన్నుమూత



సీనియర్ కథా రచయిత బాలమురుగన్ (86) ఆదివారం ఉదయం చెన్నైలో కన్నుమూశారు. తమిళంతో పాటు తెలుగు, హిందీ తదితర భాషా చిత్రాలకు కథ, మాటలను అందించారాయన. తమిళనాడులోని ఆండిపట్టికి చెందిన బాలమురుగన్ అసలు పేరు సుందర పాండియన్. నటనపై ఆసక్తితో చిన్న వయసులోనే శక్తి నాటక సభ బృందంలో చేరి నాటకాల్లో నటించడం ప్రారంభించారు. 'కుమర గురు' అనే నాటకంలో బాల మురుగన్‌గా నటించి ప్రశంసలు అందుకున్నారు. అప్పటి నుంచి ఆయన పేరు బాలమురుగన్‌గా స్థిరపడిపోయింది. 13 ఏళ్ల వయసులోనే 'కల్ శిలై' అనే నాటకాన్ని రాసి. తానే నటుడుగా రంగ ప్రవేశం చేశారు. ఆయన నటించిన టిప్పు సుల్తాన్, మరుదు పాండియర్ నాటకాలు బాగా ప్రాచుర్యం పొందాయి. 'టిప్పు సుల్తాన్' నాటకాన్ని తిలకించి, బాలమురుగన్ నటనను అప్పటి ప్రముఖ నటుడు ఎంజీఆర్ ఎంతగానో కొనియాడారు. శివాజీ గణేషన్ చిత్రాలకు బాలమురుగన్ ఎక్కువగా కథ, మాటలు అందించారు. అదే విధంగా తెలుగులో ఎన్.టి. రామారావు, కృష్ణ, శోభన్‌బాబు వంటి ప్రముఖ కథానాయకులకు, హిందీలో రాజేష్ ఖన్నా, ధర్మేంద్ర వంటి స్టార్స్ చిత్రాలకు కథలు అందించారు. బాలమురుగన్ కథ అందించిన తెలుగు చిత్రాల్లో 'ధర్మ దాత, అదృష్ట జాతకుడు, కోడలు పిల్ల, బంట్రోతు భార్య, సోగ్గాడు, ఆలుమగలు, జీవన తీరాలు, పుణ్యం కొద్దీ పురుషుడు, భార్యాభర్తలు వంటివి ఉన్నాయి. 1969లో ఆయన మాటలు అందించిన 'దేవరిన్ తునైవన్' చిత్రానికిగానూ తమిళ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ మాటల రచయిత అవార్డుతో సత్కరించింది. తమిళంలో 'రామన్ ఎత్తనై రామనడి', 'పట్టికాడా పట్టణమా' చిత్రాలకుగాను జాతీయ అవార్డును అందుకున్నారు. బాలమురుగన్ భార్య పదేళ్ల క్రితం కన్నుమూశారు. ఈ దంపతులకు నలుగురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కుమారుడు భూపతి రాజా సినిమా పరిశ్రమలో రచయితగా కొనసాగుతున్నారు. బాలమురుగన్ మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

సస్పెన్స్ లవ్‌స్టోరీ



● తలసాని, ఆకుల అఖిల్

ఆకుల అఖిల్, దర్శక మీనన్, 'చిత్రం' శ్రీను, 'జబర్దస్త్' గడ్డం నవీన్, 'జబర్దస్త్' చిట్టిబాబు, రేవతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బాలుగాడి లవ్ స్టోరీ'. యల్. శ్రీనివాస్ తేజ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ ఆకుల మంజుల నిర్మిస్తున్న చిత్రం ఇది. ఒక పాట మినహా ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రం టీజర్‌ను తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ రిలీజ్ చేసి, చిత్రం యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. అనంతరం ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేసిన దర్శకుడు సముద్ర మాట్లాడుతూ– ''టీజర్ బాగుంది. మంచి కాన్సెప్ట్, కథ ఉన్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి'' అన్నారు. ''మంచి కథతో వస్తున్నాం. ఈ సినిమా హిట్‌ని మా తల్లిదండ్రులకు గిఫ్ట్‌గా ఇవ్వాలనుకుంటున్నాను'' అన్నారు ఆకుల అఖిల్. ''లవ్, సస్పెన్స్ అంశాలతో కూడిన చిత్రం ఇది. బ్యాలెన్స్ ఉన్న స్పెషల్ సాంగ్‌ను త్వరలోనే పూర్తి చేసి, మార్చిలో సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు దర్శక–నిర్మాతలు.

థ్రిల్లింగ్ అథర్వ



● కార్తీక్ రాజు

కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మిస్తున్నారు. నేడు కార్తీక్ రాజు బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ''క్రైమ్, థ్రిల్లింగ్, ఎమోషన్స్.. ఇలా అన్ని జానర్లను టచ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ చివరి దశలో ఉన్నాయి. త్వరలోనే టీజర్, ట్రైలర్‌ను రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

మేకల క్షేత్రమే శిక్షణా కేంద్రం

- మేకల పెంపకంలో మార్గదర్శకుడు మూల మహేందర్‌రెడ్డి
- మేకలు, నాటు కోళ్ల పెంపకంలో ఏడాదికి రూ. 8-9 లక్షల నికరాదాయం
- ప్రతి శనివారం ఫామ్ దగ్గరే రైతులకు ఉచిత శిక్షణ
- రైతులు, అధికారుల క్షేత్ర పర్యటనలకు వేదికగా మారిన మహేందర్‌రెడ్డి ఫామ్



● మహేందర్ రెడ్డి

మేకల పెంపకంలో పదేళ్ల అనుభవంతో స్థిరమైన నికరాదాయం పొందుతూ.. జీవాల పెంపకంపై ఆసక్తి చూపే రైతులకు మార్గదర్శిగా నిలిచారు మూల మహేందర్ రెడ్డి. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం సింగప్పగూడ గ్రామంలో పాక్షిక సాంద్ర పద్ధతిలో ఆయన మేకలతో పాటు నాటు కోళ్లను పెంచుతూ మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. అంతేకాదు ఉచితంగా శిక్షణ ఇస్తూ వందలాది మంది రైతులకు తోడ్పాటునందిస్తున్నారు. జీవాల పెంపకంపై పూర్తి అవగాహన కలిగించుకొని, మక్కువతో పెంపకం చేపడితే వంద శాతం లాభాలు పొందుతారని నిక్కచ్చిగా చెబుతున్నారాయన.

రైతు కుటుంబంలో పుట్టిన మహేందర్‌రెడ్డి బీఎస్సీ చదివి, కొంతకాలం బోర్‌వెల్ రంగంలో పనిచేశారు. 2005లో 14 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి వ్యవసాయం ప్రారంభించారు. తదనంతర కాలంలో వ్యవసాయంతోపాటు జీవాల పెంపకం కూడా తోడైతేనే నిరంతరం రైతుకు ఆదాయం వస్తుందని గ్రహించిన ఆయన మేకల పెంపకం వైపు దృష్టి సారించారు. ప్రభుత్వ పరంగా ఎలాంటి శిక్షణ, ప్రోత్సాహకాలు లేకపోవటంతో సొంతంగానే అనేక రాష్ట్రాల్లో తిరిగి పరిశోధన చేశారు.

గోట్ ఫార్మింగ్ పరిజ్ఞానం కోసం ఆయన పడిన కష్టం అంతా ఇంతా కాదు. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సొంత ఖర్చులతో పర్యటించారు. స్థానిక రైతులను కలిసి వారి అనుభవాలను తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో సక్సెస్ సాధిస్తామనే ధీమా ఎవరూ కల్పించలేకపోయారు. అయినా వెనకడుగు వేయకుండా పట్టుదలతో మేకల పెంపకం చేపట్టారు.

మేకల రైతుల సేవలో..

నా ఫామ్‌లో 250 మేకలున్నాయి. వీటి పెంపకానికి మొత్తం 4 ఎకరాల భూమిని ఉపయోగిస్తున్నా. ముగ్గురికి ఉపాధి కల్పిస్తూ 250 మేకలను పెంచుతున్నా. మేకల పెంపకంతోపాటు నాటు కోళ్ల పెంపకం చేపట్టా. 20 కోళ్లతో ప్రారంభించా. ఇప్పుడు 100కు చేరాయి. వీటిని 500లకు పెంచేందుకు కృషి చేస్తున్నా. మేకలు, కోళ్ల పెంపకానికి మొత్తంగా ఏడాదికి ఈ సుమారు రూ. 6 లక్షల ఖర్చు అవుతుంటే దాదాపు రూ. 14–15 లక్షల ఆదాయం వస్తున్నది. ఖర్చులు పోను ఏడాదికి సుమారు రూ. 8–9 లక్షల నికరాదాయం సంపాదిస్తున్నా. నా అనుభవాలను అందరికీ అందించి సహాయ పడాలనే ఆలోచనతో ఏడేళ్లుగా ప్రతి శనివారం ఉచితంగా ఫామ్ దగ్గరే రైతులకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నా. వారికి ఎప్పుడు ఏ సమాచారం కావాల్సినా ఫోన్‌లో అందిస్తూ వస్తున్నా. నాకు అవకాశం ఉన్నంత వరకు ఈ సేవ కొనసాగిస్తునే ఉంటాను. రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తా. ఏడాదిలో 365 రోజులూ మేక మాంసానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంటుంది. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజల అవసరాలకు ప్రతి రోజు సగటున 7–8 వేల మేకల అవసరం ఉంటుందని అంచనా. ప్రభుత్వపరంగా కూడా జీవాల పెంపకంలో శిక్షణ ఇచ్చే ఏర్పాటు చేయాలి. మేకల పెంపకంపై అవగాహన, ఇష్టమే విజయ సోపానమవుతుంది.

- మూల మహేందర్‌రెడ్డి (8008639618),
ఆదర్శ మేకల పెంపకందారుడు,
సింగప్పగూడ, చేవెళ్ల మం., రంగారెడ్డి జిల్లా

ఎకరంలో షెడ్లు, మూడెకరాల్లో మేత...

ప్రభుత్వ సబ్సిడీ పథకాలు సైతం లేక సొంతం గానే 2013లో 65 మేకలతో పాక్షిక సాంద్ర పద్ధతిలో మహేందర్‌రెడ్డి మేకల పెంపకం ప్రారంభించారు. రూ. 13 లక్షలు ఖర్చు చేసి ఎకరం విస్తీర్ణంలో షెడ్లు నిర్మించారు. మహేందర్‌రెడ్డి మూడేళ్లు కష్టపడి మేకల సంఖ్యను 250కు పెంచారు. 1 ఎకరంలో షెడ్లు, నివాస భవనం నిర్మించారు. షెడ్డులో మేకలను నేలపైన కాకుండా.. మీటరు ఎత్తున చెక్కలతో ప్లాట్‌ఫామ్‌ను నిర్మించి, దానిపై మేకలు విశ్రమించేలా ఏర్పాటు చేశారు. పెంటికలు చెక్కల సందుల్లో నుంచి నేల మీద పడిపోతాయి. మేకలకు గాలి, వెలుతురు చక్కగా తగులుతుంది. షెడ్‌కు పక్కనే చుట్టూ ఇనుప కంచెతో దొడ్డిని ఏర్పాటు చేశారు. మేకలు అక్కడ ఆరుబయట ఎండలో తిరుగుతూ మేత మేస్తాయి. మరో మూడు ఎకరాలు మేకలకు కావాల్సిన పచ్చిగడ్డి సాగుకు ఉపయోగిస్తున్నారు. ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్నారు. ఖర్చులు పోను నెలకు రూ. 65–75 వేల నికరాదాయం, ఏడాదికి రూ. 8–9 లక్షల నికరాదాయం పొందుతూ మేకల పెంపకంలో పదేళ్లుగా ఆదర్శంగా నిలుస్తున్నారు.



● ఎలివేటెడ్ షెడ్‌లో విశ్రమిస్తున్న మేకలు



● ఫామ్ వద్ద ఉచితం శిక్షణ తరగతులు

ప్రతి శనివారం ఉచిత శిక్షణ

మేకల పెంపకానికి ముందుకొచ్చే వారికి ఇప్పటికీ ప్రభుత్వపరంగా శిక్షణా కేంద్రాలు అందుబాటులో లేవు. ఈ లోటు భర్తీ చేయడానికి మహేందర్‌రెడ్డి సేవా భావంతో ముందుకొచ్చారు. సీనియర్ రైతుగా తన అనుభవాలను పంచాలనే ఆలోచనతో ప్రతి శనివారం తన ఫామ్ దగ్గరే ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన పద్ధతులను 3 గంటల పాటు సవివరంగా బోధిస్తున్నారు. ఆయన పట్టుదల, నైపుణ్యం గుర్తించిన వెటర్నరీ శాఖ ఔత్సాహిక రైతులను ఆయన ఫామ్‌కు క్షేత్రపర్యటనకు తీసుకురావటం ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి రైతులు, అగ్రి, ఫుడ్ బిజినెస్ విద్యార్థులు ఆయన వద్ద అనుభవపాఠాలు నేర్చుకుంటున్నారు. వెటర్నరీ ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు కోకొల్లలు. వ్యవసాయ కళాశాలలో అనేక సదస్సుల్లో ఆయన సుసంపన్నమైన తన అనుభవాలను పంచుతూ ఉంటారు. 2015లో రైతునేస్తం, 2016లో సీఆర్ఐడీఏ, 2018లో ఐసీఏఆర్ ఉత్తమ ఇన్నోవేటివ్ ఫార్మర్ పురస్కారాలు లభించాయి.

– ఎస్.రాకేశ్, సాక్షి, చేవెళ్ల, రంగారెడ్డి జిల్లా

మేకల పెంపకంలో మెలకువలు

కొత్తగా గోట్ ఫార్మింగ్ చేపట్టే రైతులకు మహేందర్‌రెడ్డి చెబుతున్న సూచనలు:

- ఒక మేక సగటున రెండేళ్లలో మూడు ఈతల్లో ఈతకు రెండు పిల్లల చొప్పున ఇస్తుంది. ఒక మేక పిల్ల అమ్మకానికి రావడానికి 6 నుంచి 8 నెలల సమయం పడుతుంది. చిన్న పిల్లల పోషణను అశ్రద్ధ చేయకుండా మరణాల రేటు తగ్గించాలి.
- కనీసం 25 కేజీల బరువు ఉన్న మేకలనే అమ్ముకోవాలి. మార్కెటింగ్‌లో జీవాలను ఫారంలోనే అమ్ముకోవటం లాభాదాయకంగా ఉంటుంది. నాణ్యమైన మేకల పెంపకమే నోటి ప్రచారంగా పని చేస్తుంది.
- మేకల పెంపకాన్ని యాంత్రికంగా కాకుండా మనసుపెట్టి ఇష్టంగా చేస్తేనే వంద శాతం సక్సెస్ చేకూరుతుంది.
- ముందు జాగ్రత్త చర్యలను, యాజమాన్య మెలకువలు మక్కువతో పాటిస్తే.. 90 శాతం మందులు లేకుండానే మేకల సంతతిని పెంచుకుంటూ పోవచ్చు.
- మేలు రకం మేకల ఉత్పత్తితోనే లాభాలు వస్తాయి. మేకల ఉత్పత్తిలో తల్లి, తండ్రి మేకల నాణ్యత ముఖ్యం.
- పోషక విలువలు ఉండే నాణ్యమైన మేతలను మేకలకు కడుపు నిండా అందించటంతో నాణ్యమైన మేకల ఉత్పత్తి ద్వారా అధిక లాభాలు సాధ్యం.
- సాంద్ర పద్ధతిలో మేకల పెంపకం ఎంతో మేలు. సగం ఎండు మేత, సగం పచ్చి మేతలను అందించాలి.
- ఇరుకుగా కాకుండా అవసరమైన విస్తీర్ణం మేరకు షెడ్ల నిర్మాణం, పరిశుభ్రత, చూడి మేకల, పిల్లల పోషణలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎలివేటెడ్ షెడ్లు నిర్మించాలి. సీజన్‌కు తగిన రీతిలో షెడ్ల నిర్వహణ ఉండాలి.
- మేకల పెంపకంలో రైతు సక్సెస్ కావాలంటే ఎట్టి పరిస్థితుల్లో యాజమాన్య లోపం రానివ్వ కూడదు. జీవాలకు పోషక విలువలతో కూడిన మేతను కమం తప్పకుండా అందించాలి.

సాగుబడి
ఉత్తరాషాఢ కార్తె : జనవరి 23 వరకు
శ్రావణ కార్తె : 24 నుంచి

రోగాలకు రెడ్ సిగ్నల్!



● 'జీపీటీ 2858' పేరిట సన్నని ఎరుపు వరి వంగడానికి రూపకల్పన
● ఐరన్, జింకు, మాంసకృత్తులు అధికం

అధిక పోషక విలువలతో పాటు రోగ నిరోధక శక్తిని పెంపొందించే సేంద్రియ/ప్రకృతి వ్యవసాయంలో పండించిన దేశవాళీ వరి రకాల బియ్యానికి ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోంది. సంప్రదాయ బ్రీడింగ్ పద్ధతుల్లోనే దేశవాళీ వంగడాల్లో పౌష్టికాంశాలతో కూడిన బీపీటీ సన్న వరి రకాల రూపకల్పనపై బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు 2012 నుంచే దృష్టి కేంద్రీకరించారు. 'బీపీటీ బ్లాక్ రైస్' వంగడాలను గత ఏడాదే అధికారికంగా విడుదల చేసి, రైతులకు విత్తనాలను విస్తారంగా అందిస్తున్నారు.

ఈ నేపథ్యంలో 'బీపీటీ రెడ్ రైస్ 2858' వంగడాన్ని శాస్త్రవేత్తలు రూపొందించారు. దీని పంటకాలం 135 రోజులు. తుపాన్లకు పడి పోదు. దోమ, అగ్గితెగులు, ఆకు ముడత, ఆకు ఎండు తెగుళ్లను తట్టుకుంటుంది. కంకి ముద్దగా వస్తుంది. ఒక కంకిలో 500 నుంచి 600 వరకు గింజలు ఉంటాయి. బీపీటీ 5204 కన్నా సన్న రకం. బీపీటీ 2858 రెడ్ రకం వెయ్యి గింజల బరువు 12 గ్రాములు. నాణ్యతా ఎక్కువే. దేశవాళీ రెడ్ రైస్ దిగుబడి 10 బస్తాలకు మించదు. బీపీటీ రెడ్ రైస్ ఎకరాకు 30 బస్తాలకు తగ్గదని శాస్త్రవేత్తలు చెపుతున్నారు. ఈ రకం రెడ్ రైస్ ధాన్యం పై పొట్టు మామూలుగానే ఉంటుంది. కానీ, బియ్యం నల్లగా ఉంటాయి. బియ్యం పై పొరలో 'ప్రోయాంతో సైనిడిన్' అనే పదార్థం ఉండడం వల్ల వాటికి ఎర్ర రంగు వచ్చింది. అందుకని, ముడి బియ్యాన్నే తినాలి. ఇందులో ఐరన్, జింకు, ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. సాధారణ బియ్యంతో పోలిస్తే రెండు రెట్లు అధికం. యాంటీ ఆక్సిడెంట్లు మూడు నుంచి నాలుగు రెట్లు అధికం. అధికంగా 10.5 శాతం మాంసకృత్తులు ఉన్నాయి. టోటల్ ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్ సాధారణ రకాలతో పోలిస్తే రెండు రెట్లు అధికం. శరీరంలో ఉత్పత్తయ్యే ఫ్రీరాడికల్స్‌ను ఇవి సమతుల్యం చేసి రోగనిరోధక శక్తిని ఇనుమడింపజేస్తాయి. రెడ్ రైస్‌లో బీపీటీ 2858తో పాటు బీపీటీ 3143, 3182, 3140, 3111, 3507 రకాలను సైతం రూపొందిస్తుండటం విశేషం.



– బిజివేముల రమణారెడ్డి,
సాక్షి ప్రతినిధి, బాపట్ల

ఎర్ర బియ్యం ఎంతో ఆరోగ్యం

జీపీటీ 2858 రెడ్‌రైస్ విత్తన మినీకిట్లను ఈ ఏడాది జూన్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ వ్యవసాయశాఖ జేడీఏలు, డాట్ సెంటర్లలో పంపిణీ చేస్తారు. మూడు సంవత్సరాల మినీకిట్ దశను వచ్చే ఏడాది పూర్తిచేసి, ఆ తరువాత అధికారికంగా విడుదల చేస్తాం. జీపీటీ 2858 రెడ్‌రైస్ దీర్ఘకాలిక రోగాలను ఎదుర్కొనే పుష్టిని కలిగిస్తుంది. మనుషుల ఆరోగ్య రక్షణకు అత్యంత అనుకూలమైన రకం.



- బి.కృష్ణవేణి,
సీనియర్ శాస్త్రవేత్త – అధిపతి,
వ్యవసాయ పరిశోధనా కేంద్రం, బాపట్ల

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్



'మళ్లీ మైదానంలో కలుద్దాం'

కారు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఈ కష్ట సమయంలో తనకు మద్దతుగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు చెప్పాడు. ప్రమాదం తర్వాత తొలిసారి తన ట్విటర్ అకౌంట్ ద్వారా స్పందిస్తూ... 'నా శస్త్రచికిత్స విజయవంతమైందని చెప్పటం ఆనందంగా ఉంది. కోలుకునే ప్రక్రియ మొదలైంది. రాబోయే సవాళ్లకు సిద్ధంగా ఉన్నా. అండగా నిలిచిన అభిమానులు, జట్టు సహచరులు, డాక్టర్లకు కృతజ్ఞతలు. మళ్లీ మైదానంలో కలుద్దాం' అని వ్యాఖ్యానించాడు.

పంజాబ్ కింగ్స్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా...



ఈ ఏడాది ఐపీఎల్ టి20 టోర్నీలో పంజాబ్ కింగ్స్ జట్టుకు భారత మాజీ క్రికెటర్ సునీల్ జోషి స్పిన్ బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. కర్ణాటకకు చెందిన 52 ఏళ్ల సునీల్ జోషి భారత జట్టు తరఫున 1996 నుంచి 2001 మధ్య కాలంలో 15 టెస్టులు ఆడి 41 వికెట్లు... 69 వన్డేలు ఆడి 69 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు తరఫున ఆడిన సునీల్ జోషి గతంలో హైదరాబాద్ రంజీ జట్టుకు కోచ్‌గా కూడా పనిచేశాడు.

రూ. 951 కోట్లు...

- భారీ మొత్తానికి మహిళల ఐపీఎల్ మీడియా హక్కులు విక్రయం
- సొంతం చేసుకున్న వయాకామ్ 18
- ఈ ఏడాది మార్చిలో డబ్ల్యూఐపీఎల్



న్యూఢిల్లీ: మహిళల ఇండియన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఐపీఎల్) కొబ్బరికాయ కొట్టకముందే కోట్లు కొల్లగొట్టింది. ప్రత్యక్ష ప్రసార హక్కులు (మీడియా రైట్స్) ఎవరూ ఊహించనంత ధర పలికాయి. ఏకంగా రూ. 951 కోట్లు ప్రసార హక్కుల ద్వారానే వచ్చాయి. ఫ్రాంచైజీల రేసులో పురుషుల ఐపీఎల్ యాజమాన్యాలే ఉండటం, కార్పొరేట్ల కన్ను మహిళల ఆటపై కూడా పడటం చూస్తుంటే ఇక ముందు ముందు ఇంకెన్ని కోట్లు కురుస్తాయో చెప్పలేం. ఇంకా... టైటిల్ స్పాన్సర్‌షిప్, ఫ్రాంచైజీ నగరాల కైవసంతో బోర్డు ఖజానాలో మరికొన్ని కోట్లు వచ్చిపడనున్నాయి. మొత్తానికి భారత్ అమ్మాయిల మెరుపులు కూడా ప్రపంచం దృష్టిని ఆకర్షించేందుకు సిద్ధమయ్యాయి. ఈ ఏడాది మార్చిలో ఐదు జట్లతో తొలి డబ్ల్యూఐపీఎల్ టి20 టోర్నీ జరగనుంది. కొన్నేళ్లుగా బీసీసీఐ పురుషుల ఐపీఎల్ టోర్నీ చివర్లో మూడు జట్లతో మహిళల టి20 చాలెంజ్ టోర్నీని (నాలుగు మ్యాచ్‌లు) నిర్వహిస్తోంది. అయితే వెస్టిండీస్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లలో ప్రత్యేకంగా మహిళలకు టి20 లీగ్‌లు జరుగుతుండటంతో భారత్‌లోనూ ప్రత్యేకంగా డబ్ల్యూఐపీఎల్ నిర్వహించాలని డిమాండ్ పెరగడంతో ఈ ఏడాది అది కార్యరూపం దాల్చనుంది.

మ్యాచ్‌కు రూ. 7 కోట్ల 9 లక్షలు

ఐదేళ్ల పాటు 2023–27 సీజన్లకు సంబంధించిన మీడియా రైట్స్‌ను వేర్వేరు రీజియన్ల వారిగా కాకుండా గ్లోబల్ (వరల్డ్ వైడ్)గా కట్టబెట్టింది. దీన్ని రూ. 951 కోట్లకు బిడ్ వేసిన 'వయాకామ్ 18' దక్కించుకుంది. అన్నీ తన వద్దే ఉండాలని పోటీపడిన 'స్టార్ నెట్‌వర్క్'కు శృంగభంగం తప్పలేదు. బరిలో ప్రముఖ బ్రాడ్‌కాస్టర్ సోనీ సంస్థ ఉన్నప్పటికీ రిలయన్స్‌కు చెందిన 'వయాకామ్ 18' గ్లోబల్ మీడియా రైట్స్‌ను చేజిక్కించుకుంది. అంటే మ్యాచ్‌కు రూ. 7 కోట్ల 9 లక్షలు చొప్పున బీసీసీఐ ఖాతాలో పడనున్నాయి. టీవీ, డిజిటల్, ఉమ్మడి (ఈ రెండు కలిపి) మూడు కేటగిరీలుగా బిడ్లను ఆహ్వానించగా, వయాకామ్ ఉమ్మడి హక్కులు కైవసం చేసుకోవడంతో 'స్టార్ నెట్‌వర్క్'కు నిరాశ ఎదురైంది. సుమారు రూ.వెయ్యి కోట్లు అమ్మాయిల లీగ్‌కు రావడం పట్ల బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, దిగ్గజ క్రికెటర్లు వీవీఎస్ లక్ష్మణ్, మిథాలీ రాజ్, జులన్ గోస్వామి హర్షం వ్యక్తం చేశారు.

వయాకామ్ కొత్తకాదు

ఐపీఎల్ ప్రసార హక్కులు వయాకామ్‌కు కొత్తకాదు. గతేడాది తెరమీదికి వచ్చిన ఈ 'బ్రాడ్‌కాస్టింగ్' సంస్థ పురుషుల ఐపీఎల్ లీగ్‌లో రూ.23,758 కోట్లతో డిజిటల్ రైట్స్‌ను, రూ. 1058 కోట్లతో ఆస్ట్రేలియా–న్యూజిలాండ్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా మూడు రీజియన్లకు సంబంధించిన డిజిటల్, టీవీ రైట్స్‌ను సొంతం చేసుకుంది. దీంతో 'డిస్నీ స్టార్ నెట్‌వర్క్' కేవలం టీవీ రైట్స్‌కే పరిమితమైంది.

కింగ్ కోహ్లి జోర్దార్...

భారత్ తీన్‌మార్...

ఒక్కసారి ఆ పరుగుల ప్రవాహం మొదలైందంటే అతడిని ఆపడం ఎవరి వల్లా కాదని మరోసారి రుజువైంది. పరుగులు, రికార్డులను చూసీ చూసీ క్రికెట్ ప్రపంచం అలసిపోతోంది కానీ అతను మాత్రం కాదు. మంచినీళ్ల ప్రాయంలా అనడం కూడా చిన్న మాటనే! తనకే సాధ్యమైన అద్భుతమైన షాట్లు అలవోకగా కొడుతూ విరాట్ కోహ్లి కెరీర్‌లో 46వ శతకంతో చెలరేగాడు. సెంచరీల సెంచరీ దిశగా మరో అడుగు ముందుకేశాడు. తొలి వన్డేతో పోలిస్తే ఈ సారైతే చెమట చుక్క చిందించకుండా భారీ స్కోరుతో చెలరేగిపోయాడు. మరోవైపు సెంచరీతోనే యువ శుబ్‌మన్ గిల్ తన సత్తా ప్రదర్శించాడు. ఫలితంగా వన్డే క్రికెట్ చరిత్రలోనే భారత్ ఖాతాలో అతి పెద్ద విజయం చేరగా... పేలవ ఆటతో శ్రీలంక జట్టు చిత్తయి సిరీస్‌ను 0–3తో కోల్పోయింది.

- చివరి వన్డేలో టీమిండియా 'రికార్డు' విజయం
- 317 పరుగులతో శ్రీలంక చిత్తు
- కోహ్లి, గిల్ సెంచరీలు
- సిరాజ్‌కు నాలుగు వికెట్లు
- 3–0తో సిరీస్ క్లీన్‌స్వీప్



తిరువనంతపురం: శ్రీలంకతో వన్డే సిరీస్‌ను భారత్ భారీ విజయంతో ముగించింది. ఆదివారం జరిగిన చివరి వన్డేలో టీమిండియా 317 పరుగుల తేడాతో లంకను ఓడించింది. పరుగుల పరంగా వన్డే క్రికెట్ చరిత్రలో ఇదే అతి పెద్ద విజయం. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 390 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' విరాట్ కోహ్లి (110 బంతుల్లో 166 నాటౌట్; 13 ఫోర్లు, 8 సిక్సలు), శుబ్‌మన్ గిల్ (97 బంతుల్లో 116; 14 ఫోర్లు, 2 సిక్సలు) సెంచరీలు సాధించారు. అనంతరం లంక 22 ఓవర్లలో 73 పరుగులకే కుప్పకూలింది. నువనిడు (19)దే అత్యధిక స్కోరు. హైదరాబాద్ బౌలర్ సిరాజ్ (4/32) ప్రత్యర్థిని దెబ్బకొట్టగా... కుల్దీప్, షమీ చెరో 2 వికెట్లు తీశారు. తాజా ఫలితంతో సిరీస్ 3–0తో భారత్ సొంతమైంది. రేపటి నుంచి న్యూజిలాండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌లో భారత్ బరిలోకి దిగుతుంది.

గిల్ బౌండరీల జోరు...


గిల్ సెంచరీ అభివాదం

తొలి మూడు ఓవర్లలో వచ్చింది 5 పరుగులే... ఇది చూస్తే పిచ్ స్వభావంపై సందేహాలు వచ్చాయి. అయితే అసలు ఆట ఆ తర్వాత మొదలైంది. కుమార ఓవర్లో రోహిత్ శర్మ (49 బంతుల్లో 42; 2 ఫోర్లు, 3 సిక్సలు) సిక్స్‌తో మొదలు పెట్టగా... గిల్ వరుసగా 4 ఫోర్లు బాది తానేంటో చూపించాడు. ఆ తర్వాత రజిత ఓవర్లోనూ వరుసగా 6, 6, 4 కొట్టి దూకుడు పెంచిన రోహిత్ అదే జోరులో ఆడబోయి బౌండరీ వద్ద చిక్కాడు. అనంతరం 52 బంతుల్లో గిల్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. గిల్, కోహ్లి భాగస్వామ్యంలో భారత్ దూసుకుపోయింది. వీరిద్దరు చక్కటి సమన్వయంతో ఆడుతూ ఒకరితో మరొకరు పోటీ పడి చకచకా పరుగులు సాధించారు. నువనిడు ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి 90ల్లోకి చేరుకున్న గిల్... అతని తర్వాతి ఓవర్లో లాంగాన్ దిశగా సింగిల్ తీసి కెరీర్‌లో రెండో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తర్వాతా తగ్గకుండా వాండర్సె ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన అతను, రజిత బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడబోయి క్లీన్‌బౌల్డ్ కావడంతో చక్కటి ఇన్నింగ్స్ ముగిసింది.

విరాట్ విశ్వరూపం...

48 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న కోహ్లి... గిల్ అవుటయ్యే సమయానికి 58 పరుగుల వద్ద ఉన్నాడు. మరోవైపు నుంచి శ్రేయస్ అయ్యర్ (32 బంతుల్లో 38; 2 ఫోర్లు, 1 సిక్స్) కూడా కోహ్లికి తగిన సహకారం అందించాడు. 40వ ఓవర్ ముగిసేసరికి కోహ్లి స్కోరు 82 పరుగులు కాగా... 9 ఫోర్లే కొట్టాడు. ఆ తర్వాత అతని విధ్వంసం మొదలైంది. ముందుగా కరుణరత్నే ఓవర్లో లాంగాన్ దిశగా సింగిల్ తీసి అతను సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఆ తర్వాత రజిత ఓవర్లో సిక్స్ కొట్టిన కోహ్లి... కరుణరత్నే తర్వాతి ఓవర్లో 2 సిక్సలు, ఫోర్ బాదాడు. రజిత మరో ఓవర్లోనూ కోహ్లి 2 సిక్సలు, ఫోర్ రాబట్టాడు. కుమార వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లోనూ ఇదే తరహాలో 2 సిక్సలు, ఫోర్ బాది విరాట్ అజేయంగా నిలిచాడు. ఆఖరి 10 ఓవర్లలో భారత్ 116 పరుగులు చేయగా... కోహ్లి ఒక్కడే 34 బంతులు మాత్రమే ఆడి 4 ఫోర్లు, 8 సిక్సర్లతో 84 పరుగులు సాధించడం విశేషం!

టపటపా...

కొండంత లక్ష్యం చూడగానే ఆటకు ముందే చేతులెత్తేసిన లంక కనీస స్థాయి ప్రదర్శన కూడా ఇవ్వలేకపోయింది. సిరాజ్ పదునైన బౌలింగ్ ముందు తలవంచిన జట్టు బ్యాటర్లు వరుసగా వికెట్లు అప్పగించేశారు. తొలి 5 వికెట్లలో 4 వికెట్లు పడగొట్టిన సిరాజ్... తన బౌలింగ్‌లో షాట్ కోసం ముందుకొచ్చి సరైన సమయంలో క్రీజ్‌లోకి వెళ్లలేకపోయిన కరుణరత్నేను రనౌట్ చేసి ఆరో వికెట్ పతనంలోనూ కీలకపాత్ర పోషించాడు. అతి కష్టమ్మీద నువనిడు, రజిత (13 నాటౌట్), షనక (11) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. సిరాజ్ స్పెల్ చివర్లో అతను తొలి ఐదు వికెట్ల ఘనత అందుకునేందుకు సహచరులంతా ప్రయత్నించారు. ఇతర బౌలర్లు బ్యాటర్‌కు దూరంగా బంతులు వేస్తూ వికెట్ తీయకుండా జాగ్రత్తపడ్డారు. అయితే అదృష్టం కలిసి రాక సిరాజ్ 4 వికెట్లకే పరిమితమయ్యాడు.


వన్డే సిరీస్ ట్రోఫీతో కెప్టెన్ రోహిత్ శర్మ

ఆటగాళ్ల 'ఢీ'

మ్యాచ్‌లో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. 43వ ఓవర్ ఐదో బంతిని కోహ్లి పుల్ షాట్ ఆడగా బంతి బౌండరీ వైపు దూసుకుపోయింది. జెఫ్రీ వాండెర్సె బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ నుంచి ఎడమ వైపునకు, ఆషెన్ బండారా డీప్ మిడ్ వికెట్ నుంచి కుడి వైపునకు బంతిని ఆపేందుకు దూసుకొచ్చారు. ఈ క్రమంలో నియంత్రణ కోల్పోయిన వీరిద్దరు ఒకరినొకరు ఢీ కొట్టారు. బాధగా ఇద్దరూ కొద్దిసేపు విలవిల్లాడగా, స్ట్రెచర్‌పై బయటకు తీసుకుపోవాల్సి వచ్చింది. వాండెర్సె స్థానంలో వెలలాగే 'కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్'గా ఆడగా, బండార బ్యాటింగ్‌కు దిగలేకపోయాడు. ఈ బౌండరీతో 99కు చేరిన కోహ్లి తర్వాతి బంతికే సెంచరీ పూర్తి చేసుకున్నా... ఎలాంటి సంబరాలు ప్రదర్శించలేదు.

46 కోహ్లి సెంచరీల సంఖ్య. అత్యధిక వన్డే శతకాల జాబితాలో సచిన్ టెండూల్కర్ (49 సెంచరీలు)కు కోహ్లి దగ్గరయ్యాడు. భారత్‌లో అత్యధిక సెంచరీలు చేసిన (21) బ్యాటర్‌గా సచిన్ (20)ను దాటిన కోహ్లి... ఒక జట్టుపై అత్యధిక సెంచరీలు (10 ; శ్రీలంకపై) చేసిన ఆటగాడిగా నిలిచాడు.

5 వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లలో కోహ్లి ఐదో స్థానానికి (12,754) చేరుకున్నాడు.

317 పరుగుల పరంగా వన్డేల్లో అతి పెద్ద విజయాన్ని భారత్ (317 పరుగులు) నమోదు చేసింది. గతంలో ఈ రికార్డు న్యూజిలాండ్ జట్టు పేరిట ఉండేది. 2008లో ఐర్లాండ్‌పై న్యూజిలాండ్ 290 పరుగుల తేడాతో గెలిచింది.

96 శ్రీలంకపై భారత్ విజయాల సంఖ్య. వన్డే క్రికెట్‌లో ఒక జట్టుపై ఎక్కువ మ్యాచ్‌లు గెలిచిన జట్టుగా ఆస్ట్రేలియా (95 - న్యూజిలాండ్‌పై) పేరిట ఉన్న రికార్డును భారత్ తిరగరాసింది.

3 స్వదేశంలో శ్రీలంకతో ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లను భారత్ క్లీన్‌స్వీప్ చేయడం ఇది మూడోసారి. గతంలో భారత్ 1982లో 3-0తో... 2014లో 5-0తో వన్డే సిరీస్‌లను క్లీన్ స్వీప్ చేసింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) అవిష్క (బి) కరుణరత్నే 42; గిల్ (బి) రజిత 116; కోహ్లి (నాటౌట్) 166; శ్రేయస్ (సి) (సబ్) ధనంజయ (బి) కుమార 38; కేఎల్ రాహుల్ (సి) వెలలాగె (బి) కుమార 7; సూర్యకుమార్ (సి) అవిష్క (బి) రజిత 4; అక్షర్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 390. వికెట్ల పతనం:** 1–95, 2–226, 3–334, 4–364, 5–370. **బౌలింగ్:** రజిత 10–1–81–2, కుమార 10–1–87–2, హసరంగ 10–0–54–0, వాన్‌డర్సె 7–0–59–0, కరుణరత్నే 8–0–58–1, షనక 3–0–19–0, నువనిడు 2–0–22–0.

శ్రీలంక ఇన్నింగ్స్: అవిష్క (సి) గిల్ (బి) సిరాజ్ 1; నువనిడు (బి) సిరాజ్ 19; మెండిస్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 4; అసలంక (సి) అక్షర్ (బి) షమీ 1; షనక (బి) కుల్దీప్ 11; హసరంగ (బి) సిరాజ్ 1; కరుణరత్నే (రనౌట్) 1; వెలలాగె (సి) కుల్దీప్ (బి) షమీ 3; రజిత (నాటౌట్) 13; కుమార (బి) కుల్దీప్ 9; బండార (ఆబ్సెంట్ హర్ట్); ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (22 ఓవర్లలో ఆలౌట్) 73. వికెట్ల పతనం:** 1–7, 2–22, 3–31, 4–35, 5–37, 6–39, 7–50, 8–51, 9–73. **బౌలింగ్:** షమీ 6–2–20–2, సిరాజ్ 10–1–32–4, కుల్దీప్ 5–1–16–2, శ్రేయస్ 1–0–2–0.

యువ భారత్ జోరు...

- అండర్–19 మహిళల టి20 ప్రపంచకప్‌లో రెండో విజయం
- అదరగొట్టిన షఫాలీ, శ్వేత


షఫాలీ


శ్వేత

బెనోని (దక్షిణాఫ్రికా): టాప్ ఆర్డర్ బ్యాటర్లు మరోసారి చెలరేగడంతో... తొలిసారి నిర్వహిస్తున్న మహిళల అండర్–19 టి20 ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో సోమవారం గ్రూప్ 'డి' లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 122 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది. మొదట భారత్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షఫాలీ వర్మ (34 బంతుల్లో 78; 12 ఫోర్లు, 4 సిక్సర్లు), శ్వేత సెహ్రావత్ (49 బంతుల్లో 74 నాటౌట్; 10 ఫోర్లు) ధాటిగా ఆడారు. ఆరంభం నుంచి చెలరేగిన ఓపెనర్లు తొలి వికెట్‌కు 8.3 ఓవర్లలోనే 111 పరుగులు జోడించారు. రిచా ఘోష్ (29 బంతుల్లో 49; 5 ఫోర్లు, 2 సిక్సలు) రాణించగా, తెలుగమ్మాయి గొంగడి త్రిష (11; 2 ఫోర్లు) డెత్ ఓవర్లలో ధాటిగా ఆడే ప్రయత్నంలో అవుటైంది. యూఏఈ బౌలర్లలో ఇందుజా, మహిక, సమైరా తలా ఒక వికెట్ తీశారు. అనంతరం కష్టసాధ్యమైన లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేసింది. ఓపెనర్ లావణ్య కెనీ (54 బంతుల్లో 24), మహిక (26 బంతుల్లో 26; 2 సిక్సర్లు) 20 పైచిలుకు స్కోరు చేశారు. భారత బౌలర్లలో తెలుగమ్మాయి షబ్నమ్, టిటాస్, మన్నత్, పర్షవి తలా ఒక వికెట్ తీశారు. గ్రూప్ 'డి'లో 4 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న భారత జట్టు రేపు జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో తలపడుతుంది.

హైదరాబాద్‌లో వన్డే సందడి

- రేపు భారత్, న్యూజిలాండ్ పోరు
- పూర్తిగా అమ్ముడుపోయిన టికెట్లు

సాక్షి, హైదరాబాద్: నాలుగు నెలలలోపే భాగ్యనగర క్రికెట్ అభిమానులను అలరించేందుకు మరో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ వచ్చేసింది. భారత్, న్యూజిలాండ్ వన్డే సిరీస్‌లో భాగంగా బుధవారం ఉప్పల్‌లో జరిగే తొలి పోరులో ఇరు జట్లు తలపడనున్నాయి. ఇందుకోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. నాలుగు రోజుల పాటు 'ఆన్‌లైన్'లో టికెట్లు అందుబాటులో ఉంచగా, పూర్తిగా అమ్ముడుపోవడంతో స్టేడియం 'హౌస్‌ఫుల్' కావడం ఖాయమైంది. గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఈసారి టికెట్లను 'ఆన్‌లైన్'కే పరిమితం చేయడంతో టికెట్ల అమ్మకం విషయంలో ఎలాంటి గందరగోళం, రచ్చ జరగలేదు. పాకిస్తాన్ పర్యటన నుంచి శనివారమే నేరుగా హైదరాబాద్ వచ్చిన కివీస్ జట్టు రెండు రోజులుగా ప్రాక్టీస్ చేస్తుండగా... లంకతో మూడో వన్డే తర్వాత సోమవారం సాయంత్రం టీమిండియా నగరానికి చేరుకుంది. మంగళవారం ఇరు జట్లు పూర్తి స్థాయిలో సాధన చేస్తాయి. గతంలో ఉప్పల్ స్టేడియంలో ఇరు జట్ల మధ్య 2 టెస్టులు జరగ్గా... కివీస్ జట్టు వన్డే ఆడనుండటం ఇదే మొదటిసారి కానుంది.


సిరాజ్ తొలిసారి...

సొంతగడ్డపై హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్ తొలిసారి భారత్ తరఫున మ్యాచ్ ఆడనున్నాడు. గతంలో ఐపీఎల్‌లో ఆడినా... అతని 42 అంతర్జాతీయ మ్యాచ్‌ల కెరీర్‌లో హైదరాబాద్‌లో మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. ఇప్పుడు అద్భుతమైన ఫామ్‌తో భారత జట్టులో కీలకంగా ఎదిగిన దశలో ఉప్పల్ మైదానంలో తన ఆటతో చెలరేగేందుకు సిద్ధమయ్యాడు. శ్రీలంకతో సిరీస్‌లో కేవలం 10.22 సగటుతో 9 వికెట్లు తీసిన సిరాజ్‌పై 'అరుదైన ప్రతిభగలవాడు' అంటూ కెప్టెన్ రోహిత్ శర్మ ప్రశంసలు కురిపించాడు.


డరైల్ మిచెల్ బ్యాటింగ్ ప్రాక్టీస్

భారత్ 0 ఇంగ్లండ్ 0

పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నీ



రూర్కెలా: పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నీ పూల్ 'డి'లో భాగంగా ఆదివారం ఇంగ్లండ్ జట్టుతో జరిగిన లీగ్ మ్యాచ్‌ను భారత్ 0–0తో 'డ్రా'గా ముగించింది. భారత జట్టుకు నాలుగు పెనాల్టీ కార్నర్‌లు... ఇంగ్లండ్ జట్టుకు ఎనిమిది పెనాల్టీ కార్నర్‌లు లభించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం పూల్ 'డి'లో భారత్, ఇంగ్లండ్ జట్ల ఖాతాలో చెరో నాలుగు పాయింట్లు ఉన్నాయి. 19న జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో వేల్స్‌తో భారత్, స్పెయిన్‌తో ఇంగ్లండ్ తలపడతాయి. సోమవారం జరిగిన మ్యాచ్‌ల్లో మలేసియా 3–2తో చిలీపై, నెదర్లాండ్స్ 4–0తో న్యూజిలాండ్‌పై, ఫ్రాన్స్ 2–1తో దక్షిణాఫ్రికాపై గెలుపొందగా... అర్జెంటీనా–ఆస్ట్రేలియా మ్యాచ్ 3–3తో 'డ్రా'గా ముగిసింది.

శ్రమించి... శుభారంభం


రాఫెల్ నాదల్

- రెండో రౌండ్‌లోకి రాఫెల్ నాదల్
- తొలి రౌండ్‌లో 3 గంటల 41 నిమిషాల్లో బ్రిటన్ ప్లేయర్‌పై గెలుపు

మెల్‌బోర్న్: కెరీర్‌లో 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంగా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బరిలోకి దిగిన డిఫెండింగ్ చాంపియన్ రాఫెల్ నాదల్‌కు తొలి రౌండ్‌లోనే గట్టిపోటీ ఎదురైంది. బ్రిటన్‌కు చెందిన ప్రపంచ 40వ ర్యాంకర్ జాక్ డ్రేపర్‌తో సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రాఫెల్ నాదల్ 7–5, 2–6, 6–4, 6–1తో నెగ్గి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. 3 గంటల 41 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో నాదల్ ఆరు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. ఏకంగా 46 అనవసర తప్పిదాలు చేసిన నాదల్ 41 విన్నర్స్ కొట్టి పైచేయి సాధించాడు. తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడుతున్న డ్రేపర్ 13 ఏస్‌లతో అదరగొట్టాడు. అయితే 46 అనవసర తప్పిదాలు చేయడం... కీలకదశలో తడబడటంతో డ్రేపర్‌కు ఓటమి తప్పలేదు. నాదల్ సర్వీస్‌ను 11 సార్లు బ్రేక్ చేసే అవకాశం వచ్చినా డ్రేపర్ నాలుగుసార్లు మాత్రమే సద్వినియోగం చేసుకున్నాడు. మరోవైపు నాదల్ ఆరుసార్లు డ్రేపర్ సర్వీస్‌ను బ్రేక్ చేశాడు.

మెద్వెదెవ్ అలవోకగా...

పురుషుల సింగిల్స్ ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఏడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా), మూడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), ఆరో సీడ్ ఫీలిక్స్ అలియాసిమ్ (కెనడా), పదో సీడ్ హుబెర్ట్ హుర్కాజ్ (పోలాండ్) రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. మెద్వెదెవ్ 6–0, 6–1, 6–2తో మార్కోస్ గిరోన్ (అమెరికా)పై, సిట్సిపాస్ 6–3, 6–4, 7–6 (8/6)తో క్వెంటిన్ హేలీస్ (ఫ్రాన్స్)పై, అలియాసిమ్ 1–6, 7–6 (7/4), 7–6 (7/3), 6–3తో పోస్‌పిసిల్ (కెనడా)పై, హుర్కాజ్ 7–6 (7/1), 6–2, 6–2తో పెడ్రో మార్టినెజ్ (స్పెయిన్)పై గెలిచారు. అయితే 2014 చాంపియన్ వావ్రింకా (స్విట్జర్లాండ్) 4 గంటల 22 నిమిషాల్లో 7–6 (7/3), 3–6, 6–1, 6–7 (2/7), 4–6తో అలెక్స్ మొల్కాన్ (స్లొవేకియా) చేతిలో... ప్రపంచ 23వ ర్యాంకర్ బోర్నా చోరిచ్ (క్రొయేషియా) 3–6, 3–6, 3–6తో జిరీ లెహెక్కా (చెక్ రిపబ్లిక్) చేతిలో... ప్రపంచ 19వ ర్యాంకర్ ముసెట్టి (ఇటలీ) 4–6, 1–6, 7–6 (7/0), 6–2, 6–7 (4/10)తో హ్యారిస్ (దక్షిణాఫ్రికా) చేతిలో ఓడిపోయారు.

స్వియాటెక్ కష్టపడి...

మహిళల సింగిల్స్ విభాగం తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్ స్వియాటెక్ (పోలాండ్) గంటా 59 నిమిషాల్లో 6–4, 7–5తో జూల్ నెమియర్ (జర్మనీ)పై శ్రమించి గెలిచింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ పెగూలా (అమెరికా) 6–0, 6–1తో జాక్వెలిన్ (రొమేనియా)పై, ఆరో సీడ్ సాకరి (గ్రీస్) 6–1, 6–4తో యు యువాన్ (చైనా)పై, ఏడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6–1, 6–4తో సినియకోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచారు.

సింధు సత్తాకు సవాల్

- నేటి నుంచి ఇండియా ఓపెన్ టోర్నీ
- బరిలో లక్ష్య సేన్, ప్రణయ్, శ్రీకాంత్

న్యూఢిల్లీ: స్వదేశంలో మరోసారి సత్తా చాటుకోవాలనే లక్ష్యంతో భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రణయ్, సైనా నెహ్వాల్ నేటి నుంచి మొదలయ్యే ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో బరిలోకి దిగనున్నారు. మాజీ చాంపియన్ పీవీ సింధు నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 21వ ర్యాంకర్ సుపనిద కటెథోంగ్ (థాయ్‌లాండ్)తో... ప్రపంచ 31వ ర్యాంకర్ మియా బ్లిచ్‌ఫెల్ట్ (డెన్మార్క్)తో సైనా నెహ్వాల్ తలపడనున్నారు. గత ఏడాది ఇదే టోర్నీ సెమీఫైనల్లో సుపనిద చేతిలో సింధు ఓడిపోగా... మియా బ్లిచ్‌ఫెల్ట్‌తో గతంలో ఆడిన రెండుసార్లూ సైనాకు ఓటమి ఎదురైంది. ఈ నేపథ్యంలో సింధు, సైనాలకు తొలి రౌండ్‌లోనే కఠిన పరీక్ష ఎదురుకానుంది. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ లక్ష్య సేన్ భారత్‌కే చెందిన ప్రణయ్‌తో తొలి రౌండ్‌లో ఆడనున్నాడు. గతవారం మలేసియా ఓపెన్ టోర్నీ తొలి రౌండ్‌లో వీరిద్దరు తలపడగా ప్రణయ్ పైచేయి సాధించాడు. బుధవారం జరిగే మరో తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)తో కిడాంబి శ్రీకాంత్ ఆడతాడు. ముఖాముఖి రికార్డులో శ్రీకాంత్ 3–9తో వెనుకంజలో ఉన్నాడు.


సింధు, ప్రణయ్

విజేత కుశాగ్ర మోహన్

సాక్షి, హైదరాబాద్: బిషన్ సింగ్ స్మారక ఆలిండియా ఓపెన్ 'ఫిడే' రేటెడ్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణకు చెందిన కుశాగ్ర మోహన్ విజేతగా నిలిచాడు. తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో కుశాగ్ర మోహన్, ఎం.చక్రవర్తి రెడ్డి (తెలంగాణ), హిమల్ గుసైన్ (పశ్చిమ రైల్వేస్) ఎనిమిది పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... కుశాగ్ర మోహన్‌కు అగ్ర స్థానం దక్కింది. చక్రవర్తి రెడ్డి రన్నరప్‌గా నిలువగా, హిమల్‌కు మూడో స్థానం లభించింది. వి4 చెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నీలో చాంపియన్ కుశాగ్ర మోహన్‌కు రూ. లక్ష ప్రైజ్‌మనీ, చక్రవర్తి రెడ్డికి రూ. 70 వేలు, హిమల్‌కు రూ. 40 వేలు ప్రైజ్‌మనీ లభించాయి. టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన కుశాగ్ర ఏడు గేముల్లో గెలిచి, రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచాడు.


విన్నర్, రన్నరప్ ట్రోఫీలతో కుశాగ్ర, చక్రవర్తి

సాక్షి బిజినెస్
మంగళవారం
17-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	168	60,093
నిఫ్టీ ▽	62	17,895

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫన్' చూడండి

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	11,079	△ 78
డోజోన్స్	34,303	△ 112
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,860	△ 16
డాక్స్	15,134	△ 48
షాంఘై	3,228	△ 32
నిక్కాయ్	22,822	▽ 298

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	56,883
బంగారం (99.5 స్వచ్ఛత)	56,655
వెండి (కిలో)	69,167

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒక్కటి	80.50	82.17
£	బ్రిటన్ పౌండ్	ఒక్కటి	98.20	101.48
€	యూరో	ఒక్కటి	86.81	89.89
¥	జపాన్ ఎన్ (100)	ఒక్కటి	62.79	64.88
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒక్కటి	55.86	58.26
S$	సింగపూర్ డాలర్	ఒక్కటి	60.79	62.80
SAR	సౌదీ రియాల్	ఖాయంగా	20.77	22.44
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాయంగా	21.32	23.12
¥	చైనా యువాన్	ఖాయంగా	11.00	13.03

టోకు ధరలు కూల్.. కూల్!

- డిసెంబర్ ద్రవ్యోల్బణం 4.95 శాతమే..
- 22 నెలల కనిష్ట స్థాయి
- ఫుడ్ ఆర్టికల్స్ ధరలు తగ్గుదల



న్యూఢిల్లీ: దేశ ఎకానమీకి ధరల తగ్గుదల ఊరటనిస్తోంది. వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం అంకెల దిగువ బాటలోనే టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు కూడా నడిచాయి. డిసెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం కేవలం 4.95 శాతంగా (2021 ఇదే నెలతో పోల్చి) నమోదయ్యింది. గడచిన 22 నెలల కాలంలో (2021 ఫిబ్రవరిలో 4.83 శాతం) ఇంత తక్కువ స్థాయి గణాంకాల నమోదు ఇదే తొలిసారి. ఫుడ్ ఆర్టికల్స్ ప్రత్యేకించి కూరగాయలు, ఆయిల్‌సీడ్స్ ధరలు తగ్గడం మొత్తం టోకు ద్రవ్యోల్బణం గణాంకల తగ్గుదలకు కారణం. 2022 సెప్టెంబర్ వరకు వరుసగా 18 నెలలు టోకు ద్రవ్యోల్బణం రెండంకెలపైన కొనసాగింది. అక్టోబర్ నుంచి గడచిన మూడు నెలల్లో రెండంకెల దిగువకు చేరింది. డిసెంబర్‌లో ఫుడ్ బాస్కెట్ ధర తగ్గడం మొత్తం రిటైల్ ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపిన సంగతి తెలిసిందే. నవంబర్‌లో 5.88 శాతంగా నమోదుకాగా, డిసెంబర్‌లో మరింత తగ్గి 5.72%కి (2021 డిసెంబర్‌తో పోల్చి) చేరడం ఎకానమీకి ఊరటనిచ్చింది.

బీవైడీ టాప్ గేర్..

- ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాల్లో నంబర్ వన్
- అంతర్జాతీయంగా టెస్లాకు దీటుగా పోటీ
- భారత్‌లోనూ కార్యకలాపాల విస్తరణ



సాక్షి, బిజినెస్ డెస్క్: బిల్డ్ యువర్ డ్రీమ్స్.. మీ కలలను సాకారం చేసుకోండి. ఇదేదో ట్యాగ్‌లైన్ కాదు. ఓ చైనా ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ పేరు. సంక్షిప్త రూపం బీవైడీ. ఈ బీవైడీనే ఇప్పుడు అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లాను కలవరపెడుతోంది. అంతటి పెద్ద కంపెనీని కూడా డిస్కౌంట్ల బాట పట్టించింది. ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాల్లో ప్రపంచంలోనే నంబర్ వన్ కంపెనీగా నిల్చింది. ఇప్పుడు భారత్‌తో పాటు ఇతర దేశాల్లోనూ మరింతగా విస్తరిస్తోంది.

రెండు దశాబ్దాలుగా..

ప్రాథమికంగా రీచార్జబుల్ బ్యాటరీల ఫ్యాక్టరీగా బీవైడీ కంపెనీని వాంగ్ చాన్‌ఫు 1995లో ప్రారంభించారు. ఆ తర్వాత ఆటోమొబైల్స్, మొబైల్ ఫోన్స్ పరికరాల విభాగాల్లోకి విస్తరించారు. ఆ క్రమంలోనే కార్ల తయారీ లైసెన్సు ఉన్న క్విన్‌చువాన్ ఆటో మొబైల్ కంపెనీని 2002లో కొనుగోలు చేసి దాన్ని 2003లో బీవైడీ ఆటో కంపెనీగా బీవైడీ మార్చింది. ప్రస్తుతం బీవైడీ కంపెనీలో బీవైడీ ఆటోమొబైల్, బీవైడీ ఎలక్ట్రానిక్ అని రెండు అనుబంధ సంస్థలు ఉన్నాయి. బీవైడీ ఆటోమొబైల్.. ప్యాసింజర్ కార్లు, బస్సులు, ట్రక్కులు, ఎలక్ట్రిక్ సైకిళ్ల వంటి పూర్తి బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు (బీఈవీ), ప్లగ్ ఇన్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాలను (పీహెచ్‌ఈవీ) తయారు చేస్తోంది. పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాలపై దృష్టి పెట్టేందుకు గతేడాది మార్చి నుంచి పెట్రోల్ వాహనాలను నిలిపివేసింది. 2021 ఆఖరు నాటికి పీహెచ్‌ఈవీ, బీఈవీ విభాగంలో ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద కంపెనీగా ఎదిగింది. 2022లో దాదాపు 19 లక్షల పైగా విద్యుత్ వాహనాలు (హైబ్రిడ్ కూడా కలిపి) విక్రయించడం ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల విక్రయంలో ప్రపంచంలోనే నంబర్ వన్ సంస్థగా నిల్చింది.

బఫెట్ పెట్టుబడులు..

మార్కెట్ క్యాప్‌పరంగా టెస్లా ప్రపంచంలోనే అతి పెద్ద ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీగా ఉండగా.. అమ్మకాలపరంగా మాత్రం బీవైడీ అగ్రస్థానాన్ని ఆక్రమించింది. టెస్లా మార్కెట్ వేల్యుయేషన్ 386 బిలియన్ డాలర్లుగా ఉండగా బీవైడీది సుమారు 100 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. లాభాలు, ఆదాయాలపరంగా టెస్లా ఇంకా గ్లోబల్ లీడర్‌గానే ఉన్నప్పటికీ బీవైడీ వేగంగా దూసుకొస్తోంది. యూరప్, ఆస్ట్రేలియా మొదలైన మార్కెట్లలోకి కూడా ఎగుమతులు మొదలుపెడుతోంది. అమెరికన్ ఇన్వెస్ట్‌మెంట్ గురు వారెన్ బఫెట్ .. టెస్లాలో కాకుండా చైనా కంపెనీ బీవైడీలో పెట్టుబడులు పెట్టారు. ఇతర ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలతో పోలిస్తే బీవైడీకి ఓ ప్రత్యేకత ఉంది. బ్యాటరీ, ఎలక్ట్రిక్ మోటార్, ఎలక్ట్రిక్ కంట్రోల్ అనే మూడు రకాల ఎన్‌ఈవీలకు సంబంధించిన టెక్నాలజీల్లోనూ నైపుణ్యం ఉంది. ఇలా వినూత్న టెక్నాలజీల్లోనే కాకుండా ధరపరంగా కూడా టెస్లాకు బీవైడీ గట్టి పోటీ ఇస్తోంది. బీవైడీ కార్ల ధరలు చైనా మార్కెట్లో 30,000 డాలర్ల లోపే ఉంటుండగా, టెస్లా చౌకైన కారు మోడల్ 3 ప్రారంభ ధరే 37,800 డాలర్ల పైచిలుకు ఉంటోంది. 25,000 డాలర్ల రేంజిలో కారును కూడా తెస్తామంటూ టెస్లా ప్రకటించింది.

భారత్‌లోనూ బీవైడీ జోరు..

2030 కల్లా భారత్‌లో అమ్ముడయ్యే ప్రతి మూడు కార్లలో ఒకటి ఎలక్ట్రిక్‌దే ఉంటుందనే అంచనాల నేపథ్యంలో మన మార్కెట్‌పై బీవైడీకి భారీ లక్ష్యాలే ఉన్నాయి. 2030 నాటికల్లా దేశీ ఈవీ మార్కెట్లో 40 శాతం వాటాను దక్కించుకోవాలని కంపెనీ నిర్దేశించుకుంది. 2007లోనే బీవైడీ ఇండియా విభాగం ఏర్పాటైంది. గతేడాది భారత్‌లో అటో 3 ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ, ఈ6 ఎలక్ట్రిక్ ఎంపీవీలను ప్రవేశపెట్టింది. సీల్ పేరిట మరో కారును ఈ ఏడాది ప్రవేశపెడుతోంది. ఇప్పుడు విక్రయిస్తున్న కార్ల రేట్లు రూ. 29 లక్షల నుంచి ఉంటుండగా 700 కి.మీ. వరకు రేంజి ఉండే సీల్ రేటు దాదాపు రూ. 70 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. దిగుమతి సుంకాల భారాన్ని తగ్గించుకునే క్రమంలో ప్రస్తుతం చెన్నైలోని ప్లాంటులో ఎలక్ట్రిక్ వాహనాలను సెమీ నాక్డ్-డౌన్ కిట్స్ (ఎస్‌కేడీ)లాగా అసెంబుల్ చేస్తోంది. రెండో దశలో డిమాండ్‌ను బట్టి పూర్తి స్థాయిలో ఇక్కడే అసెంబుల్ చేసే అవకాశాలనూ పరిశీలిస్తోంది. ప్రస్తుతం దాదాపు 20 డీలర్లు ఉండగా ఈ ఏడాది ఆఖరు నాటికి భారత్‌లో తమ డీలర్‌షిప్‌ల సంఖ్యను 53కి పెంచుకునే యోచనలో ఉంది. గతేడాది సుమారు 700 వాహనాలు విక్రయించగా ఈ ఏడాది ఏకంగా 15,000 పైచిలుకు అమ్మకాలను కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

తెలుగు కనెక్షన్..

తెలుగు రాష్ట్రాల కంపెనీతో కూడా బీవైడీకి అనుబంధం ఉంది. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా (ఎంఈఐఎల్) అనుబంధ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌తో బీవైడీకి సాంకేతిక భాగస్వామ్యం ఉంది. బీవైడీ సాంకేతికత సహకారంతో ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులను తయారు చేస్తోంది. ఇక భారత్‌లో సొంత ఉత్పత్తుల విస్తరణలో భాగంగా కంపెనీ హైదరాబాద్‌తో పాటు వైజాగ్, విజయవాడ తదితర ప్రాంతాల్లోనూ స్టోర్స్ ఏర్పాటు చేసింది.

లాభాల నుంచి నష్టాల్లోకి

సెన్సెక్స్ 168 పాయింట్లు డౌన్



ముంబై: ఆటుపోట్ల మధ్య దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. సెన్సెక్స్ 168 పాయింట్లు క్షీణించి 60,093 వద్ద నిలిచింది. నిఫ్టీ 62 పాయింట్ల నష్టంతో 17,895 వద్ద ముగిసింది. వెరసి సాంకేతికంగా కీలకమైన 18,000 స్థాయి దిగువన స్థిరపడింది. అయితే తొలుత మార్కెట్లు హుషారుగా ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ 326 పాయింట్లు ఎగసి 60,587కు చేరింది. మిడ్‌సెషన్ నుంచీ అమ్మకాలు ఊపందుకోవడంతో 297 పాయింట్లు నీరసించింది. 60,000 దిగువన 59,964ను తాకింది. ఈ బాటలో నిఫ్టీ సైతం 18,050- 17,854 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులు చవిచూసింది. గత కొద్ది రోజులుగా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) అమ్మకాలను వీడకపోవడంతో సెంటిమెంటు బలహీనపడినట్లు నిపుణులు పేర్కొన్నారు.

ప్రభుత్వ బ్యాంకుల జోరు

ఎన్‌ఎస్‌ఈలో మెటల్, మీడియా, ప్రయివేట్ బ్యాంక్స్, ఆటో 1.4-0.7% మధ్య వెనకడుగు వేయగా.. పీఎస్‌యూ బ్యాంక్స్ 1.7%, ఐటీ 1.1% చొప్పున లాభపడ్డాయి. యుకో, ఐవోబీ, యూనియన్, పీఎస్‌బీ, సెంట్రల్, మహారాష్ట్ర, పీఎన్‌బీ, బీవోఐ 9-1.5% మధ్య జంప్‌చేశాయి. క్యూ3లో ప్రోత్సాహకర ఫలితాలతో ఇటీవలే లిస్టయిన శూల వైన్‌యార్డ్స్ 15 శాతం దూసుకెళ్లింది. రూ. 374 వద్ద ముగిసింది.

ధరలు పెంచిన మారుతీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ అన్ని మోడళ్ల ధరలను 1.1 శాతం పెంచింది. జనవరి 16 నుంచి కొత్త ధరలు అమల్లోకి వచ్చాయని కంపెనీ ప్రకటించింది. ముడి సరుకు వ్యయాలు అధికం కావడం, ఏప్రిల్ 1 నుంచి అమలయ్యే నూతన ఉద్గార ప్రమాణాలకు అనువుగా వాహనాల తయారీ చేపట్టనుండడం కారణంగా ధరలను పెంచుతున్నట్టు గతేడాది డిసెంబర్‌లో మారుతీ సుజుకీ వెల్లడించింది. 2022 ఏప్రిల్‌లో ధరలను సవరించిన తర్వాత ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రెండోసారి.



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్యూ3 గుడ్

నికర లాభం రూ. 12,698 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 20 శాతం జంప్‌చేసి రూ. 12,698 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం మెరుగుపడటం ఇందుకు సహకరించింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 19 శాతం బలపడి రూ. 12,260 కోట్లయ్యింది. ఈ కాలంలో 20 శాతం రుణ వృద్ధి కారణంగా నికర వడ్డీ ఆదాయం 25 శాతం ఎగసి రూ. 22,988 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 4.1 శాతంగా నమోదయ్యాయి. ఇతర ఆదాయం రూ. 300 కోట్లు పెరిగి రూ. 8,540 కోట్లకు చేరింది.



రుణ నాణ్యత అప్: క్యూ3లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) నిలకడను చూపుతూ 1.23%గా నమోదైంది. నిర్వహణ వ్యయాలు 27 శాతం పెరిగి రూ. 12,464 కోట్లకు చేరగా.. 4,000 మంది ఉద్యోగులను జత చేసుకుంది. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 1,66,890ను తాకింది. . కాగా.. అనుబంధ సంస్థలలో హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ నికర లాభం రూ. 258 కోట్ల నుంచి రూ. 203 కోట్లకు తగ్గింది. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లాభం రూ. 304 కోట్ల నుంచి రూ. 501 కోట్లకు జంప్‌చేసింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 1% బలహీనపడి రూ. 1,586 వద్ద ముగిసింది.

సంపన్నులకు మక్కువ ఈక్విటీలే

- వాణిజ్య రియల్టీకి ద్వితీయ ప్రాధాన్యం
- సంపన్నుల ఐశ్వర్యం ఈ ఏడాది పైపైకే
- నైట్ ఫ్రాంక్ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలోని అధిక ధనవంతులు ఎక్కడ ఇన్వెస్ట్ చేస్తారు? చాలా మందికి దీన్ని తెలుసుకోవాలని ఉంటుంది. ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ 'నైట్ ఫ్రాంక్' సర్వే పరిశీలిస్తే.. అల్ట్రా హై నెట్ వర్త్ వ్యక్తులకు (యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐ/అధిక ధనవంతులు) అత్యంత ఇష్టమైన పెట్టుబడి సాధనం ఈక్విటీలే అని తెలుస్తోంది. 34% పెట్టుబడులను ఈక్విటీలకే కేటాయిస్తున్నారు. ఆ తర్వాత వాణిజ్య రియల్ ఎస్టేట్‌లో 25 శాతం, బాండ్లలో 16 శాతం, ప్రైవేటు ఈక్విటీ/వెంచర్ క్యాపిటల్ రూపంలో 10 శాతం, బంగారంలో 6 శాతం, ఇతర ఇష్టమైన వస్తువులపై (కళాకృతులు, కారు) 4% చొప్పున పెట్టుబడులు పెడుతున్నట్టు తెలిసింది. నైట్ ఫ్రాంక్ సంస్థ అంతర్జాతీయంగా సర్వే నిర్వహించి 'ద వెల్త్ రిపోర్ట్ అవుట్‌లుక్ 2023'పేరుతో విడుదల చేసింది.

సర్వే ఫలితాలు..

- దీర్ఘకాలంలో ఎంతో అనిశ్చితులు నెలకొన్నప్పటికీ 88 శాతం మంది భారతీయ అధిక ధనవంతుల సంపద 2022లో వృద్ధి చెందింది.
- గతేడాది 10 శాతానికి పైగా తమ సంపద పెరిగినట్టు 35 శాతం మంది చెప్పారు.
- ఈ ఏడాది కూడా తమ సంపద కనీసం 10 శాతం వృద్ధి చెందుతుందని 53 శాతం మంది అధిక ధనవంతులు అభిప్రాయపడుతున్నారు
- 47 శాతం మంది 10 శాతానికి పైనే పెరగొచ్చన్న



అంచనాతో ఉన్నారు.

- అంతర్జాతీయంగా.. సంపన్నుల కంటే ధనవంతులే ఈక్విటీల్లో ఎక్కువగా ఇన్వెస్ట్ చేస్తున్నారు.
- మన దేశంలో అధిక ధనవంతులు కనీసం ఒక్కొక్కరు 5 నివాస ఆస్తులను కలిగి ఉన్నారు. అంతర్జాతీయంగా ఇది 4.2గానే ఉంది.
- 2022లో 14 శాతం మంది అధిక ధనవంతులు ఇంటిని కొనుగోలు చేయగా, 2023లో 10 శాతం మంది ఇంటిని కొనుగోలు చేస్తారని అంచనా.
- యూకే, యూఏఈ, యూఎస్‌ఏ ఇళ్ల కొనుగోలుకు ప్రాధాన్య ప్రాంతాలుగా ఉన్నాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌డీఏ-పుణెలో 251 గ్రూప్ సీ పోస్టులు

పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ).. గ్రూప్ సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 251
» **పోస్టుల వివరాలు:** పెయింటర్, కుక్, ఫైర్‌మ్యాన్, ఎంటీఎస్, ఎల్‌డీసీ, బ్లాక్‌స్మిత్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్/12 వతరగతి/ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 27 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ట్రేడ్ టెస్ట్, స్కిల్ టెస్ట్‌లో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ఉద్యోగ ప్రకటన వెలువడిన 21రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** https://ndacivrect.gov.in

నీట్ ఎండీఎస్-2023

న్యూఢిల్లీలోని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్)-2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎండీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)ను నిర్వహిస్తోంది. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **అర్హత:** డెంటల్ సర్జరీలో బ్యాచిలర్ డిగ్రీ(బీడీఎస్) ఉత్తీర్ణతతోపాటు 31.03.2023 నాటికి ఇంటర్న్‌షిప్/ప్రాక్టికల్ ట్రెయినింగ్ పూర్తిచేసి ఉండాలి.
» **ఎంపిక విధానం:** అభ్యర్థులను రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.01.2023.
» **పరీక్ష తేది:** 01.03.2023.
» **వెబ్‌సైట్:** https://natboard.edu.in

నీట్ పీజీ-2023

న్యూఢిల్లీలోని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్).. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ(పోస్ట్ గ్రాడ్యుయేషన్)లో ప్రవేశాలకు నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్ష నిర్వహిస్తోంది. దీనిద్వారా ఎండీ/ఎంఎస్/పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

» **అర్హత:** ఎంబీబీఎస్ డిగ్రీ/ప్రొవిజనల్ ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి. 31.03.2023 నాటికి ఏడాది ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్షా విధానం:** ఈ పరీక్షలో 200 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు. దీనికి నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 1 రుణాత్మక మార్కు ఉంటుంది. పరీక్ష మల్టిపుల్ ఛాయిస్ పద్ధతిలో జరుగుతుంది. ఈ పరీక్ష ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది. పరీక్షా సమయం 3 గంటల 30 నిమిషాలు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.01.2023.
» **పరీక్ష తేది:** 05.03.2023.
» **వెబ్‌సైట్:** https://natboard.edu.in

నిమ్‌హాన్స్, బెంగళూరులో వివిధ ఉద్యోగాలు

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్(నిమ్‌హాన్స్).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
» **పోస్టుల వివరాలు:** సీనియర్ రీసెర్చ్ ఫెలో-02, ప్రాజెక్ట్ ఫిజిషియన్-01, డిస్ట్రిట్ కోఆర్డినేటర్-03, గ్రాఫిక్ డిజైనర్-01.
» **అర్హత:** మెట్రిక్యులేషన్‌తోపాటు పోస్టును అనుసరించి బ్యాచిలర్స్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 35 నుంచి 45 ఏళ్లు వరకు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.20,000 నుంచి రూ.60,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** brainhealth.nimhans@gmail.com.
» **దరఖాస్తులకు చివరితేది:** ఉద్యోగ ప్రకటన వెలువడిన 14 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** nimhans.ac.in

సీఎస్ఐఆర్-ఐఐపీ, డెహ్రాడూన్‌లో 11 పోస్టులు

డెహ్రాడూన్(ఉత్తరాఖండ్)లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం(ఐఐపీ).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11
» **పోస్టుల వివరాలు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్-07, జూనియర్ స్టెనోగ్రాఫర్-04.
» **విభాగాలు:** ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, స్టోర్ అండ్ పర్చేజ్ తదితరాలు.
» **అర్హత:** 10+2/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ టైపింగ్ నైపుణ్యాలు ఉండాలి.
» **వయసు:** 27 నుంచి 28 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.19,900 నుంచి రూ.81,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు. టైపింగ్ టెస్ట్‌లో అర్హత సాధించాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.01.2023.
» **వెబ్‌సైట్:** www.iip.res.in

మారిన సిలబస్‌తో అడ్వాన్స్‌డ్!

జేఈఈ అడ్వాన్స్‌డ్.. విద్యార్థి లోకానికి ఎంతో సుపరిచితమైన పరీక్ష! ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటీల్లో చేరాలనుకునే ప్రతిభావంతులు తమ తొలి లక్ష్యంగా చేసుకునే ఎంట్రన్స్ టెస్ట్ ఇది. వీరంతా ఇప్పుడు తమ లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాల్సిన పరిస్థితి! అంతేకాకుండా అడ్వాన్స్‌డ్ పరీక్షను నూతన సిలబస్‌తో నిర్వహించనున్నారు! ఈ నేపథ్యంలో.. జేఈఈ-అడ్వాన్స్‌డ్-2023 నూతన సిలబస్ ప్రధానాంశాలు, ప్రిపరేషన్ స్ట్రాటజీపై ప్రత్యేక కథనం..

» 2023 నుంచి మారిన సిలబస్‌తో జేఈఈ అడ్వాన్స్‌డ్
» జేఈఈ-మెయిన్ సిలబస్ అంశాల కొనసాగింపు
» సీబీఎస్ఈ, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల ఆధారంగా కొత్త సిలబస్
» మెయిన్‌తో అనుసంధానం చేసుకోవాలంటున్న నిపుణులు
» అడ్వాన్స్‌డ్‌ను జూన్4న నిర్వహించనున్నట్లు ప్రకటించిన ఎన్‌టీఏ

జేఈఈ - అడ్వాన్స్‌డ్ - 2023 సిలబస్‌లో మార్పులు ఉంటాయని జాయింట్ అడ్మిషన్ బోర్డ్ గతంలోనే స్పష్టం చేసింది. అందుకు అనుగుణంగానే ఇటీవల కొత్త సిలబస్‌ను విద్యార్థులకు అందుబాటులో ఉంచింది. నిర్దిష్ట వ్యూహంతో అడుగులు వేస్తే.. అడ్వాన్స్‌డ్‌లో మెరుగైన స్కోర్ సాధించే అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు.

మూడు సబ్జెక్టుల్లోనూ మార్పులు

- జేఈఈ-అడ్వాన్స్‌డ్‌ను ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లలో నిర్వహిస్తారు. తాజా సిలబస్‌ను పరిశీలిస్తే.. ఈ మూడు సబ్జెక్ట్‌లోనూ మార్పులు చేశారు. కొన్ని కొత్త అంశాలను చేర్చారు.
- ఫిజిక్స్‌లో..జనరల్ ఫిజిక్స్,మెకానిక్స్, థర్మల్ ఫిజిక్స్, ఎలక్ట్రోమ్యాగ్నటిక్ వేవ్స్, ఆప్టిక్స్, ఫోర్స్‌డ్ అండ్ డ్యాంప్డ్ ఆసిలేషన్స్,ఈఎం వేవ్స్ అండ్ పోలరైజేషన్ అంశాలను కొత్తగా చేర్చారు. ఇదే సమయంలో సెమీ కండక్టర్స్ అండ్ కమ్యూనికేషన్స్‌ను తొలగించారు.
- మ్యాథమెటిక్స్‌లో.. సొల్యూషన్ ఆఫ్ ట్రయాంగిల్ చాప్టర్‌ను తొలగించి.. దాని స్థానంలో కొత్తగా స్టాటిస్టిక్స్, అల్జీబ్రా, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, మాట్రిసెస్ తదితర అంశాలను చేర్చారు.
- కెమిస్ట్రీలో.. న్యూక్లియర్ కెమిస్ట్రీ విభాగాన్ని తొలగించారు. అదే విధంగా బయో కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ టాపిక్స్‌లో మార్పులు చేశారు. గ్యాసెస్ అండ్ లిక్విడ్స్, అటామిక్ స్ట్రక్చర్, కెమికల్ బాండింగ్, మాలిక్యులర్ స్ట్రక్చర్, స్టేట్స్ ఆఫ్ మేటర్ విభాగాల్లోనూ కొత్త అంశాలను చేర్చారు. రిడాక్స్ రియాక్షన్స్, సాలిడ్ స్టేట్ సొల్యూషన్స్ వంటి వాటిని కూడా చేర్చారు.

జేఈఈ-మెయిన్‌కు కొనసాగింపుగా

జేఈఈ-అడ్వాన్స్‌డ్ సిలబస్‌లోని మార్పులను పరిశీలిస్తే.. జేఈఈ-మెయిన్ సిలబస్‌కు కొనసాగింపుగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరికొంతమంది జేఈఈ-మెయిన్ సిలబస్ కంటే.. జేఈఈ అడ్వాన్స్‌డ్ కొత్త సిలబస్‌ను ఆకళింపు చేసుకోవడం సులభమని అంటున్నారు. మెయిన్ పరీక్షల సిలబస్‌ను ఆసాంతం చదివిన వారికి అడ్వాన్స్‌డ్ సిలబస్‌పై అవగాహన పొందడం పెద్ద కష్టమేమీ కాదని పేర్కొంటున్నారు.

సీబీఎస్ఈ విద్యార్థులకు అనుకూలం

జేఈఈ-అడ్వాన్స్‌డ్ సిలబస్‌లో మార్పులు సీబీఎస్ఈ బోర్డ్ +1,+2 విద్యార్థులకు అనుకూలంగా ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. సీబీఎస్ఈ సిలబస్‌ను పరిగణనలోకి తీసుకుని మార్పులు చేసినట్లుగా ఉందని పేర్కొంటున్నారు. దీంతో ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అధ్యయనం చేసిన వారికి ఎక్కువ అనుకూలత ఉంటుందని అంటున్నారు. స్టేట్ బోర్డ్‌ల పరిధిలో ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులు చదివిన వారికి ఇబ్బంది ఎదురవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు.. గత కొన్నేళ్లుగా సీబీఎస్ఈ సిలబస్‌ను ఆధారంగా చేసుకుని తమ బోర్డ్ సిలబస్‌లోనూ మార్పులు చేశాయని.. దీనివల్ల విద్యార్థులు అంతగా ఆందోళన చెందక్కర్లేదని సబ్జెక్ట్ నిపుణులు భరోసా కల్పిస్తున్నారు.

శిక్షణ అవసరం లేని విధంగా

వాస్తవానికి విద్యార్థులు బోర్డ్ సిలబస్‌తో మెయిన్ పరీక్షకు సన్నద్ధమవుతూ విజయం సాధిస్తున్నారు. కాని అడ్వాన్స్‌డ్‌లో మెరుగైన స్కోర్ కోసం మాత్రం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. దీంతో మెయిన్ తర్వాత అడ్వాన్స్‌డ్ పరీక్ష తేదీకి మధ్య ఉండే వ్యవధిలో శిక్షణ ఒత్తిడి, ప్రిపరేషన్ ఆందోళన వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీనికి పరిష్కారంగానే తాజా మార్పులు చేసినట్లు ఐఐటీల వర్గాలు పేర్కొంటున్నాయి. మెయిన్ సిలబస్‌కు కొనసాగింపుగా అడ్వాన్స్‌డ్ సిలబస్‌లో మార్పులు చేయడం ద్వారా విద్యార్థులు ఒకే సమయంలో రెండు పరీక్షలకు సన్నద్ధత పొందే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నాయి.

వెబ్‌సైట్‌లో కొత్త సిలబస్

జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 కొత్త సిలబస్‌ను అడ్వాన్స్‌డ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు దీన్ని డౌన్‌లోడ్ చేసుకుని అవగాహన పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

గత ఏడాది మాదిరిగానే పరీక్ష

జేఈఈ-అడ్వాన్స్‌డ్-2023 సిలబస్‌లో మార్పులు చేసిన నేపథ్యంలో పరీక్ష విధానంలోనూ మార్పులు ఉంటాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా రెండు పేపర్లుగా నిర్వహించే ఈ పరీక్షలో ఏమైనా మార్పులు ఉంటాయా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే గత ఏడాది మాదిరిగానే పరీక్ష విధానాన్ని కొనసాగించే అవకాశం ఉందని ఎక్కువ మంది నిపుణులు పేర్కొంటున్నారు.



గత పరీక్ష విధానం ఇలా

- అడ్వాన్స్‌డ్-2022 పరీక్షను రెండు పేపర్లుగా(పేపర్-1, పేపర్-2)గా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహించారు. ■ పేపర్-1లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ప్రతి సబ్జెక్ట్‌లో మూడు సెక్షన్లుగా పరీక్ష జరిగింది.
- మ్యాథమెటిక్స్‌లో మొదటి సెక్షన్‌ను 8 ప్రశ్నలతో 24 మార్కులకు, రెండో సెక్షన్‌ను 6 ప్రశ్నలతో 24 మార్కులకు, మూడో సెక్షన్‌ను 4 ప్రశ్నలతో 12 మార్కులకు నిర్వహించారు.
- ఫిజిక్స్‌లో..సెక్షన్-1లో 8 ప్రశ్నలు(24 మార్కులు),సెక్షన్-2లో 6 ప్రశ్నలు(24 మార్కులు), సెక్షన్-3లో 4 ప్రశ్నలు(12 మార్కులు) అడిగారు.
- కెమిస్ట్రీలో..సెక్షన్-1లో 8ప్రశ్నలు(24మార్కులు), సెక్షన్-2లో 6 ప్రశ్నలు(24 మార్కులు), సెక్షన్-3లో 4 ప్రశ్నలు(12 మార్కులు) అడిగారు.
- మొత్తంగా పేపర్-1ను ప్రతి సబ్జెక్ట్‌లో 18 ప్రశ్నలతో 60 మార్కులకు చొప్పున నిర్వహించారు.

పేపర్-2

పేపర్-2ను కూడా పేపర్-1 మాదిరిగా మూడు సబ్జెక్ట్‌లో.. ప్రతి సబ్జెక్ట్‌లో మూడు విభాగాలతో నిర్వహించారు. ప్రశ్నలు, మార్కుల విధానంలోనూ పేపర్-1 మాదిరిగానే.. ప్రతి సబ్జెక్ట్‌లో 18 ప్రశ్నలు, 60 మార్కులు చొప్పున కేటాయించారు. వాస్తవానికి గత మూడేళ్లుగా ప్రశ్నల సంఖ్యలో మార్పులు జరగట్లేదు. కాబట్టి ఈసారి కూడా ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చని, మార్కింగ్ విధానంలో ఏమైనా మార్పులు జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

జూన్4న జేఈఈ అడ్వాన్స్‌డ్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను జూన్ 4న నిర్వహిస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రకటించింది. ఉదయం 9నుంచి 12 గంటల వరకూ పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకూ పేపర్-2 ఉంటుందని పేర్కొంది. జేఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణులైన వారిలో టాప్ 2.50 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు అనుమతిస్తారు. ఇందులో వచ్చే ర్యాంకుల ఆధారంగా ఐఐటీల్లో సీట్లు కేటాయిస్తారు.

ప్రిపరేషన్ ఇలా

ఫిజిక్స్

ఎలక్ట్రో డైనమిక్స్;మెకానిక్స్;హీట్ అండ్ థర్మో డైనమిక్స్, ఎలక్ట్రో డైనమిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్‌ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్;సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌లో లోతైన అవగాహన ఏర్పరచుకుంటే మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు.

మ్యాథమెటిక్స్

కోఆర్డినేట్ జామెట్రీ, డిఫరెన్షియల్ కాలిక్యులస్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, మాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్. వీటితోపాటు 3-డి జామెట్రీ; కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ అల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్;పారాబోలా; క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్; థియరీ ఆఫ్ ఈక్వేషన్స్; పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్;బైనామియల్ థీరమ్; లోకస్ అంశాలపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి.

కెమిస్ట్రీ

కెమికల్ బాండింగ్, ఆల్కైల్ హలైడ్; ఆల్కహాల్ అండ్ ఈథర్, కార్బొనైల్ కాంపౌడ్స్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ, థర్మోడైనమిక్స్ అండ్ థర్మో కెమిస్ట్రీ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి. వీటితోపాటు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

కొత్త అంశాలపై ప్రత్యేక దృష్టి

విద్యార్థులు అడ్వాన్స్‌డ్-2023లో కొత్తగా చేర్చిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వీటికోసం కొంత ఎక్కువ సమయం కేటాయించాలి. అదే విధంగా మెయిన్ సిలబస్‌ను అడ్వాన్స్‌డ్ సిలబస్‌తో బేరీజు వేసుకోవాలి. ఉమ్మడిగా అంశాలకు, ప్రత్యేక అంశాల ప్రిపరేషన్‌కు వేర్వేరుగా సమయాన్ని కేటాయించాలి.

ముఖ్య సమాచారం

- సిలబస్‌లో మార్పులతో అడ్వాన్స్‌డ్-2023 నిర్వహణ. ■ అడ్వాన్స్‌డ్ వెబ్‌సైట్‌లో నూతన సిలబస్.
- సీబీఎస్ఈ విద్యార్థులకు అనుకూలంగా ఉందనే అభిప్రాయాలు.
- జేఈఈ మెయిన్ సిలబస్ అంశాల కొనసాగింపుగా అడ్వాన్స్‌డ్ సిలబస్.
- **జేఈఈ అడ్వాన్స్‌డ్ నూతన సిలబస్ వివరాలకు వెబ్‌సైట్:** https://jeeadv.ac.in

గ్రూప్‌-1 మెయిన్స్‌కు తండ్రీ తనయుడు


బాలనర్సయ్య, సచిన్

యాదగిరిగుట్ట రూరల్: గ్రూప్‌–1 ప్రిలిమ్స్ పరీక్ష రాసి మెయిన్స్‌కు తండ్రీ కొడుకులు అర్హత సాధించారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం రామాజీపేట గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు ఏలూరు బాలనర్సయ్య (48), ఏలూరు సచిన్ (22) శనివారం విడుదలైన ఫలితాల్లో ఒకేసారి ఈ ఘనత సాధించారు. బాలనర్సయ్య ఎల్‌ఐసీలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. సచిన్ హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటూ గ్రూప్‌–1కోసం ప్రయత్నిస్తున్నారు. కాగా తండ్రి ఇంతకుముందే గ్రామంలో సర్పంచ్‌గా కూడా విధులు నిర్వర్తించారు. ఇద్దరూ ఒకేసారి మెయిన్స్‌కి అర్హత సాధించడం ఆనందంగా ఉందని బాలనర్సయ్య చెప్పారు.

‘ఇంటి యజమానే చెల్లించాలి’

హన్మకొండ: ఇంటి యజమానులు విద్యుత్ కనెక్షన్ తీసుకున్న సమయంలో తక్కువ లోడ్‌తో కనెక్షన్ తీసుకుంటారని, అనంతరం అవసరాలు పెరుగడంతో లోడ్ పెరుగుతుందని, పెరిగిన లోడ్‌పై రెండు నెలల డిపాజిట్‌ను ఏసీడీ (అదనపు వినియోగ డిపాజిట్) రూపంలో విధిస్తున్నట్లు టీఎస్ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డిపాజిట్‌కు విద్యుత్ సంస్థ ఏడాదికి ఒకసారి వడ్డీ చెల్లిస్తుందన్నారు. డిపాజిట్ రూపంలో ఉంటున్నందున, దీనిని కిరాయిదారుడు కాకుండా ఇంటి యాజమాని చెల్లించడం సబబుగా ఉంటుందన్నారు. ఇంటి యజమానికి విద్యుత్ అవసరం తీరి కనెక్షన్ తొలగించుకునే సమయంలో సెక్యూరిటీ డిపాజిట్ మొత్తాన్ని తిరిగి చెల్లించనున్నట్లు తెలిపారు. చాలామంది వినియోగదారులు ఏసీడీని కిరాయిదారుడు చెల్లించాలా? లేదా ఇంటి యజమాని చెల్లించాలా? అని సందేహం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈమేరకు స్పష్టంచేశారు. వినియోగదారులకు ఇంకా సందేహాలుంటే విద్యుత్ రెవెన్యూ కార్యాలయం, బిల్లులు చెల్లించే కౌంటర్ వద్ద నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

అద్భుతమైన శిల్పకళా నిలయం...
పచ్చల సోమేశ్వరాలయం


విగ్రహాల గురించి విదేశీయులకు వివరిస్తున్న శివనాగిరెడ్డి

రామగిరి (నల్లగొండ): పానగల్లు పచ్చల సోమేశ్వరాలయంలో శిల్పకళా సౌందర్యం అద్భుతమని విదేశీ వారసత్వ నిపుణులు అభిప్రాయపడ్డారు. నల్లగొండ సమీపంలోని పానగల్లు పచ్చల సోమేశ్వరాలయాన్ని దక్కన్ హెరిటేజ్ ఫౌండేషన్స్, అమెరికన్ అసోసియేషన్ సభ్యులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా దక్కన్ హెరిటేజ్ ఫౌండేషన్స్ సహ వ్యవస్థాపకురాలు హెలెన్ ఫిలాన్ మాట్లాడుతూ, పచ్చల సోమేశ్వరాలయం అద్భుతమైన వాస్తుకళకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. ప్రముఖ పురావస్తు నిపుణుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి పానగల్లు విశిష్టతను విదేశీయులకు తెలియజేశారు. అనంతరం సమీపంలోని ఛాయా సోమేశ్వరాలయాన్ని వారు సందర్శించారు. అక్కడి శివలింగంపై పడుతున్న నీడను చూసిన విదేశీ వారసత్వ నిపుణులు ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో దక్కన్ హెరిటేజ్ ఇండియా కార్యవర్గ సభ్యులు శరత్‌చంద్ర, న్యూయార్క్ సిటీ కాలేజీ ప్రొఫెసర్ మోలీ ఆట్కిన్, అమెరికన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ట్రస్టీ ఎలెనా వెర్నర్ పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.